ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 23.05.2025 | సంపుటి : 11 సంచిక : 304 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# తడిసిన ధాన్యం కొనండి.. రైతులకు అండగా నిలవండి



**చివరి గింజ వరకు కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం**

- రబీ సీజన్‌లో 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 2023 రబీతో పోలిస్తే 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికం
- ధాన్యం కొనుగోలులో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి): ధాన్యం కొనుగోలు అంశంలో బి.ఆర్.ఎస్ అసత్యప్రచారనికి పూనుకుని ప్రజల్లో గందర గోళం సృష్టిస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ రబీ సీజన్ లో ఈ రోజు సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన గణాంకాలతో వెల్లడించారు. అదే బి.ఆర్ ఎస్ పాలనలో అంటే 2022-23 రబీ సీజన్ లో నాటి పాలకులు మే 22 నాటికి కొనుగోలు చేసింది కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే నని ఆయన పేర్కొన్నారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో సాగు అయిన చివరి రబీ సీజన్ లో నాటి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చి చూస్తే ఈ ప్రభుత్వ

మిగతా 2లో..

# శ్రీశైలం, సాగర్ నీటి పంపకాలు

## ఏపీకి 4 టీఎంసీలు.. తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు



హైదరాబాద్(జనంసాక్షి): వేసవి నీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ఏపీకి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు విడుదల చేయనున్నారు. ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలంలో 800 అడుగులు, సాగర్‌లో 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఏపీ అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. శ్రీశైలంలో జులై నెలాఖరు వరకు 800 అడుగుల కనీస మట్టం కొనసాగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# పాక్‌ను లొంగదీసుకున్నాం

**ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం**

**సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం**

- పాకిస్తాన్‌తో ఇకపై ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు
- ఒకవేళ ఉంటే అది కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే
- ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఇక ఊరుకునేది లేదు
- భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదని సందేశమిచ్చాం
- మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు
- రాజస్థాన్ బికనీర్ వేదికగా మరోసారి పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ



జయపుర(జనంసాక్షి): మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి

మిగతా 2లో..

## 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించిన మోదీ

- తెలంగాణలో రైల్వేల అభివృద్ధిలో వేగం పెంచాం
- దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

2లో



నాన్నకు ప్రేమతో..

# కవిత లేఖాస్త్రాం

- బీఆర్ఎస్ ఫ్యామిలీలో భగ్గుమన్న విభేదాలు
- పార్టీలో పనితీరుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసహనం
- బీజేపీకి చేరువుతున్న తీరును తప్పు పట్టిన కవిత-
- పార్టీలో ఎవరికీ అందనంత దూరంగా కేసీఆర్ తీరు
- రజతోత్సవ సభలో సీనియర్లకు దక్కని ప్రాధాన్యం
- గులాబీ బాస్‌ను ప్రశ్నిస్తూ లేఖను సంధించిన తనయ

హైదరాబాద్,మే22(జనంసాక్షి): బిఆర్ఎస్ ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పదపదే చేస్తున్న ఆరోపణలు నిజం చేస్తూ కవిత రాసిన లేఖతో బటటబయలు అయ్యింది. దీంతో ఇప్పుడు బిఆర్ఎస్‌లో ఏం జరుగుతోందన్న వాదన జరుగుతోంది. తాజాగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ తీరుపట్ల ఎమ్మెల్సీ కవిత ధిక్కార స్వరం వినిపించారు. పార్టీ తీరుపై నేరుగా కేసీఆర్‌కే ప్రశ్నలు సంధించారు. తన సందేహాలను వ్యక్తం చేస్తూ గురువారం నాడు కేసీఆర్‌కు సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇంకా ఈ లేఖలో ఆమె కేసీఆర్‌కు ఎలాంటి ప్రశ్నలు సంధించారనే వివరాలను చూస్తే, పార్టీ తీరుపట్ల ఆమె అసమనంగా ఉన్నట్లు

మిగతా 2లో..



# విచారణ పూర్తయ్యాక నోటీసులెందుకు?

- వరంగల్ సభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామాకు తెరలేపారు
- కేసీఆర్ పేరు లేకుండా చేసేందుకే కుట్రలు
- కాళేశ్వరంను కాంగ్రెస్, బీజేపీ దొంగలే బాంబులు పెట్టి పేల్చారేమో?
- అందాల పోటీలతో దుబారా ఖార్చులు: కేటీఆర్

హైదరాబాద్,మే22(జనంసాక్షి):కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని, ఒక బ్యారేజీలో రెండు పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరోమారు మండిపడ్డారు. ఈ కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టి పేల్చేశారని నా అనుమానం అంటూ అసహనం వ్యక్తం చేశారు. పాలమూరులాగే కాళేశ్వరంలోనూ నిజం తెలుస్తుంది. చిల్లిగవ్వ పుట్టడం లేదంటూనే అందాల పోటీలు పెడుతున్నారు. రాష్ట్రం

మిగతా 2లో..

# ప్రపంచనగరంగా హైదరాబాద్

**అందుకోసం ఎన్ని నిధులైన వెచ్చించడానికి సీఎం రేవంత్ సిద్ధం**

హెరిటేజ్ కట్టడాలను కాపాడుకుంటూనే పాత నగర అభివృద్ధి
రూ.7400 కోట్లతో హైదరాబాద్ మహానగరానికి గోదావరి నది జలాలు
పాత నగరం అభివృద్ధి పురోగతిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైన వెచ్చించడానికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో పాత నగరం అభివృద్ధి పురోగతి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహా మేరకు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు

మిగతా 2లో..



# నేడు సంగారెడ్డికి సీఎం

హైదరాబాద్(జనంసాక్షి):నేడు సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించున్నున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించి, కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించనున్నారు. రూ. 494.67 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం అనంతరం పస్తాపూర్ లో ఏర్పాటు చేసిన బహిరం గసబకు హాజరవుతారు.

# ఈడీ హద్దులు దాటుతోంది

**సోదాలపై సుప్రీం సీరియస్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇటీవల సోదాలు జరిపారు. దీనిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈడీ అన్ని హద్దులు దాటుతోందని ఆక్షేపించింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ధర్మాసనం.. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించింది. టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఈడీ.. ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. ఇటీవల మే నెల

మిగతా 9లో..



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- జూన్ 2 కల్లా పైలట్ మండలంలో దరఖాస్తులన్నింటికి పరిష్కారం
- ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

ఖమ్మం (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, ఎదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధి పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను అధికారులు చిత్తశుద్ధి తో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల క్రింద మొదటి విడతగా ప్రతి మండలంలోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి జిల్లా వ్యాప్తంగా 875 ఇండ్లు మంజూరు చేయగా, 475 ఇండ్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. 420 కి పైగా ఇండ్లు బేస్మెంట్ లెవల్ పూర్తి చేయగా, మొదటి విడత లక్ష రూపాయలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం ఇండ్లు కట్టుకోవడానికి సిద్ధంగా లేని వారి నుండి అంగీకారం తీసుకొని, అర్హులైన మరొకరికి మంజూరు కు

మిగతా 2లో..

**ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా**

# ప్రాణాలను బలిగొంటున్నారు

**చర్చలకు రమ్మంటే కేంద్రం ససేమిరా అంటోంది**

**తీవ్రంగా ఖండించిన సీపీఐ(ఎం)**

హైదరాబాద్(జనంసాక్షి):మావోయిస్టు అధిపతి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని కేంద్రానికి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ససేమిరా అంటూ ఒప్పుకోలేదని, ఇప్పుడు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రాణాలను బలిగొంటోందని ఆక్షేపించింది. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో ఓ ప్రకటన విడుదల చేసింది. అటు కేంద్రం గానీ, ఇటు భాజపా నేతృత్వంలోని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గానీ చర్చలకు అంగీకరించడంలేదని ప్రకటనలో పేర్కొంది. "చర్చలకు ముందుకు రాకుండా.. 'నిర్మూలన' అనే అమానవీయ విధానాన్ని కేంద్రం అవలంబిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టుల

మిగతా 2లో..

# పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదు

- దాయాది అధికారులతో హాట్‌లైన్ ద్వారానే నేరుగా చర్చలు జరిపాం
- స్పష్టం చేసిన జైశంకర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-పాక్ అణుయుద్ధాన్ని ఆపానని, కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి తానే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకుంటున్నారు. ఆ ఘనత తనకే దక్కాలని తాపత్రయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు ఆయుధాలు ఎగుమతి చేస్తోన్న రెండో అతిపెద్ద దేశం నెదర్లాండ్స్‌కు చెందిన టీవీ ఇంటర్వ్యూలో మన విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణపై తమ రెండు దేశాలు నేరుగా చర్చలు జరిపాయన్నారు"రెండు దేశాల ప్రతినిధులు హాట్‌లైన్‌లో మాట్లాడుకునేలా మాకు తగిన వ్యవస్థ ఉంది. మే 10న పాక్ ఆర్మీ నుంచి మాకు ఒక సందేశం వచ్చింది. ఫైరింగ్ ఆపడానికి తాము సిద్ధంగా ఉన్నామని

మిగతా 2లో..



## పాక్ ఉగ్ర విత్తనాలు నాటుతోంది

**డబ్ల్యూహెచ్‌వోలో భారత దౌత్యవేత్త ప్రసంగం**

2లో

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం

**మద్దతు పలికిన యూఏఈ, జపాన్**



# జమ్మూకశ్మీర్‌లో మళ్లీ కాల్పుల మోత

**జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల బీకరపోరు**

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లో మరోసారి కాల్పుల మోత మోగింది కిష్త్వర్ జిల్లాలోని సింగ్‌పొరా ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకరంగా ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో నలుగురు ఉగ్రవాదులను బలగాలు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సిఉంది. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీని తర్వాత జమ్మూకశ్మీర్‌లో

మిగతా 2లో..

# ఐఎస్ఐ ఏజెంట్లని తెలిసినా సంప్రదింపులు కొనసాగించింది

**జ్యోతి మల్హోత్రాపూర్తి స్పృహతోనే కార్యకలాపాలు కొనసాగించింది : హరియాణా పోలీసులు**



హిస్సార్(జనంసాక్షి): పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై దర్యాప్తు కొనసాగుతోంది. ఆమె పూర్తి స్పృహతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించిందని హరియాణా పోలీసులు వెల్లడించారు. అయితే, ఉగ్రవాదులతో ఆమెకు సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అంతేగాక,

మిగతా 2లో..

# గాజా ఆక్రమించుకోవాలి.. అక్కడ స్థిరపడాలి



- అక్కడి ప్రతి చిన్నారీ మాకు శత్రువే..
- ఇజ్రాయెల్ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

టెల్‌అవీవ్(జనంసాక్షి):ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలతో గాజాలోని సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. బతికున్నవారు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ నగరం గురించి ఇజ్రాయెల్ నేత మోషే ఫైగ్లిన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఉన్న ప్రతి చిన్నారీ తమకు శత్రువేనని వ్యాఖ్యానించారు. "మా శత్రువు హమాస్, దాని మిలిటరీ వింగ్ మాత్రమే కాదు. గాజాలోని ప్రతిబిడ్డా మాకు శత్రువే. ఆ నగరాన్ని మేం ఆక్రమించుకొని,

మిగతా 2లో..

## తడిసిన ధాన్యం కొనండి.. రైతులకు అండగా నిలవండి

హయాంలో ప్రస్తుత రబీ సీజన్లో అదే మే 22 నాటికి రాష్ట్ర ప్రభుత్వం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేసిందన్నారు.ఈ గణాంకాలే బి.ఆర్.ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి నిదర్శనమన్నారు.చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న రైతాంగ అనుకూల విధానాలతో అటు ఖరీఫ్ ఇటు రబీ లోనూ రికార్డు స్థాయిలో ధాన్యాం దిగుబడి అయ్యిందన్నారు.అత్యధికంగా దిగుబడి అయిన ధాన్యం దిగుబడిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను పెద్ద సంఖ్యలో పెంచామని ఆయన తెలిపారు.

## నాన్నకు ప్రేమతో.. కవిత లేఖాస్త్రాం

తెలుస్తోంది. బిజెపితో అంటకాగేలా వ్యవహారాలు ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నిర్ణయాలు, వ్యవహారాల పై సూటిగా ప్రశ్నలు సంధిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు. మై డియర్ డాడీ అంటూ కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తన సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు అంశంపై సిల్వర్ జూబ్లీ సభలో కూడా క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీజేపీ మీద రెండు నిమిషాలే మాట్లాడారని.. ఆ పార్టీపై ఇంకా బలంగా మాట్లాడాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటారేమో అనే చర్చ మొదలైందన్నారు. తాను సఫర్ అయ్యాను కదా.. బహుశా అందుకని కావొచ్చు అని కవిత తన లేఖలో పేర్కొన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని కవిత తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. కాంగ్రెస్‌పై గ్రాస్‌రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. కేసీఆర్ యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధపడుతున్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించండి అంటూ కూడా సూచనలు చేశారు.

## విచారణ పూర్తయ్యాక నోటీసులెందుకు?

దివాళా తీసిందంటూనే దుబారా ఖర్చులు చేస్తున్నరు. వరంగల్ మహాసభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామా మొదలుపెట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం ఒక ఇంజినీరింగ్ మార్వెల్ అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన అద్భుత కట్టడాలను అందగత్తెలకు చూపించారు. లక్షన్నర కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించారు. అందాల పోటీలు రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు మధ్య జరుగుతున్నట్టు ఉన్నాయి. మిస్ వరల్డ్ బ్యానర్ల మీద రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు ఫొటోలు చూశా.. వారిలో ఎవరు మిస్ వరల్డ్ పోటీదారులో అర్థం కాలేదంటూ ఎద్దేవా చేశారు. చార్మినార్ అగ్నిప్రమాదంపై రేవంత్ రెడ్డికి రివ్యూచేసే సమయం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కష్టంలో ఉన్న తల్లిలాంటి పార్టీని నమ్ముకొని ఉండే వారే నిజమైన కార్యకర్తలని కేటీఆర్ అన్నారు. అవకాశవాదులే సిగ్గులేకుండా పార్టీ మారుతారని విమర్శించారు. పార్టీ నుంచి పారిపోయిన వారి పేర్లు తీసుకొని వారిని పెద్దోళ్లను చేయొద్దన్నారు. పార్టీ కోసం కొట్లాడేవారికే అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలే రేవంత్ పాలనపై మండిపడుతున్నారని, ఇదేం పాలన అంటూ ఆ పార్టీ నాయకులే నిలదీస్తున్నారన్నారు. 'రాష్ట్రంలో కమిషన్ల పాలన కొనసాగుతున్నది. కమిషన్ల పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. 30 శాతం కమిషన్ లేనిదే ఫైళ్లు కదులుతలేవు. తమ ప్రభుత్వంలో ఫైల్‌లు కదలాలి అంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని కొండా సురేఖ చెప్పారు. మా ప్రభుత్వంలో మంత్రులు 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారు ఇంకొక కాంగ్రెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ కమిషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కాళేశ్వరం కమిషన్ అంటూ విమర్శలు గుప్పించారు. రెండు లక్షల రుణమాఫీ ఎంతమందికి చేశారు?. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రుణమాఫీ ఇచ్చింది పావు వంతే. రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోయాయి. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి లబ్ది జరిగింది. కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. రైతుల ఖాతాల్లో రైతు బంధు పైసలు పడ్తలేవు.. కానీ ఢిల్లీలో రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రం నెల నెలా టకీ టకీమని పడుతున్నాయ్. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ దొంగలే.. ఇద్దరినీ నమ్మొద్దు. అప్రమత్తంగా ఉండి.. ఇద్దరినీ ఎండగట్టాలి. తెలంగాణకు గుండె ధైర్యమైన గులాబీ జెండాను మల్లొక్కసారి మనమే ఎగురవేయాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన బుద్ధి చెప్పాలి. ఎవరికి టికెట్ వచ్చినా ప్రతీ కార్యకర్త తనకే అవకాశం వచ్చినట్టుగా కొట్లాడాలి. మళ్లీ నిర్మల్ జిల్లాలో గులాబీ జెండా ఎగిరేవరకు పోరాడుదామని కేటీఆర్ అన్నారు.

## ఈడీ హద్దులు దాటుతోంది

ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. దీనిపై తమిళనాడు సర్కారు హైకోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఈడీ సోదాలు జరుపుతోందని, విచారణ పేరిట టాస్మాక్ అధికారులను హింసిస్తోందని ఆరోపించింది. ఈ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేస్తూ.. ఈడీ దర్యాప్తునకు అంగీకరించింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈడీ తీరును తప్పుబట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. ఈ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ దర్యాప్తు సంస్థకు నోటీసులు జారీ చేసింది.సుప్రీం ఉత్తర్వులపై డీఎంకే హర్షం వ్యక్తంచేసింది. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు భాజపా చేస్తున్న కుట్రలకు ఇది చెంపపెట్టు లాంటిదని దుయ్యబట్టింది. ఆ పార్టీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, భాజపాయేతర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఆరోపించారు.

## గాజా అక్రమించుకోవాలి.. అక్కడ స్థిరపడాలి

అక్కడ స్థిరపడాలి. అక్కడ ఒక్క బిడ్డ కూడా మిగలదు. దానికి మించి మరో విజయం లేదు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఐడీఎఫ్ విశ్రాంత చీఫ్ యాయిర్ గొలాన్ మండిపడ్డారు. చిన్నారులను చంపడం హాబీగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈక్రమంలోనే మోషే నుంచి స్పందన వచ్చింది. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్–హమాస్ మధ్య జరుగుతోన్న పోరులో 53 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. ఐడీఎఫ్ చర్యలపై అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్‌తో స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం కోసం జరుగుతోన్న చర్చలను బ్రిటన్ ఆపివేసింది. మార్చి 2 నుంచి గాజాలోకి మానవతా సహాయాన్ని నెతన్యాహు ప్రభుత్వం నిలిపివేసింది. మిత్ర దేశాల నుంచి దౌత్యపరంగా వచ్చిన ఒత్తిడితో పరిమిత మానవతా సాయానికి ఇటీవల నెతన్యాహు అంగీకరించారు.గాజా మొత్తాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 'గిడియన్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ సైన్యం గాజా వ్యాప్తంగా భూతల దాడులు ప్రారంభించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "మా పోరాటం తీవ్ర స్థాయిలో ఉంది. పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదే లేదు" అని పేర్కొన్నారు.

# పాక్‌ను లొంగదీసుకున్నాం

చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్–ఎ–మొహమ్మద్, లష్కరే–ఎ–తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు.'సిందూరం భగ్గుమం టే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశా రు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణబెదిరిం పులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు' అని గట్టి హెచ్చరికలు చేశారు.

### 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించిన మోదీ

**జైపూర్,హైదరాబాద్(జనంసాక్షి):** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిని జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి.కాగా తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు."తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. అని అన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్వాక్రా ద్వారా రుణాలు అవసరమయ్యే వారికి అందించాలని, డ్రాప్ అయ్యే వారిని రెండో విడతలో కేటాయించాలని అన్నారు. ప్రతి సోమవారం విడతల వారి డబ్బును మంజూరు చేసి, లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు.రెండో విడత క్రింద నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించగా, జిల్లాకు 17983 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లక్ష్యం కేటాయించామన్నారు. 12276 ఇండ్లకు సంబంధిత నియోజకవర్గాల నుండి మంజూరు కు ప్రతిపాదనలు రాగా, ఇప్పటివరకు 7212 ఇండ్లు ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం పొంది, జాబితా అందిందన్నారు.డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి, లబ్ధిదారుల జాబితా వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు విధి విధానాలు ఖచ్చితంగా అమలు పర్చాలన్నారు. కడు పేదవారు, ఇండ్ల స్థలం లేనివారిని ఎంపిక చేయాలన్నారు.భూ భారతి–2025 క్రింద ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేసి, మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించామన్నారు. రెండో విడతగా జిల్లాలోని బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా 3264 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 1786 సాదా బైనామ దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. కోర్ట్ నుండి సాదా బైనామా విషయమై కేస్ వెకేట్ కాగానే, దరఖాస్తులు పరిష్కారం చేసేలా విచారణ లు, సర్వేలు పూర్తిచేసి, సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూమి, భూసేకర చేసిన భూమి విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఉన్న పేదవారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సిసిఎల్ఏ నుండి ఏలాంటి ఉత్తర్వులు కావాలన్న సమాచారం ఇవ్వాలన్నారు.జిల్లాలోని ఎర్రుపాలెం మండలం మూలుగుమాడును రీ సర్వే కి పైలట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు.

## పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదు

దాని సారాంశం" అని జైశంకర్ స్పష్టంచేశారు. అయితే ఈ ప్రక్రియలో అమెరికా ఎక్కడ ఉందని ఇంటర్వ్యూలో ప్రశ్న ఎదురైంది. అమెరికా.. అమెరికాలోనే ఉందని మంత్రి సూటిగా బదులిచ్చారు. అలాగే ఉద్రిక్తతల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను వెల్లడించారు. "అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మన ప్రధానితో మాట్లాడారు. ఆ దేశ విదేశాంగ మంత్రి నాకు ఫోన్ చేశారు. వారు పాకిస్థాన్‌తోను మాట్లాడారు. ఒక్క అమెరికానే కాదు మిగతా దేశాలు కూడా మనతో సంప్రదింపులు జరిపాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నప్పుడు.. ఇతర దేశాల నుంచి కాల్స్ రావడం సహజమే. కాల్పుల విరమణ గురించి భారత్–పాక్ నేరుగా మాట్లాడుకున్నాయి. కాల్పులు ఆగాలంటే వారు (పాక్) నేరుగా మాతో మాట్లాడాలని అమెరికాతో సహ అన్ని దేశాలకు స్పష్టంచేశాం" అని మంత్రి క్లారిటీ ఇచ్చారు.

పాక్ నాయకత్వం, ఆర్మీ చీఫ్‌పై విమర్శలు..

పాక్ నేతలు, మరీ ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మత ఛాందసవాదంపై జైశంకర్ విమర్శలు చేశారు. "మతం గురించి అడిగి తెలుసుకున్న తర్వాత కుటుంబసభ్యుల ముందే 26 మందిని దారుణంగా హత్య చేశారు. మతపరమైన విభేదాలు సృష్టించడానికి మతం అనే అంశాన్ని ఉద్దేశపూర్వకంగా ముందుకుతెచ్చారు" అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని వెల్లడించారు.

ట్రంప్ వ్యాఖ్యలను మోదీ తిరస్కరించలేదు: కాంగ్రెస్

కాల్పుల విరమణ ఒప్పందం గురించి ట్రంప్ పదేపదే చేసిన ప్రకటనలపై రాజకీయంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ మరోసారి స్పందించింది. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను ప్రధాని మోదీ ఒక్కసారి కూడా తిరస్కరించలేదని, ఆ మౌనానికి అర్థం ఏంటని ప్రశ్నించింది. ఇదే అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# హైదరాబాదును ప్రపంచ నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం

నిర్వహించిన ఈ సమావేశానికి హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని శాసనసభ్యులు హాజరయ్యారు. హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని చార్మినార్, మలక్ పేట్, కార్వాన్, యాకుత్ పురా, చంద్రయాణ్ గుట్ట, బహదూర్పుర, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పురోగతి పనులపై ఒక్కొక్కటిగా సమీక్షించారు. వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ హైదరాబాద్ పాత నగరంలో ఉన్న వారసత్వ నిర్మాణాలను కాపాడుకుంటూ పాత నగరాన్ని బాగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి గత బడ్జెట్లో పది వేల కోట్ల రూపాయలు కేటాయించామని, ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన చరిత్ర ముందెన్నడు లేదన్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళుతుందని అందులో భాగంగానే మూసి పునర్జీవం, మెట్రో రైల్ విస్తరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి గత సంవత్సరం బడ్జెట్లో 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లుగానే, ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో నిధులు వెచ్చించి నగర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున హైదరాబాద్ మహానగర అభివృద్ధికి నిధులు ఖర్చు చేయలేదని, ఆ ఘనత మా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.నగర ప్రజల తాగునీటి కోసం 7400 కోట్ల రూపాయలతో గోదావరి నది జలాలు తీసుకొస్తున్నాం హైదరాబాద్ నగరవాసులకు కృష్ణా, గోదావరి నది జలాల ద్వారా తాగునీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పాలకులు అదనంగా ఒక్క ఎంఎల్డి నీటిని హైదరాబాదుకు తీసుకురాలేదన్నారు. రానున్న ఐదు సంవత్సరాలకు హైదరాబాదు నగర వాసులకు సరిపోను మంచినీటిని సరఫరా చేయడానికి 7400 కోట్ల రూపాయలతో గోదావరి ఫేజ్ 2, ఫేజ్ –3 ద్వారా 20 టీఎంసీల గోదావరి నీళ్లను తీసుకురానున్నమని చెప్పారు. ఇందులో ఐదు టీఎంసీలు మూసి పునర్జీ కోసం, 15 టిఎంసిలు హైదరాబాద్ నగర ప్రజల తాగు నీటికి వాడుతామని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 2014 ముందు ఆనాటి ప్రభుత్వాలు 25 ఎస్టీపీలు నిర్మాణం చేయగా, 10 సంవత్సరాల కాలంలో

## జమ్మూకశ్మీర్‌లో మళ్లీ కాల్పుల మోత

భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇటీవల కుల్గాం, షోపియాన్‌లలో రెండు వేర్వేరు ఆపరేషన్లను భద్రతా బలగాలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్, దానిని మన దేశంపైకి ఎగదోస్తున్న తీరును ప్రపంచ దేశాల దృష్టికి తీసుకువెళ్లేందుకు అఖిలపక్ష బృందాలను మన ప్రభుత్వం విదేశాలకు పంపించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జపాన్‌కు వెళ్లిన బృందాలు.. పాక్ దుశ్చర్యలు, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ఆయా దేశాల నాయకులకు వివరించే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో వారి నుంచి భారత్‌కు పూర్తి మద్దతు లభిస్తున్నట్లు అక్కడున్న మన రాయబార కార్యాలయాలు వెల్లడిస్తున్నాయి.శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని అఖిలపక్ష బృందం యూఏఈలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో అక్కడి మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రముఖులు, మేధావులతో భేటీ అవుతోంది. ఇప్పటికే రెండు కీలక సమావేశాల్లో పాల్గొంది. ఈ సందర్భంగా పాక్ నుంచి ఎదురవుతున్న ఉగ్ర ముప్పు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను వారికి మన బృందం వివరించింది. ఈ క్రమంలో భారత్ చేపట్టిన దౌత్యపరమైన కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించిన యూఏఈ అధికారులు.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా రూపుమాపాల్సిందేనని ఉద్ఘాటించారు. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా సారథ్యంలో జపాన్‌లో పర్యటిస్తోన్న అఖిల పక్ష బృందం కూడా అక్కడి నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తోంది. జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తీసుకున్న చర్యలను ప్రశంసించారు. ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడే వారిని శిక్షించాల్సిందేనన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా జపాన్ నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## ఐఎస్ఐ ఏజెంట్లని తెలిసీనా జ్యోతి సంప్రదింపులు జరిపింది

సాయుధ దళాల గురించి కూడా ఆమెకు అవగాహన లేదని హిస్సార్ ఎస్పీ వెల్లడించారు."ఉగ్ర ముఠాలతో గానీ, ఉగ్రవాదులతో గానీ ఆమెకు సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను మేం గుర్తించలేదు. ఉగ్ర కార్యకలాపాల్లోనే ఆమె పాలుపంచుకున్నట్లు సాక్ష్యాల్లేవు. ఇక, పాక్ ఇంటెలిజెన్స్ అధికారులను పెళ్లి చేసుకోవాలనుకున్నట్లు గానీ, మతం మార్చుకోవాలని అనుకున్నట్లు గానీ నిర్ధరించే పత్రాలేవీ మాకు దొరకలేదు. అయితే, ఆమె మాట్లాడుతున్న వారిలో పాక్ గూఢచర్య సంస్థకు చెందిన వారు ఉన్నారని తెలిసినప్పటికీ.. జ్యోతి వారితో సంప్రదింపులు కొనసాగించారు. ఇక, మన సాయుధ దళాల ప్రణాళికల గురించి ఆమెకు అవగాహన ఉన్నట్లు అన్పించడం లేదు" అని హిస్సార్ ఎస్పీ పేర్కొన్నారు.ఇక, జ్యోతి డైరీ గురించి మీడియాలో వస్తున్న కథనాలపైనా ఎస్పీ స్పందించారు. "పాక్ గూఢచారులతో ఆమెకున్న సంబంధాలకు సంబంధించిన కేసులో ఆమెను రిమాండ్‌లోకి తీసుకున్నాం. ఇదే సమయంలో కొన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆమెను విచారించాయి. అయితే, ఏ ఇతర కస్టడీకి జ్యోతిని అప్పగించలేదు. మరోవైపు, ఆమె డైరీలోని కొన్ని పేజీలంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అలాంటివేవీ మేం స్వాధీనం చేసుకోలేదు. మా దగ్గర ఎలాంటి డైరీ లేదు. ఆమెకు చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ వస్తువులను మాత్రమే స్వాధీనం చేసుకున్నాం. వాటిని పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపించాం" అని హిస్సార్ ఎస్పీ వెల్లడించారు.ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్‌జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు పాక్ హైకమిషన్ ఉద్యోగి అయిన డానిష్‌తో పరిచయమైంది. అనంతరం ఆమె ఆ దేశ గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి.. డానిష్‌తో మాట్లాడినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఆమెను ప్రశ్నించారు. మరోవైపు, ఆమె పోలీసు కస్టడీని కోర్టు మరో నాలుగు రోజులు పొడిగించింది.

## ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రాణాలను బలిగొంటున్నారు

అంతానికి గడువు దగ్గరపడుతోందని పదేపదే చెబుతున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా చర్చలు అనవసరమంటున్నారు. ఈ ఇద్దరి తీరు ఫాసిస్టుల మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని సీపీఐ (ఎం) ప్రకటనలో పేర్కొంది. ప్రజలు, పలు రాజకీయ పార్టీలు చర్చలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వాలకు చెవికెక్కడం లేదని ఆరోపించింది.మావోయిస్టు చీఫ్ కేశవరావు ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఇదో మైలురాయి విజయం అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌ను సీపీఐ(ఎం)తో సహా సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ఖండించాయి. ఘటనపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశాయి. కేశవరావును చట్టబద్ధంగా అరెస్టు చేయకుండా ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు.. ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని సీపీఐ పేర్కొంది.

## పాక్ ఉగ్ర విత్తనాలు నాటుతోంది..

– డబ్ల్యూహెచ్‌వోలో భారత దౌత్యవేత్త ప్రసంగం

న్యూయార్క్(జనంసాక్షి):ఓవైపు ఉగ్ర విత్తనాలు నాటుతూనే.. మరోవైపు తామే బాధితులం అని నటించొద్దని పాకిస్థాన్‌కు భారత దౌత్యవేత్త అనుపమ సింగ్ హితవు పలికారు.జెనీవాలోని డబ్ల్యూహెచ్‌వో ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆమె ప్రసంగానికి సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతుంది.'పాకిస్థాన్ నేల మీద నుంచే ఉగ్రవాదులు, దాని నిర్వాహకులు పుట్టుకొస్తున్నారనే విషయం మరచిపోకూడదు. వారికి బుద్ధి చెప్పేందుకే భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. దాయాది దేశంలోని ఉగ్రస్థావరాలను, వారి మౌలిక సదుపాయాలను నేలకూల్చింది. ఆ దేశ పౌరులు లక్ష్యంగా కానీ, వారికి హాని కలిగించేలా కానీ భారత్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సింధూ జలాల ఒప్పందం రద్దుపై కూడా పాక్ తప్పుడు కథనాలను ప్రచారం చేసింది. దాన్ని మేం సమర్థమంతంగా తిప్పికొట్టామన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం–6**
**(ప్రాథమిక ప్రకటన)**

(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్–11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 17/2025 తేది:20-05-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి తేది:16-05-2025
ఫైల్ నెం.జి/2299/2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఎ) తేది:13-05-2025
యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.ఎ/22/2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశాను సారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (యం) మండలం రహీంఖాన్ పేట గ్రామములో విస్తీర్ణం ఎ.3.14 1/2 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.108 I&CAD (LA.R&R/A2) శాఖ, తేది: 31.10.2017 ద్వారా బునాది గాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం–2013లోని చాప్టర్–II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్–III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరిగారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్)గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ (యం) మండలం రహీంఖాన్ గ్రామములో విస్తీర్ణం ఎ.3.14 1/2 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

**జిల్లా:యాదాద్రి భువనగిరి** **మండలం: ఆత్మకూర్ (యం)**
**గ్రామం: రహీంఖాన్**

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు/ కట్టడములు |
|---|---|---|---|---|
| 155 ఖుష్కి/పట్టా 0.13 | దుంప సుజాత భర్త వెంకటేష్ గాదె శ్రీలక్ష్మి భర్త వీరారెడ్డి | దుంప సుజాత భర్త వెంకటేష్ గాదె శ్రీలక్ష్మి భర్త వీరారెడ్డి | 0.13 | - |
| 156 ఖుష్కి/పట్టా 0.13 1/2 | రేగు పద్మ భర్త రాజయ్య కర్రే రేణుకా భర్త నర్సయ్య కర్రే లక్ష్మి భర్త నర్సయ్య దుంప సుజాత భర్త వెంకటేష్ శీల బుచ్చయ్య తండ్రి బాలయ్య దుంప అందాలు భర్త అంజయ్య గుర్రంకొండ విజయ్ ప్రవీణ్ తండ్రి గంగాధర్‌రావు బద్దం స్వరూప భర్త సంజీవరెడ్డి కొల్లోజు మహాలక్ష్మి భర్త వెంకటాచారి మల్లాడి అనిత భర్త కిరణ్ కుమార్ కొండకింది భార్గవి భర్త వెంకట్‌రెడ్డి రోడాం నర్సింహారెడ్డి తండ్రి యెర్రమ్‌రెడ్డి పొన్నెకంటి వసంత బాబు తండ్రి అప్పారావు యేండ్లురి శేషగిరిరావు తండ్రి అమరయ్య | రేగు పద్మ భర్త రాజయ్య కర్రే రేణుకా భర్త నర్సయ్య కర్రే లక్ష్మి భర్త నర్సయ్య దుంప సుజాత భర్త వెంకటేష్ శీల బుచ్చయ్య తండ్రి బాలయ్య దుంప అందాలు భర్త అంజయ్య గుర్రంకొండ విజయ్ ప్రవీణ్ తండ్రి గంగాధర్‌రావు బద్దం స్వరూప భర్త సంజీవరెడ్డి కొల్లోజు మహాలక్ష్మి భర్త వెంకటాచారి మల్లాడి అనిత భర్త కిరణ్ కుమార్ కొండకింది భార్గవి భర్త వెంకట్‌రెడ్డి రోడాం నర్సింహారెడ్డి తండ్రి యెర్రమ్‌రెడ్డి పొన్నెకంటి వసంత బాబు తండ్రి అప్పారావు యేండ్లురి శేషగిరిరావు తండ్రి అమరయ్య | 0.10 1/2 | |
| | దుంప ఇద్దయ్య తండ్రి అంజయ్య | దుంప ఇద్దయ్య తండ్రి అంజయ్య | 0.02 | - |
| | యెల్లంది శ్రీనివాస్‌రెడ్డి తండ్రి సర్వరెడ్డి | యెల్లంది శ్రీనివాస్‌రెడ్డి తండ్రి సర్వరెడ్డి | 0.00 3/4 | - |
| 153 ఖుష్కి/పట్టా 0.09 | కర్రే శ్రీలత భర్త శ్రీశైలం కర్రే చంద్రశేఖర్ తండ్రి పరుశరాములు | కర్రే శ్రీలత భర్త శ్రీశైలం కర్రే చంద్రశేఖర్ తండ్రి పరుశరాములు | 0.00 3/4 | - |
| | రేగు ఉమా భర్త రాజయ్య సూది మహేందర్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి పట్టి సరిత తండ్రి భాస్కర్‌రెడ్డి ఎమ్మడి పుష్పలతా భర్త దామోదర్‌రెడ్డి ఇరుకుల వెంకన్న తండ్రి రామలింగయ్య గుమ్మి రాణి సంయుక్త భర్త మహేందర్‌రెడ్డి | దుంప శ్రీశైలం | 0.05 1/4 | - |
| | ఉట్కూరి శోభ భర్త నర్సింహారెడ్డి | ఉట్కూరి శోభ భర్త నర్సింహారెడ్డి | 0.01 1/2 | - |
| | శీల బుచ్చయ్య తండ్రి బాలయ్య | శీల బుచ్చయ్య తండ్రి బాలయ్య | 0.01 1/2 | - |
| 107 ఖుష్కి/పట్టా 0.05 | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి రామకుమార్ గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి రామకుమార్ గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ | 0.01 1/2 | - |
| | ఆర్ & బి రోడ్డు | ఆర్ & బి రోడ్డు | 0.03 1/2 | - |
| 108 ఖుష్కి/పట్టా 0.06 | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి రామకుమార్ గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి రామకుమార్ గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ | 0.01 | - |
| | శివరాత్రి మంగ భర్త యాదగిరి | శివరాత్రి మంగ భర్త యాదగిరి | 0.05 | - |
| 109 ఖుష్కి/పట్టా 0.06 | వల్లందాసు సుగుణమ్మ భర్త | వల్లందాసు సుగుణమ్మ భర్త | 0.02 | - |
| | గుసుగంటి బిక్షమయ్యా తండ్రి సత్తయ్య బుర్ర సోమయ్య తండ్రి కొమరయ్య వల్లందాసు సత్తయ్య తండ్రి కొండయ్య వల్లందాసు మధు తండ్రి శివయ్య వల్లందాసు ఉదయ్ తండ్రి శివయ్య బండారి బిక్షమ్ తండ్రి పాపయ్య | గుసుగంటి బిక్షమయ్యా తండ్రి సత్తయ్య బుర్ర సోమయ్య తండ్రి కొమరయ్య వల్లందాసు సత్తయ్య తండ్రి కొండయ్య వల్లందాసు మధు తండ్రి శివయ్య వల్లందాసు ఉదయ్ తండ్రి శివయ్య బండారి బిక్షమ్ తండ్రి పాపయ్య | 0.00 3/4 | - |
| | ఆర్ & బి రోడ్డు | ఆర్ & బి రోడ్డు | 0.03 1/4 | - |
| 106 ఖుష్కి/పట్టా 0.22 1/2 | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి బూడిది బిక్షమయ్యా తండ్రి సోమయ్య వారాల వెంకట్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి రామకుమార్‌గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ అడ్డగుట్ల పురుషోత్తమ్ తండ్రి విట్టల్ అడ్డగుట్ల శ్రీనివాస్ తండ్రి విట్టల్ మహమ్మద్ మాసి యుద్దీన్ తండ్రి అమినుద్దీన్ సింగారపు రమేశ్ తండ్రి లక్ష్మయ్య | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి బూడిది బిక్షమయ్యా తండ్రి సోమయ్య వారాల వెంకట్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి రామకుమార్‌గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ అడ్డగుట్ల పురుషోత్తమ్ తండ్రి విట్టల్ అడ్డగుట్ల శ్రీనివాస్ తండ్రి విట్టల్ మహమ్మద్ మాసి యుద్దీన్ తండ్రి అమినుద్దీన్ సింగారపు రమేశ్ తండ్రి లక్ష్మయ్య | 0.08 | - |
| | ఒర్సు రేణుకా భర్త నర్సింహా | ఒర్సు రేణుకా భర్త నర్సింహా | 0.14 1/2 | - |
| 105 ఖుష్కి/పట్టా 0.05 | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి బూడిది బిక్షమయ్యా తండ్రి సోమయ్య రామకుమార్‌గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ వారాల వెంకట్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి | కనుకుంట్ల చైతన్యరెడ్డి తండ్రి సర్వత్‌రెడ్డి బూడిది బిక్షమయ్యా తండ్రి సోమయ్య రామకుమార్‌గౌడ్ తండ్రి శ్రీనివాస్‌గౌడ్ వారాల వెంకట్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి | 0.05 | - |
| 97 ఖుష్కి/పట్టా 0.16 | కొత్త నర్సింహారెడ్డి తండ్రి పుల్లారెడ్డి | కొత్త నర్సింహారెడ్డి తండ్రి పుల్లారెడ్డి | 0.16 | - |
| 96 ఖుష్కి/పట్టా 0.25 1/2 | కొత్త నర్సింహారెడ్డి తండ్రి పుల్లారెడ్డి | కొత్త నర్సింహారెడ్డి తండ్రి పుల్లారెడ్డి | 0.18 1/2 | - |
| | ఎస్‌వైఎస్ ఆగ్రోటెక్ (ప్రైవేట్ లిమిటెడ్) | ఎస్‌వైఎస్ ఆగ్రోటెక్ (ప్రైవేట్ లిమిటెడ్) | 0.07 | |
| 95 ఖుష్కి/పట్టా 0.09 1/2 | తూడి శ్రీదేవి భర్త శ్యామ్‌సుందర్‌రెడ్డి | తూడి శ్రీదేవి భర్త శ్యామ్‌సుందర్‌రెడ్డి | 0.09 1/2 | - |
| 94 ఖుష్కి/పట్టా 0.03 | తేజశ్రీ ఇంటర్మీడియట్ (ప్రైవేట్ లిమిటెడ్) మెడికామ్ ఫార్మా ప్రై లిమిటెడ్ జి.వెంకటేశ్వర్‌రావు (రామాంజనేయులు) | తేజశ్రీ ఇంటర్మీడియట్ (ప్రైవేట్ లిమిటెడ్) మెడికామ్ ఫార్మా ప్రై లిమిటెడ్ జి.వెంకటేశ్వర్‌రావు (రామాంజనేయులు) | 0.03 | - |
| | | హద్దిరాస్తా | 0.00 1/2 | |
| | | **మొత్తం** | **3.14 1/2** | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పనివేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము–2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము–2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/– ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము–2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా

సం/– జాయింట్ కలెక్టర్, యాదాద్రి భువనగిరి

సం/– జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO.No.136/LA/PP/Advt/Pub/2025-26

# శ్మశానవాటికలో అక్రమ లేఔట్

- కరోనా సమయంలో కబ్జాల పర్వం
- పునాదులతో పాటు ప్రహరీలను తొలగించిన హైడ్రా



**హైదరాబాద్, మే 22 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, ఫిర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కంచ పర్వతాపూర్ గ్రామం శ్మశాన వాటికలో వెలిసిన అక్రమ లే ఔట్‌ను, కట్టడాలను హైడ్రా గురువారం తొలగించింది. ప్రభుత్వ భూమిలో 40 ఏళ్లకు పైగా సాగుతున్న శ్మశాన వాటికను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయాలు జరుపుతున్నారనే ఫిర్యాదుల మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. 3 షాపులతో పాటు.. 15 ప్లాట్లకు వేసిన పునాదులు, రెండు మీటర్ల ఎత్తులో నిర్మించిన ప్రహరీలను, అందులో వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

**ఫిర్యాదు అందిందిలా..**

ఫిర్జాదిగూడ మున్సిపాలిటీలోని కంచ పర్వతాపూర్ గ్రామంలో మైనారిటీలకు సంబంధించిన శ్మశానవాటికలు రెండు ఉన్నాయి. వీటిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయాలు జరిపారని హైడ్రా ప్రజావాణిలో అక్కడి శ్మశాన పరిరక్షక ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సుఖేందర్ రెడ్డికి సర్వే నంబరు 12లో సొంత భూమి ఉంది. తనకి ఉన్న ప్రైవేటు భూమికి పక్కనే సర్వే నంబరు 1లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వభూమిలో ఉన్న శ్మశాన వాటికల స్థలాన్ని కూడా కబ్జా చేసి లే ఔట్ వేశారు. అప్పటికే ఉన్న సమాధులపై మట్టి పోసి అవి కనిపించకుండా చేశారు. ఫిర్జాదీగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబరు జగదీశ్వర్ రెడ్డితో కుమ్మక్కయిన సుఖేందర్‌రెడ్డి ఈ కబ్జాలకు పాల్పడ్డారు. కరోనా సమయంలో ఇదంతా జరిగింది. లే ఔట్ వేసిన నుంచి వివాదం ఉందని తెలిసినప్పటికీ రజనీకాంత్ రెడ్డి అనే వ్యక్తి 200ల గజాల ప్లాట్‌ను కొన్నారు. 3 షాపులు నిర్మించి ప్రతి నెల పెద్ద ఎత్తున్న రెంటులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదుదారులు చెప్పారు.

**తప్పుడు కేసు వివరాలతో..**

ప్రభుత్వ భూమిలో ఉన్న శ్మశానవాటికలను కబ్జా చేయడమే కాకుండా.. ఆ లేఔట్‌లోకి వెళ్లకుండా కోర్టు కేసులున్నాయని కబ్జాదారులు నమ్మబలికారు. 15 ప్లాట్ల ప్రహరీలమీద .. తప్పుడు రిట్ పిటిషన్ నంబర్లను రాయించారు. అటువైపు తాము వెళ్లకుండా అడ్డుకోవడానికే ఇలా చేశారని ప్రజావాణిలో పేర్కొన్నారు. ఇదంతా కొవిడ్ సమయంలో జరిగింది. తన సొంత భూమికి చెందిన సర్వే నంబరు చూపించి తప్పుడు అనుమతులు తీసుకోవడం.. అక్రమ కట్టడాలు చేపట్టడం జరిగిపోయింది. మాజీ మేయర్, కోఆప్షన్ మెంబరు సహకారంతో ఈ కబ్జాల పర్వం జరిగిపోయింది. తప్పుడు సర్వే నంబరు జోడించి అనుమతులు రావడంలో అప్పటి మున్సిపల్ మేయర్, కో ఆప్షన్ మెంబర్ సహకరించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. సర్వే చేయించుకుని హద్దులు నిర్ధారించుకోవడం.. కోర్టు ద్వారా హక్కులు పొందకుండా భుజబలంతో సొంతంగా నిర్ణయించుకున్నారని ఫిర్యాదు దారులు వాపోయారు.

**ఫిర్యాదుల పరిశీలన ఇలా..**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను గూగుల్ మ్యాప్స్, ఎన్ ఆర్ ఎస్ సీ ఇమేజీలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. అక్కడితో ఆగకుండా.. బుధవారం ఫిర్జాదిగూడ మున్సిపాలిటీలోని శ్మశాన వాటికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైడ్రా, స్థానిక రెవెన్యూ అధికారులతో విచారించి ప్రభుత్వ స్థలమే.. ఇందులో శ్మశానవాటికలున్నాయని నిర్ధారించుకున్నారు. సమాధులు కనిపించకకుండా మట్టితో కప్పినట్టు ఉండడాన్ని కూడా పరిశీలించారు. స్థానికులతో కూడా కమిషనర్ మాట్లాడారు. 7 ఏళ్లుగా ధర్నాలు చేశామని, అధికారులు, కోర్టులు చుట్టూ తిరిగామని శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఈ సంద్భంగా కమిషనర్‌కు తెలిపారు. అన్ని అంశాలను లోతుగా పరిశీలించి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

**హైడ్రా చర్యలు ఇలా..**

గురువారం ఉదయం హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ మూడు షాపులలో సామాన్లను తరలించడానికి కొంత సమయం కావాలని అడగగా.. వారికి హైడ్రా సహకరించింది. సామాన్లు మొత్తం తరలించిడంలోనూ హైడ్రా సిబ్బంది సహాయం చేశారు. మొత్తం సామాన్లు వాహనాలోకి ఎక్కించిన తర్వాత ఆ షాపులను కూడా హైడ్రా తొలగించింది. 200ల గజాల ప్లాట్లో ఉన్న 3 దుకాణాలతో పాటు.. పునాదులు వేసి 2 మీటర్ల ఎత్తులో నిర్మించిన 15 ప్లాట్ల ప్రహరీలను హైడ్రా తొలగించింది.

**సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం..**

సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైడ్రా తీవ్రంగా ఖండించింది. అక్కడ కబ్జాలకు పాల్పడిన వారు సామాన్యులు కాదు. మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి, మాజీ కోఅప్షన్ మెంబర్ జగదీశ్వర్ రెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకుని సహకరించడంతో ఖేందర్ రెడ్డి అనే వ్యక్తి అక్రమ లే ఔట్ వేసి శ్మశానాన్ని కబ్జా చేశారు. ఆ స్థలంపై వివాదం ఉందని తెలిసే రజనీకాంత్ రెడ్డి 200ల గజాల ప్లాట్‌ను కొని షాపులు ఏర్పాటు చేశారు. రూ. 50 వేలకు పైగా ఆ షాపులపై ప్రతి నెలా రెంటులు వసూలు చేస్తున్నరు. ఆ షాపులు అద్దెకు తీసుకున్నవారికి ఈ వివాదాలేవీ తెలియవు. దుకాణదారులకు తగిన సమయం ఇచ్చి అక్కడ కూల్చివేతలు హైడ్రా చేపట్టింది. 7 ఏళ్ల పోరాటం ఫలించిందని.. ఎకరాకు పైగా ఉన్న శ్మశాన వాటికల భూమి కాపాడుకోగలిగామని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## బీసీ గురుకుల్లో 6,7,8,9 తరగతుల బ్యాగ్ లాగ్ సీట్ల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- ప్రవేశపరీక్షలో మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు
- ఈనెల 24వ తేదీన సీట్ల భర్తీ ప్రక్రియ
- సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల లో 6,7,8,9 తరగతుల బ్యాగ్ లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు వెబ్ సైట్ **www.mjpt-bcwreis.telangana.gov.in** లేదా **https://mjptbcadmissions.org**లల లో అందుబాటులో ఉన్నాయని సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బీసీ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతులలో 6,832 బ్యాగ్ లాగ్ సీట్లు ఉండగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులలో 23,611 మంది ఏప్రిల్ 20న పరీక్ష రాశారని ఆయన తెలిపారు. ఈనెల 24న కౌన్సిలింగ్ ఉంటుందని, మెరిట్ వచ్చి, ఎంపిక కాబడిన విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ అన్ని సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

## కేశవరావు ఎన్‌కౌంటర్ ఓ బూటకం

- చంపడం.. చంపిన వాళ్లను ప్రశంసించటం దుర్మార్గం
- ప్రజాసంఘాల ధర్నా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేశవరావు ఎన్‌కౌంటర్ ఓ బూటకమని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. అంబేద్కర్ విగ్రహం ట్యాంక్ బండ్ దగ్గర ప్రజా సంఘాలు కలిసి స్వల్పకాలక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు చత్తీస్గడ్ నారాయణపూర్ అడవుల్లో జరిగిన బూటకు ఎన్కౌంటర్లో చనిపోయాడని ఆయనతో పాటు మరో 28 మంది చనిపోయారని, ఈ ఎన్కౌంటర్ బూటకమని తెలిపారు. ఆది నాయకత్వంతో చర్చలు జరపాలిగానీ చంపడం అన్యాయం చంపిన వాళ్లను ప్రశంసించడం నేర్చుకోవడం ఘన విజయం సాధించారనడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి హోం శాఖ మంత్రి స్థాయి వాళ్ళు ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని, నంబాల కేశవరావు తదితరుల శవాలను కుటుంబ సభ్యులకు ఇవ్వటానికి అధికారులు నిరాకరిస్తున్నారు శవాలు కూలిపోవాలని ఆలోచిస్తున్నారు అభ్యంతరం చెప్పవలసిన అవసరమేంటని ప్రశ్నించారు. ఇప్పటికీ ఆపరేషన్ కదా తో 528 మంది చనిపోయారని, అన్నిటి పైన న్యాయ విచారణ జరిపించాలని, కేశవరావుతో పాటు చనిపోయిన వారి పేర్లను వెంటనే ప్రకటించాలని, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల ప్రకారం ఫోటోలతో పాటు మీడియాలో ప్రకటించి కుటుంబీకులకు అప్పజెప్పాలని, కేశవ శవాన్ని మొదట ఇస్తామని చెప్పి తర్వాత నిరాకరించడం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కులసంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, నారాయణ రావు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, రాంబాబు ముత్తయ్య సత్యనారాయణ ఆంజనేయులు, చైతన్య మహిళా సంఘం శ్రీదేవి, సత్య, ఓయూ రీసెర్చ్ కలర్ ఆజాద్, పూర్వ విద్యార్థుల సంఘం సాంబమూర్తి నార్ల రవి, పిడిఎం చంద్రమౌళి, వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, విరసం రాముజి, సామాజిక తెలంగాణ ఫ్రంట్ వెన్నపూస పరుశరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ? : సీపీఎం

**మధిర, మే 22 (జనంసాక్షి) :** వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాయి. రైతులు విత్తనాలు, దుక్కులు దున్నేందుకు ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా ఎక్కడని సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం శీలం నరసింహారావు అధ్యక్షతన పార్టీ మధిర నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు, పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డబ్బులు లేవంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం చాలా దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి తమ ఖర్చులు తగ్గించుకున్నారా? ఆడంబరాలు, ప్రభుత్వ అనవసర ఖర్చులు తగ్గించలేదు కాబట్టి రైతులు, కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

- కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఇందుకు నిదర్శనం
- అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్



**కరీంగనర్, మే22 (జనంసాక్షి) :** గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# ఎనిమిదో రోజు.. తగ్గని భక్తుల జోరు..

- పుష్కరాలతో పులకించిపోతున్న భక్తజనం..
- ఆలయం వద్ద కిక్కిరిసిన క్యూలైన్లు..
- చల్లబడిన వాతావరణం..
- భక్తుల్లో పెరిగిన హుషారు..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం (జనంసాక్షి):** సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం భక్తులు జోరుగా తరలివచ్చారు.. వాతావరణం చల్లబడడంతో భక్తులు హుషారుగా భారీగా తరలివచ్చారు.. స్నానఘట్టాలు, ముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో 12రోజులపాటు జరిగే సరస్వతి పుష్కరాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. స్వరాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు భారీగా తరలివస్తున్నారు. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, హారతులతో ఘాట్‌ల పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనార్థం బారీ క్యూలైన్లలో నిలబడి భక్తిని చాటుకుంటున్నారు. పుష్కర స్నానానికి భద్రతా దళాలు, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది సహా వాలంటీర్లు సమర్థంగా సేవలందిస్తున్నారు. భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, అధికారులు అదనపు ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నీటి సరఫరా, వైద్య సహాయ కేంద్రాలు, విస్తృతంగా అందుబాటులో తెచ్చారు. పుష్కరాల ముగింపుకు ఇంకా 4 రోజులు సమయం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అన్ని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భక్తులు పుష్కరాలకు స్వచ్ఛందంగా తరలిరావాలని, సూచించిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

**వర్షాలతో ఇబ్బందులు..**

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు భక్తులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బుధవారం రాత్రి వచ్చిన గాలివానకు టెంట్లు, కటౌట్లు కూలిపోయి ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు బురదమయం కావడంతో ఇబ్బందులు తలెత్తాయి. కొత్త ఆర్టీసీ పాయింట్ వద్ద నుండి సరస్వతి పుష్కర ఘాటు వద్దకు ఉచితంగా నడిచే మినీ బస్సులు నడవలేని దుస్థితి ఏర్పడింది. అయితే గురువారం ఉదయం నుండి ఉచిత మినీ బస్సులు సరస్వతి ఘాటు వద్దకు నడిచేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా వర్షపు జల్లులు పడడంతో ప్రాంగణాలు బురదమయమై భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. మొత్తం మీద వాతావరణం చల్లగా ఉండడంతో భక్తులు హుషారుగానే తమ కార్యక్రమాలను ముగించుకున్నారు.

**అధికారుల పనితీరు భేష్..**

వర్షం కారణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేపట్టిన చర్యలు భేష్ అని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, ఎస్పి కిరణ్ ఖరే ను అభినందించారు. గురువారం కాళేశ్వరం వచ్చిన ప్రిన్సిపల్ సెక్రటరీ వర్షం వల్ల పుష్కర స్నానాల కు వచ్చే భక్తులకు ఇబ్బంది రాకుండా చేసిన ఏర్పాట్ల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం కాళేశ్వరంలో కురిసిన అకాల భారీ వర్షం కారణంగా రహదారులు బురదమయమై, సరస్వతీ పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు రవాణా, పార్కింగ్, ట్రాఫిక్ సౌకర్యాలలో తాత్కాలిక ఇబ్బందులు తలెత్తాయని, ఈ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ కు ఇబ్బంది రాకుండా పరిస్థితిని సమీక్షించి, బురద మయమైన ప్రాంతాలలో వాహనాల రవాణాకు ఇబ్బందులు లేకుండా చేపట్టిన చర్యలను అభినందించారు. తాత్కాలిక బస్ స్టాండ్ నుండి సరస్వతీ ఘాట్ వరకు, దేవాలయ పరిసరాల వరకు భక్తులకు ఉచిత షటిల్ బస్ సేవలను పునరుద్ధరించి, భక్తులకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకున్నందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. భక్తుల సౌకర్యం కోసం తీసుకున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. భక్తులు ఉచిత రవాణా సేవలను సద్వినియోగం చేసుకుని పుష్కరాలను శాంతియుతంగా, సౌకర్యవంతంగా నిర్వహించాలని ఆమె కోరారు.



## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

**నర్సంపేట, మే 22 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి కలిసి నియోజకవర్గంలో అకాల వర్షంతో దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్,వరంగల్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు. తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ఓఎస్డీ పేరుతో బెదిరింపులు

- మాజీ రంజీ క్రికెటర్ నాగరాజు అరెస్ట్



**హైదరాబాద్, మే22 (జనంసాక్షి) :** సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో బెదిరింపులకు పాల్పడుతోన్న ఆంధ్రా మాజీ రంజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం యవ్వారిపేటకు చెందిన నాగరాజు ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. తాను సీఎం ఓఎస్డీ అని చెప్పుకొంటూ పలు రియల్ ఎస్టేట్ కంపెనీల ఛైర్మన్‌లకు వాట్సాప్ మెసేజ్‌లు పంపాడు. ఓఎస్డీ పేరుతో నాగరాజు ఫేక్ ఈ మెయిల్ క్రియేట్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళంలో నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. గతంలో కోడెల శివరాంపై తప్పుడు కేసులు పెట్టి.. ఈ మధ్యే వాటిని వెనక్కి తీసుకున్నాడు. 2023లో శ్రీకాకుళంలో 22 కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు నాగరాజును అరెస్టు చేశారు.

## కొండగట్టుకు పోటెత్తిన భక్తులు



**జగిత్యాల, మే22 (జనంసాక్షి) :** హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు కు భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు వర్షంలోనూ కాలినడకన చేరుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేపట్టారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

## అభివృద్ధిలో భాగమే రైల్వేల ఆధునీకరణ

- వరంగల్ స్టేషన్ ప్రారంభోత్సవంలో డికె అరుణ

**వరంగల్, మే22 (జనంసాక్షి) :** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి భూపతి శ్రీనివాస వర్మ, ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లలో వరంగల్, బేగంపేట్, కరీంనగర్ స్టేషన్లను ప్రారంభించడం గర్వకారణమ్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి శ్రేణిలో భాగమే అని ఆమె తెలిపారు. రైల్వే స్టేషన్లను అత్యాధునిక సదుపాయాలతో పునఃనిర్మాణం చేసి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి వరంగల్ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఇదంతా మోడీ నిష్పక్షపాత పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, రైల్వే రంగాల్లో కేంద్రం నిధులు కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని, ఇది మతపరమైన లేదా ప్రాంతీయ వివక్ష లేకుండా దేశంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రధాని దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆమె అన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 మే 2025
తెలంగాణ




# సంక్షోభంలో పత్రికా స్వేచ్ఛ

*పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్య దేశంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది పారదర్శకతను, జవాబుదారీతనం, ఆలోచనల స్వేచ్ఛను నిర్ధారిస్తుంది. పాత్రికేయులు అవినీతిని బయటపెట్టడం, అధికారులను సవాలు చేయడం, అణగారిన వర్గాల గొంతుకను వినిపించడం ద్వారా సమాజాన్ని సమాచారం తో నడిపిస్తారు. అయితే, 2014 నుంచి భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ఆందోళనకరంగా క్షీణిస్తోంది. ఈ వ్యాసం భారతదేశంలో పాత్రికేయులపై వేధింపులు, అరెస్టులు, మీడియా సంస్థలపై దాడులు, నియంత్రణ చట్టాల ద్వారా ఈ స్వేచ్ఛ క్షీణతను, న్యాయస్థానాల పాత్రను, గణాంకాలతో సహా విశ్లేషిస్తుంది.*

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రజా స్వామ్యానికి ఊపిరి. ఇది ప్రభుత్వాలను, సంస్థలను జవాబుదారీగా ఉంచుతుంది. జాన్ మిల్టన్ చెప్పిన "ఆలోచనల మార్కెట్" సిద్ధాంతం ప్రకారం, బహిరంగ చర్చ ద్వారా సత్యం బయటకు వస్తుంది. కానీ, ఈ ఆదర్శం భారతదేశంలో ప్రమాదంలో ఉంది. ఫ్రీడమ్ హౌస్ నివేదిక ప్రకారం, 2014 నుంచి భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ స్కోరు నిరంతరం తగ్గుతోంది, 2024 నాటికి "పాక్షికంగా స్వేచ్ఛ" కలిగిన దేశంగా వర్గీకరించబడింది. ఈ క్షీణతకు చట్టపరమైన, చట్టవిరుద్ధ చర్యలు కారణమయ్యాయి, ప్రభుత్వ విమర్శకులను తమ అభిప్రాయాలను చెప్ప కుండా కట్టడి చేయటం రాజ్యాంగం పేర్కొన్న భావప్రకటనా స్వేచ్ఛకు,మీడియా స్వేచ్ఛకు విఘాతం కలిగించటమే అవుతుంది.

2014 నుంచి భారతదేశంలో పాత్రికేయులపై వేధింపులు, అరెస్టులు విపరీతంగా పెరిగాయి. "కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) "ప్రకారం, భారతదేశం పాత్రికేయులను జైలు శిక్షలు విధించటంలో అగ్రస్థానంలో ఉంది". ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో సిద్దిక్ కప్పన్ 2020లో హత్రాస్ కేసు గురించి రిపోర్టింగ్ చేసినందుకు ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద అరెస్టయ్యారు, రెండేళ్లకు పైగా జైలులో ఉన్నారు. మహిళా పాత్రికేయులు అదనపు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. యునెస్కో నివేదిక ప్రకారం, భారతదేశంలో 2021లో మహిళా పాత్రికేయులు ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొన్నారు. తరచూ శారీరక బెదిరింపులుగా మారాయి. ఉదాహరణకు, పాత్రికేయురాలు రానా అయ్యూబ్‌పై ఆన్‌లైన్ దాడులు, మరణ బెదిరింపులు 2018 నుంచి నిరంతరం కొనసాగుతున్నాయి.

మీడియా సంస్థలపై దాడులు భారతదేశంలో తీవ్రమయ్యాయి. 2023లో, న్యూస్‌క్లిక్ వంటి స్వతంత్ర మీడియా సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను విభాగం దాడులు చేశాయి, విమర్శనాత్మక రిపోర్టింగ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. పెగాసస్ స్పైవేర్ ద్వారా పాత్రికేయుల ఫోన్‌లను హ్యాక్ చేసిన ఆరోపణలు 2021లో బయటపడ్డాయి. ఇందులో ప్రముఖ పాత్రికేయులు లక్ష్యంగా ఉన్నారు. ఫ్రీడమ్ హౌస్ ప్రకారం, 2014 నుంచి భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ స్కోరు 20 పాయింట్లు తగ్గింది. దాడులు, వేధింపులు దీనికి కారణం. శిక్షారాహిత్యం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేసింది. సీపీజే నివేదిక ప్రకారం, 2014-2023 మధ్య భారతదేశంలో 7 గురు పాత్రికేయుల హత్యలు జరిగాయి, చాలా కేసులు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. న్యాయస్థానాల ద్వారా వివిధ కారణాలతో తీర్పులు ఆలస్యం అయినా కొద్దీ దాడి చేసేవారికి ఊతం ఇచ్చినట్లు అవుతుంది.



భారతదేశంలో నియంత్రణ చట్టాలు, చట్టవిరుద్ధ చర్యలు పత్రికా స్వేచ్ఛను అడ్డుకున్నాయి. దేశద్రోహం చట్టం (సెక్షన్ 124ఏ), యూఏపీఏ వంటి చట్టాలను అస్పష్టంగా ఉపయోగించి విమర్శకులను భయంతో భావ వ్యక్తీకరణ చేయకుండా నిరోధస్తున్నాయా. 2014 నుంచి దేశద్రోహ కేసులు 28 శాతం పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్.సీ. ఆర్.బీ.) తెలిపింది, ఇందులో పాత్రికేయులు ప్రధాన లక్ష్యంగా ఉన్నారు. ఉదాహరణకు, జమ్మూ కాశ్మీర్‌లో ఫహద్ షా 2022లో పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (పీఎస్ ఏ) కింద అరెస్టయ్యారు. "తప్పుడు వార్తలు" చట్టాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం సెక్షన్ 66ఏ (2015లో రద్దైనప్పటికీ) వంటివి విమర్శనాత్మక రిపోర్టింగ్‌ను అణచివేయడానికి ఉపయోగిస్తున్నారు.

స్ట్రాటజిక్ లాసూట్స్ ఎగైన్స్ట్ పబ్లిక్ పార్టిసిపేషన్ (ఎస్ఎల్ ఏపీపీ) కేసులు 2014 తర్వాత విపరీతంగా పెరిగాయి. కార్పొరేట్ సంస్థలు పాత్రికేయులపై ఖరీదైన కేసులు వేస్తున్నాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులలో ఖరీదైన లాయర్లతో కేసులను నడపటంతో జర్నలిస్ట్ లు న్యాయం కోసం పోరాడే పరిస్థితి లేదు. న్యాయస్థానాల పాత్ర భారతదేశంలో అస్థిరంగా ఉంది. సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో సిద్దిక్ కప్పన్‌కు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, చాలా సందర్భాల్లో న్యాయస్థానాలు ప్రభుత్వ నియంత్రణకు తలొగ్గుతున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో పాత్రికేయులను పీఎస్ఏ కింద జైలులో ఉంచడం, దేశద్రోహ ఆరోపణలతో శిక్షించడం సర్వసాధారణమైంది. ఈ చట్టపరమైన వేధింపులను ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి ఖండించింది.

2014 నుంచి భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ క్షీణత ప్రజాస్వామ్య విలువల తిరోగమనాన్ని సూచిస్తుంది. శిక్షారాహిత్యం, నియంత్రణ చట్టాల, దర్యాప్తు సంస్థల వేదింపులు పాత్రికేయతను నిరుత్సాహ పరుస్తున్నాయి. ప్రభుత్వం పాత చట్టాలను రద్దు చేసి, పాత్రికేయుల రక్షణకు బలమైన చర్యలు తీసుకోవాలి. తక్షణ చర్యలు లేకపోతే, పత్రికల మౌనం భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచి, అధికార దుర్వినియోగానికి, తప్పుడు సమాచార వ్యాప్తికి దారితీస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## మేం నవ్వుతాం!

రోజుకొకదినోత్సవం -నేడు
నవ్వులదినం నవ్వండి!
నవ్వండి బాగా నవ్వండి
నవ్వకపోతే ఎలా చెప్పండి!

దినదినం నిత్యదినం!
ధనంకొరకు వ్యాపారులు
కనిపెట్టిన దినకార్యం!
నవ్వుదాం! నవ్వుకుందాం!

కక్కొచ్చినా.. ఇంకొకటిఉంది..!
'కళ్యాణం' వచ్చినా ఆగదట!
దానిసంగతి ఏమోగాని
నవ్వొస్తేమాత్రం ఆగదండోయ్!

నవ్వేయ్యండి! నవ్వేయండి!
మీనవ్వుతో ఇతరుల్ని మాత్రం
నవ్వులుపాలు చెయ్యకండి!
తర్వాత మీరు ఏడవాలి!

కులాలు మతాలు పార్టీలు
ఈ మూడు నాకు నవ్వు!
దరిద్రులే 'రా మెటీరియల్'
నవ్వొస్తోందా? రావట్లేదా?

ప్రపంచ దరిద్రులారా!
మీరు తప్ప అందరూ
నవ్వుతారు!మిమ్మల్ని
నవ్వులపాలు చేసిందెవరు?

దేవుడనేగా మీనమ్మ కం!
దేవుడికీ మీసంగతి తెలీదు!
దేవుడే నవ్వులపాలయ్యాడు!
దేవుడుకూడా వ్యాపారమే!

నవ్వురానివాళ్లు ఇద్దరే ఇద్దరు
1.దేవుడు 2దరిద్రుడు!అందుకే
దరిద్ర దామోదరుడన్నారు!
మీరునవ్వలేరు!మేంనవ్వుతాం

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## దేశం కోసం జీవించు

ప్రతి వ్యక్తి నాకోసం
కాదు మీకోసం అనే
జీవన విధానంతో
దేశం కోసం జీవించాలి

దేశం బాగుంటే
నేను బాగుంటాను
దేశ వికాసమే
నా వికాసం

దేశ అభ్యున్నతే
నా అభ్యున్నతి
అని ఆలోచించేవారు
దేశానికి కావాలి

మన సామర్థ్యాలను
దేశఅభ్యున్నతికి
ఉపయోగించాలి

దేశం కోసం
ఏవిధంగా
జీవించాలో
ఆలోచించాలి

దేశ రక్షణ ధర్మ రక్షణ
ప్రకృతి రక్షణ
ఆధునికీకరణ
మోజులో
పాశ్చాత్యీకరణ
వద్దు

మతాన్ని
ఆధ్యాత్మీకరించడం
మనిషిని జాతీయవాదం
వైపు నడిపించడం
తక్షణ అవసరం

జాతీయ వాదమే
అన్ని సమస్యలకు
పరిష్కార మంత్రం

ఆధునిక విలువలు
దేశ సంస్కృతి
వారసత్వ రక్షణ
సామాజిక బాధ్యత
కావాలి

అసమానతలు అవిద్య
పేదరికం అవినీతి వివక్ష
మహిళా సాధికారిత
యువత సాధికారిత
డ్రగ్స్ మాదక ద్రవ్య
రహిత భారత్ ఆవిర్భావం
యువత ఆత్మహత్యలు
నేరరాజకీయాలు సామాజిక
సమస్యల పరిష్కారంలో
క్రియాశీలక పాత్ర పోషిద్దాం

ధర్మాన్ని సంస్కృతిని
ఆచరిద్దాం గౌరవిద్దాం
దేశాన్ని రక్షిద్దాం
వికసిత భారత్ లక్ష్యంగా
భారత్ ను విశ్వ గురువు
స్థాయికి చేర్చుదాం.



నేదునూరి కనకయ్య
రచయిత సామాజిక ఆర్థిక
విశ్లేషకులు
ఫ్రీలాన్స్ రైటర్
కరీంనగర్9440245771

## మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి
# నంబల కేశవరావు హత్యను ఖండిస్తున్నాం

**కొల్లిపర వెంకటేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కమిటీ**

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆపరేషన్ కాగరు పేరుతో మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి పదే పదే ప్రకటనలు జారీ చేశారు. గత రెండేళ్లలో, ప్రభుత్వం మావోయిస్టు కార్యకర్తల పేరుతో ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో 300 మందికి పైగా గిరిజనులను చంపేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఛత్తీస్ గఢ్ రాష్ట్రం మరియు ఇతర ప్రాంతాలలోని అటవీ ప్రాంతాల లో ఉన్న అల్యూమినియం, బాక్సైట్, ఇనుప ఖనిజం వంటి ఈ దేశ సహజ వనరులను కార్పొరేట్లు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులకు అప్పగించడానికి కృషి చేస్తోంది. ఫిబ్రవరి 8న, సీపీఐ (మావోయిస్ట్) పార్టీ అగ్ర నాయకత్వం కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు పిలుపునిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు మరియు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు ఇతర రాష్ట్రాలలోని 10 వామపక్ష పార్టీలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాగర్ పేరుతో జరుగుతున్న మానవ హత్యలను ఆపాలని ప్రభుత్వానికి పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే, గత కొన్ని నెలలుగా, భారత ప్రభుత్వం "ఆపరేషన్ కాగర్" పేరుతో మధ్య భారతదేశంలోని అడవుల్లో మారణహెూమాన్ని కొనసాగిస్తోంది. ఈ ఉదయం నుండి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలోని అబుజ్ మడ్‌లో ప్రభుత్వ దళాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబల కేశవరావు అలియాస్ బసవ రాజుతో సహా 25 మందికి పైగా మరణించారు. శాంతి చర్చల కోసం మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే అభ్యర్థించింది. ఆపరేషన్ కాగర్‌ను ఆపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం మేధావులు మరియు ప్రజాస్వామ్యవాదులను కోరుతోంది, అయినప్పటికీ, నరేంద్ర మోడీ మరియు అమిత్ షా యొక్క బిజెపి ప్రభుత్వం చర్య తీసుకోవడం లేదు. అంతేకాకుండా, ఇది మారణహెూమాన్ని తీవ్రతరం చేసింది. ఈ దేశ పౌరులు ప్రతిరోజూ చంపబడుతున్నారు. అడవుల నుండి గిరిజనులను తరిమికొట్టడానికి మరియు కార్పొరేట్ కంపెనీల కోసం అటవీ సంపదను దోచుకోవడానికి ప్రభుత్వం ఆపరేషన్ కాగర్‌ను ప్రారంభించింది. ఆపరేషన్ కాగర్‌ను వెంటనే ఆపాలి మరియు బలగాలను తిరిగి రప్పించాలి. ప్రభుత్వం చేసిన ఈ హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిలతో న్యాయ విచారణ జరపాలి. ఈరోజు నకిలీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు మరియు ఇతర మావోయిస్టు పార్టీ సభ్యులకు సీపీఐ(ఎం-ఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర కమిటీ విప్లవాత్మక సంతాపాన్ని తెలియజేస్తోంది. ప్రభుత్వం చేస్తున్న ఈ మారణహెూమాన్ని ప్రజలు మరియు ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని మేము అభ్యర్థిస్తున్నాము.



**కొల్లిపర వెంకటేశ్వరరావు**
కార్యదర్శి,
సీపీఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ,



## నువ్వు నడిచిన దారి..!!

మార్క్సిజం లేనినిజం మావోయిజం
మార్గదర్శక సూత్రాల వెలుగులో
మావోయిస్టు పార్టీ నాయకత్వాన
భారత విప్లవ విజయాని కై
అగ్రగామిగా నిలిచిన
వీరకిశోరుడు బస్వరాజ్
నక్సల్బరీ శ్రీకాకుళ వారసుడుగా
చెరగని ముద్ర వేసి
కాళ్లకు గజ్జలు కట్టి
కదన రంగంలో దూకి
సాహితి సాంస్కృతిక రంగంలో
విప్లవాత్మక మార్పులు తెచ్చి
కవులు కళాకారులు విద్యార్థులు
మేధావులకిజి
విప్లవ చేవను పెంచి
ప్రజా సంస్కృతికి
నూతన ఒరవడిని సృష్టించిన
విప్లవ సర్వనామాల
రివిజనిస్టులనుజి
నయా రివిజనిస్టులను
రాజీ లేకుండా ఎండగట్టి
అతివాదుల మితవాదులతో
సైదాంతిక పోరు నడిపి
దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి
నడుం బిగించిన
ప్రజావీరుడు బస్వరాజ్
సంక్షోభాల సమయాల్లో
ఓరిమి నేర్పుతో
ఆటుపోటులకు గురైన పార్టీని
సాహసంగా నడిపిన
విప్లవ రథసారదుడు.
భారత ప్రజల ఉజ్వల భవిష్యత్ కై
ఉద్యమాలకు ఊపిరిపోసి
యుద్ధాన్నే ముద్దాడిన
పుడమితల్లి వీరపుత్రుడ్రు
నంబాల కేశ్వరరావు.
శతృ నిర్బంధాలను అధిగమిస్తూ
శతృ మూకలనే సవాల్ చేసి
సాయుధ పోరును నడిపిన
సాహస యోధుడు. గంగన్నను
అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టిన
పార్టీ రహస్యాలను చెప్పక
శతృవునే గెలిచేసి
చిరునవ్వులతో చిరంజీవులైన
అసాధారణం వీరు యోధుడు.
ప్రజా రాజ్య స్థాపన కొరకు
నీవు నిర్మించిన ఉద్యమ అగ్నికణం
లావాలా రగిలి రగిలి
నేడు దేశ వ్యాప్తంగా
ఎగిసిపడుతున్నది.
ప్రజా కంటకులను
భస్మంచేయ
జ్వలిస్తూ ప్రజ్వరిల్లుతూ
మహా జ్వాలగా మండుతున్నది.
సామ్రాజ్యవాదం మనువాదాన్ని
నిరంకుశ పెట్టుబడిదారులను
కూకటి వేళ్లతోపెగిలించి
దోపిడి పీడన లేని సమసమాజ నీ
నిర్మించి
మీ కలలు గన్న స్ఫూర్తితో
కమ్యూనిజాన్ని నిర్మిస్తామని
మీ మరణం సాక్షిగా శబ్దం
చేస్తున్నాం.

శోభరమేష్
8978657327



## ఊసులు

1

సిరితా దోచిన వచ్చును
సిరితా బంగారు లంకె
చిక్కిన వచ్చున్
సిరితా మోసం చేసిన
విరివిగ దక్కును
దొరకదు విత్తం నీతిన్

2

మేలు చేయు వాడు
మేలిమి బంగారు
కీడు చేయు వాడు
చీడ పురుగు
మంచి బుద్ధి తోడ
మసలు వాడె మనిషి
మనిషి మనిషి లాగ
మసల వలయు

రేడియమ్
9291527757

## 'కన్నడ సాహిత్య కలికితురాయి'
# బాను ముస్తాక్

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు, మహిళా హక్కుల కార్యకర్త, ప్రసిద్ధ న్యాయవాది బాను ముస్తాక్ 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ బుకర్ బహుమతిని సాధించి కన్నడ సాహిత్య చరిత్రలో సరికొత్త చరిత్రను సృష్టించడం నిజంగా హర్షణీయం. దక్షిణ భారతదేశ మహిళల సమస్యలు, పోరాటాలకు సంబంధించి బాను ముస్తాక్ రచించిన చిన్న కథలకి సంబంధించి 'హసీనా అండ్ అదర్ స్టోరీస్' సంకలనానికి అనువాదకురాలు దీపా భస్తీ అనువదించిన 'హార్ట్ లాంప్' అంతర్జాతీయ బుకర్ బహుమతిని సాధించి తద్వారా బుకర్ బహుమతుల్లోనే సరికొత్త చరిత్రను సృష్టించింది అని చెప్పవచ్చు. ఈ రకంగా ఒక చిన్న కథా సంకలనం ద్వారా ఈ అంతర్జాతీయ స్థాయి బుకర్ బహుమతిని సాధించిన తొలి కన్నడ కథల సంకలనంగా 'హార్ట్ లాంప్' నిలవడం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

బాను ముస్తాక్ కన్నడ భాషలో అంతర్జాతీయ బుకర్ బహుమతిని గెలుచుకున్న మొదటి కన్నడ రచయిత్రి గాను, రెండవ భారతీయ రచయిత్రి గాను నవ చరిత్రను సృష్టించారు అని సగర్వంగా చెప్పవచ్చు. దక్షిణాది భాషలో బుకర్ బహుమతి లభించడం ఇదే తొలిసారి కావడం మరియు భారతీయ సాహిత్యానికి రెండోసారి కావడం గమనార్హం. 2022 లో గీతాంజలి శ్రీ రాసిన హిందీ నవల 'రేత్ కి సమాధి' ఆంగ్లంలో 'టూంబ్ ఆఫ్ సాండ్' గాను అనువదించబడి అంతర్జాతీయ బుకర్ బహుమతిని పొందడం గమనార్హం. ఆ రకంగా వారిరువురూ అంతర్జాతీయ స్థాయి బుకర్ బహుమతులు సాధించడం తద్వారా ఆయా భాషలకు సైతం విశిష్ట ప్రాధాన్యాన్ని సంతరించి పెట్టారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

సాధారణంగా దీర్ఘ రచనలకు దక్కే ఈ అంతర్జాతీయ బుకర్ బహుమతిని కథల సంపుటికి తొలిసారిగా ఇవ్వడాన్ని సైతం ప్రత్యేకంగా గమనించవచ్చు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కన్నడ మూల భాష అనువాదకురాలు దీపా భస్తీ అనువాదం చేసినందుకు గాను అంతర్జాతీయ బుకర్ బహుమతిని గెలుచుకున్న 'తొలి భారతీయ అనువాదకురాలు' గాను సరికొత్త చరిత్రని సృష్టించడం నిజంగా గర్వకారణంగా నిలిచింది. 'నా అందమైన భాషకు ఇది ఎంత అందమైన విజయం' అని అనువాదకురాలు దీపా భస్తీ పేర్కొనడం గమనార్హం. గతంలో ఆమె చేసిన అనేక అనువాదాలకు గాను 'పెన్ ట్రాన్స్లేట్స్ అవార్డులు' సైతం వరించడం నిజంగా గర్వించదగ్గ విషయంగా చెప్పవచ్చు.

బాను ముస్తాక్ సామాజిక న్యాయం కోసం ఉద్యమించారు. మొదటగా దళిత హక్కుల ఉద్యమ పరిచయంతో మొదలైన ఆమె పోరాట జీవితం అనేక పోరాటాలకు బాసటగా నిలవడం గమనార్హం. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన బాలికలు, యువతుల దైనందిన జీవితాలను బాను ముస్తాక్ తనదైన కోణంలో పరిచయం చేశారు. 1990 నుంచి 2023 మధ్యకాలం వరకు మహిళా సమస్యల నేపథ్యంగా రాయబడిన ఈ 'హార్ట్ లాంప్' సంపుటి 12 చిన్న కథల సంపుటి. పితృస్వామిక వ్యవస్థలో బందీలుగా నలిగిపోతున్న మహిళల జీవితాలు, పునరుత్పత్తి హక్కులు, విశ్వాసం, కులం, అధికారం మరియు అణచివేత మొదలైన విషయాల గురించి ఈ 'హార్ట్ లాంప్' సంపుటిలో ప్రస్తావించబడ్డాయి. నిజ జీవిత సంఘర్షణలకు అద్దం పట్టే విధంగా ఆయా కథలను రచయిత్రి అక్షరీకరించడం అనన్య సామాన్యం. అసమాన సామాజిక వ్యవస్థలో మహిళల హక్కుల కోసం అంతిమంగా మహిళా అభ్యున్నతి కోసం రచయిత్రి పడిన తపనని ఈ 'హార్ట్ లాంప్' సంపుటి వెల్లడించింది అని చెప్పవచ్చు.

బాను ముస్తాక్ కథలు పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడే పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి. ఆమె పితృస్వామ్యాన్ని నిర్మొహమాటంగా ప్రశ్నించారు. 'ఏ కథ కూడా చిన్నది కాదు అనే నమ్మకం నుండి ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. మానవ అనుభవాల వస్త్రంలో ప్రతి దారం మొత్తం బరువును కలిగి ఉంటుంది. ఒక వ్యక్తిగా కాదు, చాలా మంది ఇతరులతో కలిసి కోరస్లో లేవనెత్తిన గొంతుగా భావిస్తే అంతర్జాతీయ బుకర్ బహుమతిని భిన్నత్వానికి లభించిన విజయంగాను, గొప్ప గౌరవం గాను భావిస్తాను' అని బాను ముస్తాక్ పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

బాను ముస్తాక్ 1970 దశకం నుండి రచనా జీవితాన్ని ప్రారంభించి ఆరు కథా సంపుటాలు, ఒక కవితా సంపుటి, ఒక నవల మరియు ఒక వ్యాస సంపుటి మొదలైనవి రచించారు. ఆమె రచనలు తమిళం, మలయాళం, పంజాబీ, ఉర్దూ మరియు ఆంగ్ల భాషలలోకి అనువాదం అయ్యాయి. 'నా కథలన్నీ మహిళల గురించే. సమాజం, రాజకీయాలు, మతం మహిళల నుంచి ప్రశ్నించటానికి అవకాశం లేని రీతిలో విధేయతను కోరటం, ఈ క్రమంలో అమానుషమైన క్రూరత్వానికి వారిని బలి చేయటం, దాదాపుగా బానిసలుగా చూడటం వంటి విషయాలన్నీ నా కథల్లో వస్తువులుగా ఉన్నాయి. నా జీవిత అనుభవాలు, రోజువారీ పత్రికల్లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు సంబంధించిన వార్తలే నాకు ప్రేరణ. తరచుగా మనల్ని విభజించడానికి ప్రయత్నించే ప్రపంచంలోని ఈ సంక్లిష్ట పరిస్థితులలో మనం ఒకరి మనస్సులలో ఒకరుగా జీవించగలిగే పవిత్ర ప్రదేశాలలో సాహిత్యం ఒకటిగా కొన్ని పేజీలు మాత్రమే మిగిలిపోయింది.

నిస్సహాయత, బాధ, అణచివేతలే నాలో భావోద్వేగంతో ఉన్న రచయితను తట్టి లేపాయి' అని బాను ముస్తాక్ పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, దాన చింతామణి అత్తిమబ్బే అవార్డుతో సహా పలు అవార్డులు ఆమెని వరించాయి.





జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690.

## మర్పల్లి నుండి బుదేరా బస్సు సౌకర్యాన్ని కల్పించండి



**మర్పల్లి, మే 22 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు రోజులకే రాష్ట్రం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. ఈ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కానీ కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మర్పల్లి మండల కేంద్రంకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎన్ హెచ్ 65 కి ఒక్క బస్సు కూడా లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే 50 నుంచి 60 రూపాయలు ఒకరికి చొప్పున తీసుకుంటున్నారు. బుదేరా వెళ్తే అటు నుండి హైదరాబాద్, సంగారెడ్డి సదాశివపేట, జహీరాబాద్, కర్ణాటకలోని బీదర్, తదితర పట్టణాలకు వెళ్లే సదుపాయం ఉంది. బస సౌకర్యాన్ని కల్పిస్తే ఇటు జహీరాబాద్ బీదర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లి చదువుకునేందుకు విద్యార్థులకు ఇటు ఉద్యోగం చేసే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. మండలంలోని చాలా గ్రామాలు ప్రతిరోజు బుదేరా నుండి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. అధికారులు నాయకులు స్పందించి బుదేరా మర్పల్లి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సంఘ సంస్కర్తకు ఘన నివాళి అర్పించిన కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 22 (జనం సాక్షి) :** దళిత వైతాళికులు, సంఘ సంస్కర్త ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆదర్శమైన జీవితాన్ని. స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సంఘసంస్కర్త ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాహుల్ రాజ్ ఎం.వి. భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎం.వి.భాగ్యరెడ్డి వర్మ సేవలను కొనియాడారు. హైదరాబాద్ ఉన్న సంస్థానంలో 26దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తు చేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న దేవదాసి వ్యవస్థ, జోగిని వ్యవస్థలపై అవిశ్రాంత పోరాటం చేసి వాటి రద్దుకు నిజాం నవాబులను ఒప్పించిన ఘనత భాగ్యరెడ్డివర్మదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ ,కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జలమండలిలో ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



**మహబూబ్‌నగర్, మే 22 (జనంసాక్షి) :** ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆనాటి సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని పేర్కొన్నారు. బాలికా విద్య కోసం ఆనాడే పరితపించిన మహనీయుడన్నారు. సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన రచయితగా, పాత్రికేయుడిగానూ పోరాడారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, ఆపరేషన్ డైరెక్టర్-1 అమరేందర్ రెడ్డి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం, జీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



**గద్వాల నడిగడ్డ, మే 22 (జనం సాక్షి) :** జిల్లాలో స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి తాగు నీరు, పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూగర్భ జలాలను రక్షించడానికి, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి రూఫ్‌టాప్ రైన్వాటర్ హార్వెస్టింగ్ పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో భూగర్భ జలాలు పెంపొందించి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు బోర్‌వెల్‌ల వినియోగంపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.పిహెచ్సీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రైన్వాటర్ హార్వెస్టింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి మండలానికి అవసరమైన భూగర్భ జల ప్రాజెక్టులకు సంబంధించిన మంజూరు లిస్టును తయారు చేసి, పురోగతి నివేదికను సమర్పించాలని ఆదేశించారు.రాబోవు వర్షాకాలంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం లోపిస్తే ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో, తక్షణమే ప్రత్యామ్నాయ వ్యర్థ నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు.హరిత హారం,అవెన్యూ ప్లాంటేషన్ చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్లు, మరుగుదొడ్లు లేనందున, అక్కడి వాటర్ ఫెసిలిటీస్ అవసరాలపై ప్రత్యేక లిస్టు తయారు చేసి సమర్పించాలని పేర్కొన్నారు.ప్రతి గ్రామానికి అవసరమైన సదుపాయాల వివరాలను సేకరించి,తగిన సూచనలతో సహా పంపించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిపిఓ నాగేంద్రం,వైద్య అధికారి సిద్ధప్ప,వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలు అధికం

- బాల్య వివాహాల నియంత్రణ కోసం బాల అదాలత్
- జూన్ నెలలో కార్యరూపం
- అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 22 (జనం సాక్షి) :** మారు మూల గ్రామాలలో ఉన్నటువంటి పిల్లలకు బాల్య వివాహలపై అవగాహన కలిపిస్తు న్యాయం జరిగేలా చూడాలనే ఉద్దేశ్యం తో "బాల అదాలత్" కార్యక్రమాన్ని జిల్లా లో మొట్ట మొదటి సారిగా చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు. గురువారము మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారానికి "బాల అదాలత్" కార్యక్రమం పై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడము జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లోపిల్లల సమస్యలు మరియు బాల్య వివాహాలను అరికట్టేందుకు పిల్లలకు వారి తల్లిదండ్రులకుప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి పూర్తి అవగాహనా కలిపించాలని, జిల్లలో రెవెన్యూ, పోలీస్, విద్యా, ఆరోగ్య, వెల్ఫేర్, అన్ని శాఖల సమన్వయముతో ముందు కెల్లాలని, జూన్ నెలలో బాల అదాలత్ కార్యక్రమము ఉంటుందని, అందుకు అందరు అధికారులు ముందస్తు ప్రణాలికల తో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారానికి వచ్చే నెలలో మూడో వారంలో నిర్వహించబోయే "బాల అదాలత్ కార్యక్రమం" గురించి కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డివివరించారు.పిల్లలకుఆరోగ్యము విద్య ముఖ్యమైనవనీ, వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, వాటి నివారణకు తదుపరి కార్యాచరణ, బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఇక్కడ సమన్వయంతో ఈ కార్యచరణ రూపొందించుకోవాలని, బాలల పరిరక్షణ కమిటీలు బలోపేతం చేయాలని కమిషన్ సూచించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లాలో ఐ సి డి ఎస్ మరియు బాలల పరిరక్షణ విభాగం సేవలు గురించి జిల్లా సంక్షేమ అధికారిని జయసుధ పవర్ ప్రజెంటేషన్ ద్వార వివరించారు. జిల్లాలోని అనాధ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కి కమిషన్ సభ్యులు అపర్ణ కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొంరాస్ పెట్ మండలాన్ని పై లేట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసామని, వైకల్యం గల పిల్లలను గుర్తించి , చికిత్స కు గుర్తించడం జరిగిందని కమిషన్ సభ్యులకు వివరించారు. పాక్సో మరియు బాల్య వివాహ బాధిత బాలికలకు ప్రత్యేక గృహము ,వసతి సదుపాయాలుకల్పించే విదంగా చూడాలని కోరారు. గ్రామాలలో ఉండే అలాగే విద్య హక్కు చట్టంపై మరియు ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజుల నియంత్రణ గురించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వెంకటేశం కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.కార్యక్రమం పై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వచ్చే నెల మూడో వారంలో కార్యక్రమం కార్యచరణ సిద్ధం చేసుకోవాలని వివిధ శాఖల అధికారులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించారు. తదుపరి జిల్లా లోని శిశు గృహమును కమీషన్ సభ్యులు సందర్శించి, అక్కడి వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు అపర్ణ, చందన, సరిత, వచన్ కుమార్, వందనగౌడ్, ప్రేమలత అగర్వాల్, అదనపు కలెక్టర్ సుధీర్, సిడబ్ల్యూసి చైర్మన్ వెంకటేశం, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు ,జిల్లా బాల పరిరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి, మరియు భరోసా సిబ్బంది, బిఆర్‌బి కోఅర్డి నేట్టార్ , సి డి పి ఓలు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ పరిధిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

- నిందితుడి అరెస్టుకు డ్రైవర్ డిమాండ్



**శేరిలింగంపల్లి, మే 22 (జనంసాక్షి) :** అసంబద్ధమైన డ్రైవింగ్ ను చేయడమే కాకుండా... తన వాహనానికి ఆర్టీసీ బస్సు తాకిందని కోరుకుంటూ సదరు ఆర్టీసీ బస్ డ్రైవర్ పై దాడికి పాల్పడిన ఓ గుర్తు తెలియని ఆటో డ్రైవర్ ను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బస్సు డ్రైవర్ మియాపూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు చేసిన వివరాల మేరకు... సింగాపురం రాంబాబు అనే ఆర్టీసీ డ్రైవర్ నగరంలోని కాచిగూడ ప్రాంతంలో నివాసం ఉంటూ సిబిఎస్ టు ఇస్నాపూర్ మార్గంలో ఆర్టీసీ బస్ డ్రైవర్ గా విధులను నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో బస్ కండక్టర్ జె. రంగప్రసాద్ తో కలిసి ఈనెల 19వ తేదీన సిబిఎస్ టు ఇస్నాపూర్ టిఎస్ 10 జెడ్ 0121 నెంబర్ గల బస్సును నడుపుతుండగా ఉదయం 9 గంటల 45 నిమిషాల ప్రాంతంలో మియాపూర్ చౌరస్తా తర్వాత బస్టాప్ వద్ద టిఎస్ 10 యుడి 2351 నెంబర్ గల టాటా ఏస్ ఆటో వాహనం అసంబద్ధంగా వేగంగా వచ్చి ఆటో యొక్క ఎడమవైపు సైడ్ మిర్రర్ కు తగిలింది. దీంతో తీవ్ర కోపోద్రిక్తుడై తీక్షణమైన దుర్భాషలాడుతూ సదరు ఆటోడ్రైవర్ ఆర్టీసీ బస్సు ని ఎక్కి డ్రైవర్ పై బూతులకు దిగి అంతటితో ఆగకుండా దాడి చేయడం జరిగింది. అనంతరం సెల్ ఫోన్ తీసుకుని దిక్కున చోట చెప్పుకోమని వెళ్లిపోబోతుండగా ఆర్టిసి బస్సులోని పలువురు ప్యాసింజర్లు ఆటో డ్రైవర్లు వారించగా నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ ను ఇచ్చివేసి పారిపోవడం జరిగింది. అసంబద్ధమైన డ్రైవింగ్ తో పాటు విధులలో ఉన్న తనపై అకారణంగా దాడికి పాల్పడిన ఎస్ ఆటో డ్రైవర్ ను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ డ్రైవర్ సింగారపు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

## పచ్చిరొట్టెతో అధిక దిగుబడి



**తెల్కపల్లి, మే 22 (జనం సాక్షి) :** తెలకపల్లి రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చి రొట్టెతో నేల సారవంతంతో పాటు పంటకు మేలు అధిక దిగుబడులు సాధ్యమని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ శ్రీరామ్ లు అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్నారం గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడుతూ నేలను బట్టి పంట మార్పిడి పద్ధతి ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను రైతులకు సూచించారు. రబీ కాలంలో తక్కువ నీటిని ఎంచుకునే పంటలను వేసుకోవాలని తెలిపారు.విత్తన శుద్ధి మట్టిని ఏవిధంగా శుద్ధి చేసుకోవాలి చూపించారు. ఎరువుల గురించి భూసార పరీక్షల గురించి క్లుప్తంగా రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తి వచ్చే పంటలను రాబట్టే విధంగా రైతులు కొనసాగాలని వారు సూచించారు. ఒకసారి వేసిన విత్తనాలు మరోసారి నాటుకుంటే పంట పండదని మంచి స్పష్టమైన మొక్కలచే వచ్చిన విత్తనాలను విత్తన శుద్ధి చేసుకుని విత్తనాలు వేసుకుంటే సరైనటువంటి పంట పండే అవకాశం ఉంటుందని సూచించారు. అనంతరం రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్మదా, సింగిల్ విండో డైరెక్టర్లు వి రాజ మహేందర్ రెడ్డి, ఉషన్న, వ్యవసాయ విస్తరణాధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, మే 22 (జనం సాక్షి) :** టేక్మాల్ మండల పరిధిలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. జిల్లాలోని మొత్తం 498 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 120 ధాన్యం కొనుగోలు సెంటర్లలో కొనుగోలును పూర్తిగా ముగించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం టేక్మాల్ మండల కేంద్రంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ముందుగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షణ చేసి తేమ శాతం వచ్చిన ధాన్యన్ని వేగవంతంగా కొనుగోలు జరపడం ట్యాగ్ చేసిన మిల్లులకు తరలిస్తున్న తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు.

## వరి ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతన్నలు

- 167వ జాతీయ రహదారిపై రాస్తారోకో



**జడ్చర్ల, మే 22 (జనం సాక్షి) :** నెల రోజులుగా రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనడం లేదని ఆగ్రహించిన అన్నదాతలు జాతీయ రహదారి 167 పై రాస్తారోకో చేపట్టిన సంఘటన గురువారం జడ్చర్ల పట్టణంలో చోటు చేసుకుంది. గత ఇరవై రోజులుగా రైతులు జడ్చర్ల పత్తి మార్కెట్ లో వరి ధాన్యం తీసుకొచ్చిన కనీసం తమను పట్టించు కొనే నాధుడే లేడని ఆరోపించారు. బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి వచ్చిన పరిస్థితి లో మార్పు రాలేదని రాత్రి వచ్చిన అకాల వర్షానికి తమ ధాన్యం పూర్తిగా తడిసి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న సివిల్ సప్లై డిఎం రవి నాయక్ మార్కెట్ దగ్గరకు చేరుకొని ధాన్యం కొనుగోలు చేపడతామని హామీ ఇవ్వడంతో పాటు దాదాపు 6వెయ్యిల బస్తాల కొనుగోలుకు టోకెన్లు ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఇంకా జడ్చర్ల మార్కెట్ లో దాదాపు 2 వేలకు పైగా ధాన్యం బస్తాలు ఉన్నట్లు రైతులు తెలిపారు.

## రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి



**నంగునూర్, మే 22 (జనం సాక్షి) :** మండలంలోని రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రోజు సాయంత్రం రాజగోపాల్పేట గ్రామానికి చెందిన కొక్కొండ జగదీశ్వర్ చారీ తండ్రి పేరు నరసింహ చారి తన యొక్క గ్లామర్ 2 వీలర్ బైక్ పైన తన ప్రైవేట్ జాబు డ్యూటీ ముగించుకొని సిద్దిపేట నుండి రాజగోపాల్పేట వైపు వస్తుండగా సురభి కాలేజ్ చౌరస్తా దాటిన తర్వాత ముంద్రాయి గ్రామ శివారులోని శ్రీ శ్రీనివాస ఆగ్రో రైస్ మిల్ వద్ద సిద్దిపేట హుస్నాబాద్ రోడ్డుపైన జగదీశ్వర్ కంటే ముందుగా వెళుతున్న తత్తరి యాదగిరి తండ్రి కనకయ్య అను అతను తన భార్య తో గ్లామర్ బైక్ పై వెళుతుండగా వెనుక నుండి జగదీశ్వర్ అతివేగంగా జాగ్రత్తగా వచ్చి వెనకాల వైపు నుండి టక్కరియ్యడంతో ఎగిరే రోడ్డుపైన పడడంతో జగదీశ్వర్ కి తలకి తీవ్ర రక్త గాయం కాగా వెంటనే 108లో సిద్దిపేట ఏరియా హాస్పిటల్ కి తరలించగా రాత్రి 08:18 నిమిషాలకు చనిపోయినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించినారని అతని తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ సౌజన్య తెలిపినారు.

# ప్రజల బాధలు పట్టని హైడ్రా...

- పూర్తిగా విచారించకుండానే ఇండ్ల కూల్చివేతలు
- మరోమారు పరిశీలించి న్యాయం చేయండి
- పీర్జాదిగూడలో ఇండ్లు కోల్పోయిన బాధితుల వేడుకోలు



**బోడుప్పల్, మే 22 (జనంసాక్షి) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని సాలర్జింగ్ కంచెలో సమాదుల స్థలాన్ని ఆక్రమించి ఇండ్ల నిర్మాణం చేపట్టారని గురువారం హైడ్రా అధికారులు కూల్చివేశారు.ఈ సందర్భంగా ఇండ్లు కోల్పోయిన భాదితులు రజనీకాంత్ రెడ్డి,బంగారు శ్రీకాంత్, మామిడాల సంపత్, సుదాకర్ రెడ్డి, అభినందన్ రెడ్డిలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా ప్రజల బాగుకోసం కాకుండా రాజకీయాల కోసం ఏర్పరిచి ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. పర్వతాపూర్ సాలర్జింగ్ కంచెలోని సర్వే నంబర్ 12 పార్ట్,13పార్ట్,14పార్ట్ గల వ్యవసాయ భూమిని 2007 సంవత్సరంలో జి.పి లేఅవుట్ చేసి రిజిస్ట్రేషన్ సేల్ డీడి ద్వారా సుకేందర్ రెడ్డి 2008 సంవత్సరంలో ఓపెన్ ప్లాట్లు అమ్మాడు. ఇందులో ప్లాట్ నంబర్ 165 నుండి 168 వరకు గల నాలుగు ప్లాట్లను కె.కమలాదేవి, మందల లక్ష్మీదేవిలు 2019 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ చెల్లించి ఉందని వాటిని మేము 2021 సంవత్సరంలో తీసుకొని స్థానిక కార్పొరేషన్ నుండి ఇంటి పర్మీషన్ తీసుకొని ఉన్నమాని తెలిపారు. మాకు ఆనుకొని సర్వేనంబర్ 12 పార్ట్ లో మైనారిటీ స్మశాన వాటిక ఉండడంతో వారికి అది సరిపోక ఎలాగైన విస్తరించాలి అవకాశం కోసం చూస్తున్న వారికి కరోనా మహమ్మారి వారికి అవకాశంగా లభించింది.వ్యక్తి చనిపోతే ఎవరు భయటకు రాలేని పరిస్థితిలో స్మశాన వాటికను విస్తరించుకుంటు మా ప్రయివేట్ స్థలంలోకి చొచ్చుకొని వచ్చారని ఇప్పుడు ఏకంగా స్మశానాన్ని కబ్జా చేశారని హైడ్రాకు ఫిర్యాదు చేయడం విడ్డురంగా ఉందని ఏది పరిశీలించని హైడ్రా అధికారులు ఉదయాన్నే మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేసి హడావిడిగా షాపులను కాలి చేయించి కూల్చడం దారుణమని అన్నారు.ప్రయివేటు భూమిని కొని ఇంటి పర్మీషన్ తీసుకొని నిర్మాణం చేసుకొని విద్యుత్ బిల్లులు,వాటర్ బిల్లులు,హౌస్ ట్యాక్సీ అయిదు సంవత్సరాల నుండి కడుతు అందులో నివాసం ఉన్న మమ్మల్ని సర్వేనంబర్ 1 సీలింగ్ భూమిలో ఉన్నారని కాలిచేయండి కూల్చడం తగునా అని ప్రశ్నించారు. హైడ్రా కమీషనర్ రంగానాథ్ హైడ్రా ఏర్పాటు కాక ముందు కట్టుకొని అందులో ఉంటున్న ఇండ్ల జోలికి పోమని మీడియా ముకంగా చెప్పిన మాటలు ఉట్టివేనా మా బ్రతుకులను రోడ్లపాలు చేసిందని కంటతడి పెట్టారు.మరోమారు మా పత్రాలను పూర్తిగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

- 1100 మంది పోలీసులతో నిఘా ఏర్పాటు
- నిర్ణీత సమయంలో పోలీసులు డ్యూటీ ప్రదేశానికి చేరుకోవాలి
- ప్రజా ప్రతినిధులు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి సంగారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా సుమారు 1100 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. గురువారం సీఎం పర్యటన సంబంధించిన ఎలిప్యాడ్, బసవేశ్వర చౌక్, కే.వి పాఠశాల, సభాస్థలాలను ఎస్పీ సందర్శించి, బందోబస్తు ఏర్పాట్ల గురించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి అనుముల రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించి, జహీరాబాద్ పట్టణంలో బసవేశ్వర చౌక్, మాచునూర్‌లో కే.వి పాఠశాల ప్రారంభోత్సవాలతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1100 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. అనంతరం వివిధ జిల్లాల నుండి బందోబస్తుకు వచ్చిన అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ ఇస్తూ.. తమకు కేటాయించిన డ్యూటీ ప్రదేశానికి నిర్ణీత సమయంలో చేరుకొని, విఐపి వెళ్ళే మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఏవైన అవాంఛనీయ సంఘటనలు జరగడానికి అవకాశం ఉన్న సంభందిత సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. తిరిగి విఐపి వెళ్లిపోయే వరకు డ్యూటీ ప్రదేశాన్ని విడిచి వెళ్లారాదని, విధి నిర్వాహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించిన శాఖ పరమైన చర్యలుంటాయని అన్నారు. సమావేశానికి వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలలో మాత్రమే వాహనాలు నిలాపాలని, బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బందికి సహరించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావ్, జిల్లా డియస్పీ సైదా నాయక్, సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, నరేందర్ జహీరాబాద్ ఇన్స్పెక్టర్స్ శివలింగం, హనుమంతు, ఎస్బి ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, సబ్-డివిజన్ పోలీసు అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు తదితరులు ఉన్నారు.

## పిల్లలందరిని చైతన్యవంతం చేయడం అందరి బాధ్యత



**మల్దకల్, మే 22 (జనంసాక్షి) :** మండలం పెద్దోడి గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలను నివారించడం,బాల కార్మికులను నిర్మూలించడం,వివిధ హింసల నుండి పిల్లలను రక్షించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాలల సంరక్షణ ప్రతినిధి ప్రకాష్ మాట్లాడుతూపెద్దోడ్డి గ్రామంలో బాల్యవివాహాలు బాలలందరికి చేయరాదు,పిల్లలందరూ శాంతియుత వాతావరణంలో పెరగాలని,చిన్న వయస్సులో పెళ్ళిలు చేయడం చట్ట రీత్యా నేరమని,బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే సమస్యలు, నష్టాలు గురించి అవగాహన కల్పించారు.బాలలపై ఏవిధమైన వేధింపులు,అకృత్యాలు,హింస జరగకుండా ఉండటంతో పాటు పిల్లలంతా ఆనందంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులు మీద ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ 1098 కళావతి,అవుట్ రీచ్ వర్కర్ ప్రకాష్,ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, గ్రామస్తులు,ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వాటర్ ప్లాంట్లను సీజ్ చేయండి

- అధికారులకు, ఎమ్మెల్యేకు, కార్పొరేటర్ కు వినతి పత్రం అందజేసిన స్థానికులు



**కుత్బుల్లాపూర్, మే 22 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని, ముగ్ధాంనగర్, భగత్ సింగ్ మార్గ్ ప్రాంతాలలో అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ప్రజలు కుత్బుల్లాపూర్ తహసిల్దార్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్ కొలుకుల జగన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయం ఎదురుగా వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ గతంలో రెవెన్యూ అధికారులు ఇట్టి వాటర్ ప్లాంట్లను సీజ్ చేసినప్పటికీ నిర్వాహకులు తిరిగి యధావిధిగా నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరానికి మించి ప్రతిరోజు నీటిని తీయడం వలన పరిసర ప్రాంతాల ప్రజలకు నీరు లభించడం కష్టంగా మారిందన్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో ప్లాంట్లను నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇట్టి వాటర్ ప్లాంట్లను శాశ్వతంగా మూసివేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాంట్ యజమానులపై చర్యలు తీసుకోకపోతే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని వారు డిమాండ్ చేశారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మే 22 (జనంసాక్షి) :** రానున్న మూడు నాలుగు రోజులు జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఉరుములతో కూడిన వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, విపత్తు నిర్వహణ ప్రత్యేక అరవింద్ కుమార్, పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ రానున్న మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా రైతులు పండించిన ధాన్యం తడిచిపోకుండా కొనుగోలు వేగవంతం చేయడంతో పాటు వర్షం పడితే తడిచిపోకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 2.90 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించడం జరిగిందని తెలిపారు. మరో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, ధాన్యం తడిచిపోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

**వాతావరణ రిపోర్టు ముందుగా తెలుసుకోడానికి దామిని యాప్**

వర్షాభావ వాతావరణం పరిస్థితులు ముందుగా తెలుసుకోడానికి ప్రజలు దామిని యాప్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రైతులు ఈ యాప్ వల్ల ముందస్తుగా వాతావరణ వివరాలు తెలుసుకొని పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, పిడి డిఆర్డిఓ ఉమాదేవి, కో ఆపరేటివ్ అధికారి బి.రాణి, డి.యం. సివిల్ సప్లై జగన్మోహన్ తదితరులు టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## భూభారతి సర్వే పనులను వేగవంతం చేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 22 (జనం సాక్షి) :** భూ భారతి సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం లింగంపేట్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి సర్వే డెస్క్ పనులను ఆయన సబ్ కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని 25 గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించడం జరిగిందని , అట్టి సదస్సులలో పలు సమస్యలకు సంబంధించి 4225 దరఖాస్తులు రావడం జరిగాయని తెలిపారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో 4100 దరఖాస్తులను పరిశీలించి, సర్వే చేయడం జరిగాయని తెలిపారు. డెస్క్ వర్క్ ను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీఓ మన్నే ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**శ్రీరంగాపూర్, మే 22 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన బుల్లెద్దుల ఆంజనేయులు తండ్రి పేరు బుల్లెద్దుల పెద్ద బుచ్చన్న కుమారుడు బీమా కాలువలో చేపలు పట్టుటకు వెళ్లి చేపలు పడుతూ ఫిట్స్ వచ్చికాల్వలో పడి ఆంజనేయుడు చనిపోవడం జరిగినది.ఇట్టి విషయాన్ని వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రామకృష్ణ మరణించిన ప్రదేశాన్ని సందర్శించి కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టంకు తరలించారని ఎస్ఐ రామకృష్ణ తెలియజేశారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేసుకోవాలి



- తిమ్మాయిపల్లి ఏఈఓ అనూష

**చారకొండ, మే 22 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం ప్రతి రైతు పార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఈవో అనూష అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాయిపల్లిలో మొబైల్ ద్వారా ఆన్లైన్లో రైతుల వివరాలను నమోదు చేశారు. ఈసందర్భంగా ఏఈవో అనూష మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న విశిష్ట నెంబర్ ను పొందడానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ చేయబడిన మైబెల్ నంబర్ తీసుకోని వచ్చి రిజిస్ట్రీ చేసుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- చారకొండ ఎస్సై శంషుద్దీన్



**చారకొండ, మే 22 (జనంసాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శంషుద్దీన్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్సు, పత్రాలను వెంట తెలచ్చుకోవాలని అన్నారు. ద్విచక్ర, ఫోర్ విల్లర్స్ వాహనదారులు హెల్మెట్ సీటుబెల్టు తప్పనిసరిగా దరించాలని అన్నారు. తనిఖీ లో ఏఎస్ఐ అంజయ్య, కానిస్టేబుళ్లు వేణు, ఏడుకొండల్ రెడ్డి, మహేష్, సరిత, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో గౌరవం

- చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం
- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్



**సదాశివపేట, మే 22 (జనం సాక్షి) :** ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరికి విద్యుత్ తోనే సమాజంలో విలువలు, గౌరవం పెరుగుతాయని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింత సాయినాథ్ లు అన్నారు. గురువారం పట్టణంలోని చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింతా ఆనంద్ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంటర్ ఫస్టియర్, పదవ తరగతి లో ప్రతిభ కనబరిచిన 22 మంది పద్మశాలి విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింత సాయినాథ్, మాజీ వైస్ చైర్మన్ చింత గోపాలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో విద్యుత్ తోనే విలువలు పెరుగుతాయని, చదువు పట్ల ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అవరోధించాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన చేనేత సహకార సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సమాజం అధ్యక్షులు మేకల జనార్ధన్, కోశాధికారి చింత చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు అంబటి విశ్వనాథం, ఆర్కే చంద్రమౌళి, చిల్వరి రవికుమార్, అడ్డగట్టు మనోహర్, కోట రవీందర్, కొంగరి ప్రభు, గోనె శంకర్, అంబయ్య, చింత జనార్ధన్, వల్లకటి సురేష్, చేనేత సహకార సంఘం సభ్యులు కుల బాంధవులు పాల్గొన్నారు.

## మాదారి భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధన కోసం పాటుపడాలి

- వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం



**వనపర్తి బ్యూరో, మే 22 (జనంసాక్షి) :** మాదారి భాగ్య రెడ్డి వర్మ ఆశయ సాధన కోసం పాటు పడాలని ఆర్డీఓ సుబ్రమణ్యం అన్నారు.భాగ్య రెడ్డి వర్మ 138వ జయంతి ఉత్సవాలను గురువారం ఐ.డి. ఒ.సి. ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున అధికారికంగా నిర్వహించారు.ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆర్డీఓతో పాటు, ఈడిఎస్సీ కార్పొరేష్ మల్లికార్జున్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, సంఘ నాయకులు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మాదారి భాగయ్య దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారనీ, విద్య ద్వారానే దళితులు ఆత్మగౌరవం, అభివృద్ధి సాధించగలరనే విశ్వాసంతో హైదారాబాద్‌లో దళితుల కొరకు 30 పాఠశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. హిందూ సమాజంలోని అస్పృశ్యత, అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. సమాజంలో ఉన్న జోగిని, దేవదాసి, వెట్టిచాకిరి వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించి సమాజంలో మార్పు కొరకు కృషి చేశారని తెలిపారు. ఆది ఆంధ్ర సభ నిర్వహించి దళితులను, అణగారిన వర్గాల ప్రజలను చైతన్య పరిచేందుకు కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఈ.డి ఎస్సీ కార్పొరేష్ మల్లికార్జున్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి యం. డి. అఫ్జల్, సంఘం నాయకులు గంధం నాగరాజు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, మే 22 (జనం సాక్షి) :** వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని, వర్షాల నుంచి ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో భద్రపరచాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.గురువారం గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి, గుంటిపల్లి గ్రామంలోని ఐ.కే.పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింగ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి,తేమ శాతం,లారీ లోడింగ్, ఓపియంఎస్‌లో డేటా ఎంట్రీ తదితర అంశాలను పరిశీలించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున,ధాన్యం తడిపోయే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ధాన్యంలో తేమ శాతం 17%కు చేరగానే వెంటనే సంచుల్లో నింపి,లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలించాలని, వర్షాలు వచ్చినపుడు వాహనాలు వచ్చే వరకు సంచులను టార్పాలిన్లతో కప్పి సురక్షితంగా ఉంచాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అన్ని వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని,డేటా పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి అవసరమైన గన్ని సంచులు, లారీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం రవాణా పనులు ఏ మాత్రం ఆలస్యం కాకుండా ఉండేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అకాల వర్షాలు వచ్చినా ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ట్రక్ షీట్ వచ్చిన వెంటనే ఓపియంఎస్ లో డేటా ఎంట్రీ చేసి రైతులకు వెంటనే నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు సజావుగా జరగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి, కేంద్రంలో అందుతున్న సౌకర్యాలు,వసతుల గురించి తెలుసుకున్నారు. రైతులు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు వివరించారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల,అడిషనల్ డి.ఆర్.డి.ఓ నర్సింహులు,మండల వ్యవసాయాధికారులు, ఏపియంలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న కారు, ఆటో..
- ఇద్దరు మృతి, మరికొందరి పరిస్థితి విషమం..
- ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు..
- పుష్కరాల వేళ అలుముకున్న విషాదం..





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా కారు, ఆటో ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుష్కరాలకు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక శివారు కుమ్మరిపల్లికి చెందిన గుంటుకు సమ్మయ్య కుటుంబ సభ్యులు కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాలకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యంలోని భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ సమీపంలో పుష్కరాలకు వెళ్లి ఎదురుగా వస్తున్న మహింద్రా కారు ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో మహింద్రా కారు బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ వాసులకు గాయాలు అయ్యాయి. మరోవైపు ఆటోలో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు కాగా అందులో కుమ్మరిపల్లికి చెందిన విష్ణు, రజితలు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. మరో ఇద్దరు నరసింహ, ఫిర్షాత్ ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. మిగతా క్షతగాత్రులకు భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లోనే చికిత్స అందిస్తున్నారు. పుష్కర స్నానాలను ఆచరించేందుకు వెళ్తున్న క్రమంలో కుమ్మరిపల్లికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

ఖానాపూర్, మే 22 (జనంసాక్షి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఒక్కసారి ఆ గ్రహించి ఆందోళన చేపట్టారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సుమారు 200 మంది రైతులు బైఠాయించి ధర్నా రాస్తారోకో నిర్వహించారు కలెక్టర్ వచ్చేవరకు ధర్నాను విరమించేది లేదని తడిసిన ధాన్యాన్ని ఏ వన్ గ్రేడ్ తో కొనాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీల సమస్య ఉందని తూకంలో ఆలస్యం అవుతుందని అన్నారు. ఇకముందు కూడా వర్షాలు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చేస్తున్న రాస్తారోకో ధర్నాకు అఖిల పక్షం ఆధ్వర్యంలో రైతులకు మద్దతు తెలిపారు ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు నందిరామయ్య, ఉపేందర్, దివాకర్, మనోజ్, అనిల్, సబీర్, నాయిని సంతోష్ ,గౌరీకర్ రాజు రైతులు భీమన్న ,రాజేశ్వర్ శంకర్ తదితరులున్నారు.

## ఆపరేషన్ కగార్ నిలిపివేయండి

- కళ్లకు గంతలతో నిరసన



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలో పలు వామ పక్షాల ఆద్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ లో గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం అడవుల్ని కార్పొరేటర్లకు అప్పగించే లక్ష్యంతో మోడీ సర్కార్ తలపెట్టిన ఆపరేషన్ కగార్ నేడు దారుణ చర్యగా మారిందన్నారు. ఆపరేషన్ కగార్ తీరుకు నిరసనగా వామపక్ష పార్టీల ప్రజా సంఘాలు గా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిన్న ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ లో కేంద్ర సాయుధ బలగాల కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు 25 మందికి పైగా మృతి చెందడం జరిగిందన్నారు. ఒకవైపు శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరుతున్న కూడా కేంద్రం ఇలాంటి దారునానికి ఒడిగట్టడం దారుణం అన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. మేధో వర్గాలు, ప్రజాతంత్ర వాదులు, ప్రజలు ప్రజాస్వామిక వాదులు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర సర్కార్ ని కోరుతున్నా మోడీ, అమిత్ షాలు ఎందుకు స్పందించడం లేదన్నారు. అడవుల నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి, అంతిమంగా అడవి సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో గోడం గణేష్ తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిహణ అధ్యక్షుడు, సిర్ర దేవేందర్ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి వెంకటనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గద్దల శంకర్, బీఎస్పీ సీనియర్ నాయకులు మడావి గణేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, గేడం కేశవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి,మెస్రం భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, వెట్టి మనోజ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి,ఎర్రాజీ హరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## సరస్వతీ పుష్కరాలకు వచ్చే వాహనాలకు వన్ వే

- దారి మళ్లింపుతో తొలగనున్న ఇబ్బందులు..



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సరస్వతీ పుష్కరాలకు వచ్చే వాహనాలు వన్ వే ద్వారా దారి మళ్లింపు చేయడం జరిగిందని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ సరస్వతీ పుష్కరాలకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో కాళేశ్వరం రూట్‌ను వన్‌వేగా మార్చినట్టు పేర్కొన్నారు. బుధవారం కాళేశ్వరంలో భారీ వర్షం కురవడంతో పాటు రేపటి నుంచి పుష్కరాలు ముగిసేవరకు ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని క్షేత్ర స్థాయిలో తిరిగిన ఎస్పీ వన్‌వే చేశారు. హైదరాబాద్, వరంగల్ నుంచి ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలనీ, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహాదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, కాటారం, మహదేవ్పూర్ అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలనీ, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహాదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని, మహారాష్ట్ర, ఛత్తీస్గడ్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి వచ్చే వాహనాలు సిరోంచ, అంతర్ రాష్ట్ర బ్రిడ్జి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో అదే రూట్లో సురక్షితంగా చేరుకోవాలనీ అన్నారు. పుష్కరాలకు వచ్చే వాహనదారులు, పోలీసులకు సహకరించాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు.

## కాళేశ్వరంలో సినీ హీరో అల్లు అర్జున్ తల్లి నిర్మల..

- పుష్కరాలకు విచ్చేసిన ప్రముఖులు..




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు ఎనిమిదో రోజైన గురువారం పలువురు ప్రముఖులు విచ్చేసి, పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల సరస్వతి నదిలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు సూర్యనారాయణ, తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కుటుంబ సభ్యులు గురువారం త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేసి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

## రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

- ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఖానాపూర్ రూరల్ 22 మే (జనం సాక్షి): నిన్న కురిసిన భారీ వర్షం కారణంగా ఖానాపూర్ మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధిక తూకం తో కొనుగోళ్లు జరిపితే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం శుభ్రపరిచి, ఎండబెట్టే ఏర్పాట్లు చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంఎల్ఏ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, వర్షాలతో ధాన్యం తడవడం బాధకరమని, కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. అధిక తూకాలు వేయడం, తక్కువ ధరలకు కొనుగోలు చేయడం వంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సివిల్ సప్లై డి ఎం సుధాకర్, తహసీల్దార్ సుజాత, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ కృషి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి ,మే 22 (జనంసాక్షి) : దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ.డి. చాతరాజుల దుర్గాప్రసాద్, అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి చేశారని అన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపుమాపేందుకు పోరాటం చేశారని తెలిపారు. దళిత ఉద్యమ పితామహుడుగా, సంఘసంస్కర్తగా భాగ్యరెడ్డి వర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, సమాజంలో దళితుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. మహానుభావుల జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, మహనీయుల చరిత్ర, త్యాగాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహనీయులు ఆచరించిన మార్గాలను భావితరాలకు అందిస్తూ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో 174 కోట్ల రూపాయలు జమ

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

మంచిర్యాల ప్రతినిధి మే 22 (జనంసాక్షి) : జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 318 కేంద్రాలు ద్వారా 18 వేల 978 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 41 వేల 266 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 174 కోట్ల 11 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 107 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం (తేది: 21-05-2024 నాటి వరకు) కంటే ఈసారి 30 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.

## దంచి కొడుతున్న వానలు

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- తడిసి ముద్దవుతున్న జొన్న బస్తాలు



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : అరేబియా సముద్రం అల్ప పీడన ప్రభావం కారణంగా ఉమ్మడి అదిలాబాద్ వ్యాప్తంగా చెదగొట్టు వానలు ఏక ధాటిగా కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం రాత్రి నుంచి వర్షం తెల్లవారు జాము వరకు కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ అకాలవర్షాలకు ముఖ్యంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వర్షం వల్ల రైతులు పండించిన జొన్న పంట నీళ్ళ పాలు అయ్యిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వమే తమను ఆదుకోవాలని మొర పెట్టుకుంటున్నారు. తడిసి పోయిన జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన జొన్న బస్తాలు వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోయాయి. గత కొద్ది రోజులుగా జొన్నకొనుగోల్లు నెమ్మదిగా కొనసాగుతుండటంతో జొన్నబస్తాలు మార్కెట్ యార్డుల్లోనే మగ్గి పోతున్నాయి. దీంతో అప్పుడప్పుడు కురుస్తున్న చెడగొట్టు వర్షాలకు జొన్న పంట కొనుగోలు కేంద్రాల్లో ఇలా తడిసి పోవాల్సి వస్తుంది.

## కళ్లమే వాగైంది



కాటారం మే 22 (జనం సాక్షి) : కాటారం మండలం లో కుంభవృష్టి లాగా అతి భారీ వర్షం కురిసింది. రైతులు పోసిన కల్లం వాగుల మారాయి. అతి భారీ వర్షం కురిసిన గంటసేపైనా అతిగా వర్షం పడ్డ వలన కల్లాలు పోసిన ధాన్యం కొట్టుకపోయింది. లారీలు లోపమా లేక కొనుగోదారుల లోపమా తెలియాల్సి ఉంది. కళల్లో వరి ధాన్యం కుప్పలు అలాగే ఉండిపోయినవి. రైతులు కలాల వద్ద ఉండి వాళ్ల గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు. పొలం కోసి నెల రోజులు గడిచినప్పటికీ ధాన్యం దాదాపు 40% విలువ ఉన్నవి. ఎలాగైనా ప్రభుత్వం ఆదుకుంటుందని ధీమా ఉన్నది, కానీ వర్షం పడ్డ సాకుతో కటింగ్ పెట్టే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నిష్పాత్మంగా కొనుగోలు చేయాలని రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగకూడదని చెప్తున్నప్పటికీ రైతుల్లో ఒక ఆవేదన మాత్రం మిగిలి ఉంది. ఈ సాకుతో కటింగ్ పెడితే నష్టపోయేది రైతులమే కదా అనే ఆవేదన ఉంది. కళ్ళల్లో ఎందుకు వడ్లు మిగిలినవి అనే దాని పైన అధికారులు కచ్చితంగా సర్వే చేసి ఇలాంటి పొరపాట్లు ఎప్పుడు జరగకుండా చూడాలని రైతుల కోరుతున్నారు.


## కాళేశ్వరంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు..



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో వర్షాలకు ధ్వంసమైన వాటికి సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం రాత్రి వచ్చిన గాలివానకు మెయిన్ ఘాట్ నుండి విఐపి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన బారికేడింగ్ ధ్వంసం కావడం, టెంట్ సిటీలో వర్షపునీరు నిలిచి బురదమయం కావడంతో గురువారం ఉదయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టి బాగు చేశారు. పుష్కర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తూ, మరమ్మతు పనులు చేయిస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- హత్య చేసి బావిలో పడేశారని బంధువులు గ్రామస్తుల ఆరోపణ
- భారీ బందోబస్తు నడుమ మృతదేహాన్ని నర్సంపేట ఆసుపత్రికి తరలించిన పోలీసులు

మహబూబాబాద్ ప్రతినిధి మే 22 (జనం సాక్షి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెంగా గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం మండలంలో కలకలం రేపింది వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన తేజావత్ బద్రు మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యారని అతని భార్య తేజవాత్ నీల గూడూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తుండగా గురువారం ఉదయం గుండెంగా గ్రామంలోని వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతుండగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఇది ముమ్మాటికీ హత్యేనని కొందరు వ్యక్తులు హత్య చేసి బావిలో పడేశారని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఆరోపిస్తున్నారు. అయితే కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం దావత్ ఉందని చెప్పి కొంతమందితో బయటికి వెళ్లాడని వారే నా భర్తను చంపి బావిలో వేశారని వెంటనే వారిపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మృతదేహాన్ని బయటకు తీసి తరలిస్తున్న సమయంలో గ్రామస్తులు బంధువులు అడ్డుకొని రాస్తారోకో చేసి నిందితుల ఇంటి ముందు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా గూడూరు చెన్నారావుపేట నర్సంపేట మహబూబాబాద్ కు చెందిన సిఐలు నలుగురు ఎస్సైలు భారీ బందోబస్తులతో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిమిత్తం పంపడం జరిగింది. పోలీసులు కేసు పై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే మా లక్ష్యం

- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి, మే 22 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం పేద ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు నాయకులు అధికారులతో కలిసి భూమి పూజ కార్యక్రమాలకు హాజరై పలు ఇండ్లకు ఎమ్మెల్యే చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,దివంగత భారత ఉక్కు మహిళ ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఏఎంసీ చైర్మన్ యాట గీతా నరసింహ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,తదితరుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఆది నాయకత్వం ఆదేశాల మేరకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పాదయాత్ర నిర్వహించి,గాంధీ చేసిన సేవలను,భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలందరూ గుర్తించి ముందుకు వెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..కల్వకుర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు సరైన న్యాయం జరుగుతుందని ప్రజలందరూ విశ్వసిస్తారని,అందుకు అనుగుణంగానే పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు పరుస్తుందని అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణానికి రూ,5 లక్షలను విడుదలవారీగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సీసీ రోడ్లు,బీటీ రోడ్ల నిర్మాణానికై 600 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుపరిచే విషయంలో రాజీ పడేదే లేదని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం,10 లక్షలతో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు,రూ,500 గ్యాస్ సిలిండర్,రైతు రుణమాఫీ,రైతు భరోసా, పేదలకు రేషన్ కార్డులు,సన్న బియ్యం,పథకాలను అమలు పరచామని అన్నారు.జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా రూ,6 వేలకోట్ల తో నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపడానికి కృతనిశ్చయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఖానాపూర్ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 256లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించడంతోపాటు,కుల మతాలకు అతీతంగా అన్ని కులస్తుల విద్యార్థులు ఒకే దగ్గర చదువుకునేందుకు సుమారు 25 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ,200 కోట్లతో నిర్మించడానికి ఈనెల 26న డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క చేతులు మీదుగా శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.జంగారెడ్డిపల్లి గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లకు,అంతర్గత మురుగు కాలువలకు నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి స్పెషల్ ఆఫీసర్ నాగరత్న,తహసిల్దార్ నాగార్జున,ఎంపీడీవో శ్రీకాంత్,ఏఎంసి డైరెక్టర్లు అంజయ్య గుప్తా,శ్యాంసుందర్ రెడ్డి,అజీమ్,వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ వరలక్ష్మి రాజేందర్ రెడ్డి,పంచాయితీ కార్యదర్శి రాము,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, జంగయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పయ్యావుల రమేష్ యాదవ్, దాసరి యాదయ్య,డేవిడ్,రేణురెడ్డి, రాంపూర్ చిన్న హరి మోహన్ రెడ్డి,ఆవంచ నరసింహారెడ్డి,రవీందర్ యాదవ్,చెన్నకేశవులు, రాజేందర్ నాయక్,అజీజ్ ఆరిఫ్,ప్రదీప్ రెడ్డి,జాజాల నరేష్,తుమ్మ నరసింహ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యదయ్య



**చేవెళ్ల, మే 22 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలం సింగపూర్ గ్రామంలో, చేవెళ్ల పట్టణంలోని సిపిఐ కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించ నున్న ఇందిరమ్మ ఇండ్లకు స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనే ధృడ సంకల్పంతో పని చేస్తుందని, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఎవరు ఆందోళన చెందకూడదని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హిమబిందు, చేవెళ్ల, ముడిమ్యాల పీఏసిఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, పడాల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, మర్పల్లి కృష్ణారెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తిక్ రెడ్డి, చేవెళ్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, గోపాల్ రెడ్డి, జహంగీర్, శంకర్, కేసారం శ్రీనివాస్, నాయకులు, పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, అలీ, పాండు గౌండ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే



**తలకొండపల్లి, మే 22 (జనంసాక్షి) :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 256లో సుమారు 25 ఎకరాల్లో రూ,200 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను,విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.ఇందులో భాగంగా గురువారం తహసిల్దార్ నాగార్జున,అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.ఈనెల 26న డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సెంటు గుంటకు సాగు నీరు అందిస్తా..

- భూ నిర్వాసితులకు అన్ని విధాలుగా ఆదుకుంటాం
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**చందంపేట, మే 22 (జనం సాక్షి) :** నేరేడుగోమ్ములి మండలంలోని చిన్నమునిగల్ గ్రామ సమీపంలో గల లిఅంబాభవాని లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతినిలి ఇరిగేషన్ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి, రైతాంగానికి సాగు నీరు అందించాలని అధికారులను, కాంట్రాక్టర్‌లను ఆదేశించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అంబాభవాని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు త్వరలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి భూ నిర్వాసితులకు ఆదుకుంటాం అని అన్నారు.

**అంబాభవాని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు 184కోట్ల రూపాయలు మంజూరు**

ఈ ప్రాజెక్ట్ వచ్చే జూన్ నెల నాటికి త్వరితగతిన పూర్తి చేసి,రైతాంగానికి సాగు నీరు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి


- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, మండల అభివృద్ధి అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేటగిరి వైజ్ గా రిజర్వేషన్ నిష్పత్తిని అనుసరించి మండల స్థాయి కమిటీలతో ఎంపిక పూర్తి చేసి, జిల్లా స్థాయికి లబ్ధిదారుల జాబితాను అందజేయాలని తెలిపారు. బ్యాంక్ లింకేజీ ఉన్న దరఖాస్తులు అర్హులైన జాబితాను కూడా పూర్తిచేసి జూన్ 2 నాటికి లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పూర్తిస్థాయిలో అధికారులు ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, పశుసంవర్ధక అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎల్డీఎం బాపూజీ, డిప్యూటీ సీఈఓ శిరీష, మెప్మా పీడీ రేణుక, మత్స్యశాఖ అధికారి నాగయ్య, డిడబ్ల్యూఓ నరసింహారావు, డిటిడిఓ శంకర్, డిఎండబ్ల్యూఓ జగదీష్ రెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారిని దయానందరాణి, సర్వే అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంవిఐ ఆదిత్య,ఆడిట్ అధికారి శ్యామ్ సుందర్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నా పొలం నాకు ఇప్పించండి

- తహసీల్దార్‌ను వేడుకున్న మాజీ విఆర్ఓ నల్లమోతు ప్రభాకర్



**చింతకాని, మే 22 (జనం సాక్షి) :** నా పొలం నాకు ఇప్పించండి మహాప్రభు అంటూ పాతర్లపాడు గ్రామానికి చెందిన మాజీ విఆర్ఓ ప్రభుత్వ ఉద్యోగి నల్లమోతు ప్రభాకర్ చింతకాని తహసీల్దార్ ను వేడుకున్నారు. మంగళవారం మండల పరిధిలో చింతకాని గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లెవాడ రెవిన్యూ గ్రామంలో 1954 55 సంవత్సరం కాలం నాటి నుండి నేటి వరకు సర్వే నంబర్ 66 లో నా తండ్రి నల్లమోతు వెంకయ్య ద్వారా నాకు వారసత్వంగా 6 ఎకరాల 32 కుంటలు వ్యవసాయ భూమి ఉందన్నారు. మాతో పాటుగా డిటో 66 సర్వే నెంబర్ లో నెల్లూరి రంగయ్య కు 6 ఎకరాల 32 కుంటలు భూమి ఉందని, నెల్లూరు రంగయ్య అనే రైతు దగ్గర నుండి కోల్లపునేని వసంతరావు అనే వ్యక్తి 6 ఎకరాల 32 కుంటలు భూమి కొనుగోలు చేశాడు అన్నారు. వసంతరావు దగ్గర నుండి 2014- 15 సంవత్సరంలో గుగ్గిల సూర్య ప్రకాష్ 6 ఎకరాల 32 కుంటల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు అని తెలిపారు. గుగ్గిల సూర్య ప్రకాష్ కొనుగోలు చేసేంతవరకు 6 ఎకరాల 32 కుంటల భూమి అట్లాగే ఉన్నదని, 2015లో సాదా బైనమా ద్వారా గుగ్గిళ్ళ సూర్య ప్రకాష్ అనే వ్యక్తి అక్కడ భూమి అదనంగా లేకపోయినా 1ఎకరం 32 కుంటలు భూమిని పాసుబుక్ చేయించుకున్నాడని, అదనంగా ఎక్కించిన 1 ఎకరం 32 కుంటల భూమి నా 6 ఎకరాల 32 కుంటల భూమిలో అక్రమంగా ప్రవేశించి నా భూమి లో సుమారు 1 ఎకరం 32 కుంటల భూమిని దున్నుకుంటున్నాడని ఆయన ఆరోపించారు. చింతకాని తాసిల్దార్ స్పందించి ఈ యొక్క భూ సమస్యను పరిష్కరించి పహాని నకల్ గతంలో ఏ విధంగా అయితే ఎంత అయితే భూమి ఉందో అదే విధంగా ఎవరికి చెందాల్సిన ఆరు ఎకరాలు 32 కుంటల భూమిని వారికి కేటాయించి సర్వే ద్వారా అధికారులు మా భూమిని మాకు ఇప్పించాలని తమ గోడును తెలిపారు.

## పార్టీ కోసం పనిచేసే వారికే సముచిత స్థానం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మే 22 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ ధారాసింగ్, గుడిమల్కాపూర్ ఏఎంసి చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, శంషాబాద్ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, మండల పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్ రాజీవ్, సంఘటన్ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ రాష్ట్ర మహిళా నాయకురాలు అఫ్డేట్ సదాలక్ష్మి, చంద్రారెడ్డి, సులోచన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, ఏ బ్లాక్ నవీన్ బి బ్లాక్ మొహమ్మద్ కాలేదు డివిజన్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ కాజుద్దీన్ ప్రభాకర్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు చరిత్రను భావితరాలకు తెలపాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 22 (జనంసాక్షి) :** మహనీయుల త్యాగాలను చరిత్రను భావితరాలకు తెలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని దయానందరాణి వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజ మార్పు జరుగుతుందని భావించిన భాగ్యరెడ్డివర్మ వారి అభివృద్ధి కోసం మండలి ఏర్పాటు చేసి విద్యార్థుల కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ కిషన్ నాయక్, డిటిడిఓ శంకర్, డీఎంహెచ్ఓ కోటా చలం, డీడబ్ల్యూఓ నరసింహారావు, డిఎండబ్ల్యూఓ జగదీశ్వర్ రెడ్డి,మత్స్యశాఖ అదికారి నాగుల నాయక్, డివైఎస్ఓ రామచంద్ర రావు, సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి సమాజంలో చదువుకుంటేనే భవిష్యత్

- నేడు బాల బాలికల ఉన్నతికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- నందిగామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**నందిగామ, మే 22 (జనం సాక్షి) :** పాఠశాల అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ రావడం శుభపరిణామం నందిగామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈరోజు నందిగామ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అధ్యక్షతన పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు ఇతర సమస్యలపై ఉపాధ్యాయులు గ్రామ పెద్దలతో చర్చించారు. పాఠశాల ప్రాంగణంలో అంగన్వాడి, ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఒకే చోట ఉండడం వలన ఉన్నత పాఠశాల విద్యార్థులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం పాఠశాలలో టాయిలెట్స్ సరిగ్గా లేవని లైబ్రరీ ఏర్పాటు చేయాలని అదేవిధంగా క్రీడామైదానం సరిచేయాలని కోరారు ప్రాథమిక పాఠశాలను గ్రామ శివారులోని మరొక ప్రదేశానికి తరలించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నందిగామ ప్రభుత్వ పాఠశాలకు అన్ని రకాలుగా సహకరిస్తానని పూర్వ విద్యార్థులతో పాటు పార్టీలకతీతంగా గ్రామ పెద్దలు కమిటీ ఏర్పాటు చేసి అందరి సూచన మేరకు పాఠశాలను అభివృద్ధి పరుస్తామని తెలిపారు కార్యక్రమంలో నందిగామ ప్రభుత్వ పాఠశాలలో చదివిన గ్రామ పెద్దలు జిల్లెల్ల జనార్ధన్ రెడ్డి, జిల్లెల్ల రామ్ రెడ్డి, వంకాయల రామ్ రెడ్డి, జిల్లెల్ల బాల్ రెడ్డి, జిల్లెల్ల దామోదర్ రెడ్డి, కొమ్ము కృష్ణ, దారాలింగం, కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, దాసరి వెంకటయ్య, ప్రభయ్య, శ్రీకాంత్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, అంజి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపాలన అధికారి పరీక్షను సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 22 (జనం సాక్షి) :** గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 65 మంది అభ్యర్థులు హాజరవుతారని,వారికి గీతనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి నోడల్ అధికారిగా ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు ప్రశ్నాపత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్, చేతి గడియారాలు అనుమతి లేదన్నారు. పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి ఎస్కార్ట్‌తో కన్వీనర్ జేఎన్టీయూ హైద్రాబాద్‌కు పంపాలని కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్ కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు.పరీక్ష కేంద్రాలలో గోడ గడియారాలు ఏర్పాటు చేయాలని,ప్రతి అరగంటకు అభ్యర్థులకు సమయం తెలిసేందుకు మోగాలని , పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ షాపులను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపల్ శారద,సెస్ ఎండి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.




# మళ్లీ నష్టాల్లోకి సూచీలు

గురువారం ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 644.64 పాయింట్లు లేదా 0.79 శాతం నష్టంతో 80,951.99 వద్ద, నిఫ్టీ 203.75 పాయింట్లు లేదా 0.82 శాతం నష్టంతో 24,609.70 వద్ద నిలిచాయి.కాస్మో ఫస్ట్, జై భారత్ మారుతి, నహర్ పాలీ ఫిల్మ్స్, రామ్‌కో సిస్టమ్, అలికాన్ కాస్టల్లాయ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఆర్కే స్వామి, వడిలాల్ ఇండస్ట్రీస్, లింకన్ ఫార్మాస్యూటికల్స్, పారామౌంట్ కమ్యూనికేషన్స్, గీకీ వెంచర్స్ మొదలైన కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే గురువారం భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:46 సమయానికి నిఫ్టీ 225 పాయింట్లు



దిగజారి 24,587కు చేరింది. సెన్సెక్స్ 736 ప్లాయింట్లు పడిపోయి 80,813 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 99.51 పాయింట్ల వద్దకు చేరింది.

బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 64.89 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.58 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌తో పోలిస్తే నష్టాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 1.61 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 1.41 శాతం పడిపోయింది.భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై స్పష్టత కొరవడింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు నిన్నటి మార్కెట్‌లో గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు కలవరపెడుతున్నాయి. భారత్‌లో యాక్టివ్ కేసుల సంఖ్య అధికమవుతుంది. వారం రోజుల్లో 170 కి పైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు తెలపడంతో ఇన్వె స్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడుతున్నారని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## హోండా అడ్వెంచర్ స్కూటర్..

• రూ.12 లక్షలు

హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా ఎక్స్-ఎడివి మ్యాక్సీ స్కూటర్‌ను భారత్‌లో విడుదల చేసింది. దీని ధర రూ .11.90 లక్షలు (ఎక్స్-షోరూమ్).అడ్వెంచర్ మోటార్ సైకిల్‌లాగా ఉంటూ మరోవైపు స్కూటర్ లాంటి సౌకర్యం ఉండేలా ఈ మ్యాక్సీ స్కూటర్ ను రూపొందించినట్లు హోండా పేర్కొంది. ఎక్స్-ఏఏడీవీ మ్యాక్సీ స్కూటర్ కోసం హోండా బిగ్ వింగ్ డీలర్ షిప్‌లలో ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీలు జూన్ నుండి ప్రారంభించాలని కంపెనీ యోచిస్తోంది. ఇంజిన్ పవర్ ట్రయిన్: హోండా ఎక్స్-ఏడీవీ 745 సీసీ లిక్విడ్-కూల్డ్ ఎస్ఓహెచ్సి 8-వాల్వ్ పారలల్-ట్విన్ ఇంజిన్ తో వస్తుంది. ఇది 6,750 ఆర్‌పీఎం వద్ద 57 బీహెచ్‌పీ శక్తిని, 4,750 ఆర్‌పీఎం వద్ద 69 ఎన్ఎమ్ గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. డిజైన్ హార్డ్‌వేర్: అడ్వెంచర్ అప్పీల్ వచ్చేలా ఎక్స్-ఏడీవీ మొత్తం డిజైన్‌ను రూపకల్పన చేశారు. డ్యూయల్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, డీఆర్ఎల్ ఇచ్చారు. ముందు భాగంలో 17-అంగుళాల స్పోక్ వీల్, వెనుక భాగంలో 15-అంగుళాల స్పోక్ వీల్ ఉన్నాయి. సస్పెన్షన్ డ్యూటీ ముందు భాగంలో 41 ఎంఎం యూఎస్‌డీ ఫోర్కులు, వెనుక భాగంలో స్ప్రింగ్ ప్రీలోడ్ అడ్జస్టబుల్ మోనోషాక్ ఉన్నాయి. బ్రేకింగ్ సెటప్‌లో డ్యూయల్ రేడియల్ మౌంట్ ఫోర్-పిస్టన్ కాలిపర్ ముందు భాగంలో 296 మిమీ డిస్క్, వెనుక భాగంలో 240 మిమీ డిస్క్‌తో సింగిల్-పిస్టన్ కాలిపర్ ఉన్నాయి.ఫీచర్లు: హోండా ఎక్స్-ఏడీవీలో యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, 5-అంగుళాల ఫుల్-కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే వంటి ఫీచర్లు ఉన్నాయి. అలాగే, కాల్స్, ఎస్ఎంఎస్ అలర్ట్స్, టర్న్-బై-టర్న్ నావిగేషన్ , మ్యూజిక్, వాయిస్ కమాండ్ కంట్రోల్ వంటి ఫీచర్లున్న హోండా రోడ్ సింక్ యాప్‌ను ఈ స్కూటర్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. ఇక స్టాండర్డ్, స్పోర్ట్, రెయిన్, గ్రావెల్ అనే నాలుగు డిఫాల్ట్ రైడింగ్ మోడ్‌లు ఇందులో ఉన్నాయి.

## ఇండిగో లాభం 'హై'జంప్

న్యూఢిల్లీ: దేశీ విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 62 శాతం దూసుకెళ్లి రూ. 3,067 కోట్లను అధిగమించింది. ఇది క్యూ4లో కంపెనీ సాధించిన రికార్డ్ లాభంకాగా.. ఇందుకు విమాన ప్రయాణికులు పెరగడం సహకరించింది.అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,895 కోట్లు ఆర్జించింది. ఇండిగో బ్రాండ్ విమాన సర్వీసుల కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 18,505 కోట్ల నుంచి రూ. 23,098 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఇండిగో నికర లాభం రూ. 7,258 కోట్లను అధిగమించింది. విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే దాదాపు రూ. 8,868 కోట్ల లాభం ఆర్జించింది. గతేడాది 11.8 కోట్లమంది ప్రయాణికులను గమ్యాలకు చేరవేసినట్లు సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు.కాగా.. క్యూ4లో ఇండిగో ప్రయాణికుల టికెట్ ఆదాయం 25% జంప్‌చేసి రూ. 19,567 కోట్లను దాటింది. అనుబంధ విభాగాల ఆదాయం 25 శాతం అధికమై రూ. 2,153 కోట్లకు చేరింది.




## టీసీఎస్‌కు రూ. 2,903 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తాజాగా ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ నుంచి రూ. 2,903 కోట్ల యాడ్-ఆన్ అడ్వాన్స్ పర్చేజ్ ఆర్డరు (ఏపీవో) దక్కించుకుంది.దీని ప్రకారం బీఎస్ఎన్ఎల్‌కు 18,685 సైట్లలో 4జీ మొబైల్ నెట్‌వర్క్ ప్లానింగ్, ఇంజినీరింగ్, సరఫరా, ఇన్‌స్టాలింగ్, టెస్టింగ్, వార్షిక మెయింటెనెన్స్ మొదలైన సర్వీసులను టీసీఎస్ అందించాల్సి ఉంటుంది. ఏపీవోలో పేర్కొన్న నిర్దిష్ట నిబంధనలకు లోబడి సవివర పర్చేజ్ ఆర్డర్లను (పీవో) బీఎస్ఎన్ఎల్ జారీ చేస్తుందని కంపెనీ తెలిపింది. ఈ కాంట్రాక్టుకు సంబంధించి తాము టీసీఎస్‌కు సరఫరా చేసే రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్), ఇతరత్రా పరికరాల విలువ సుమారు రూ. 1,526 కోట్లుగా ఉంటుందని తేజాస్ నెట్‌వర్క్స్ పేర్కొంది. నిర్దిష్ట షరతులకు లోబడి టీసీఎస్ సవివర పీవోలను జారీ చేస్తుందని వివరించింది.

## అవకతవకల ఎఫెక్ట్!

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు నష్టాలు..





ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో లాభాలనువీడి నష్టాలలోకి ప్రవేశించింది. రూ. 2,329 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఖాతాల అవకతవకలతో ప్రొవిజన్లు పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది. 2023-24 ఇదే కాలంలో రూ. 2,349 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందుకు కొంతమంది ఉద్యోగుల పాత్రపై అనుమానాలతో బ్యాంక్ బోర్డు దర్యాప్తు ఏజెన్సీలు, నియంత్రణ సంస్థలకు ఖాతాల మోసాలపై నివేదించమని బ్యాంక్‌ను ఆదేశించింది.ఖాతాల లోపాలు, మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలో మోసం, బ్యాలెన్స్‌షీట్‌లో పొరపాటు అంశాలతో బ్యాంక్ సవాళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అంతర్గత ఆడిట్‌కు ఆదేశించడం తెలిసిందే. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఇండస్‌ఇండ్ నికర లాభం 71% పడిపోయి రూ. 2,576 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 8,977 కోట్ల లాభం సాధించింది. ప్రొవిజన్లు రూ. 3,885 కోట్ల నుంచి రూ. 7,136 కోట్లకు పెరిగాయి.క్యూ4లో ఇండస్‌ఇండ్ బ్యాంక్ రూ. 2,522 కోట్లమేర ప్రొవిజనింగ్ చేపట్టింది. అంతక్రితం క్యూ4లో ఈ పద్దు రూ. 950 కోట్లు మాత్రమే. 2023-24 క్యూ4లో రూ. 12,199 కోట్ల వడ్డీ ఆదాయం అందుకుంది. డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ. 1,979 కోట్లమేర ఖాతాలలో లోపం, మైక్రోఫైనాన్స్ బిజినెస్‌లో రూ. 674 కోట్ల వడ్డీ తప్పుగా నమోదు చేసినట్లు అంతర్గత ఆడిట్‌లో గుర్తించడం, బ్యాలెన్స్‌షీట్‌లో రూ. 595 కోట్ల ఇతర ఆస్తుల అక్రమ పద్దు తదితరాలను బ్యాంక్ మార్చిలో వెల్లడించింది.ఏప్రిల్ 29న సీఈవో సుమంత్ కథ్పాలియా, డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా రాజీనామా చేశారు. దీంతో బ్యాంక్ బోర్డు కార్యకలాపాల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ ఏర్పాటు చేసింది. 2025 జూన్30లోగా కొత్త సీఈవో ఎంపికకు వీలుగా ప్రతిపాదనలు పంపమని బ్యాంక్‌ను ఆర్‌బీఐ ఆదేశించినట్లు ఇండస్‌ఇండ్ వెల్లడించింది. ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 1.4% క్షీణించి రూ. 771 వద్ద ముగిసింది.

## 1.43 కోట్ల మంది విమానమెక్కారు

భారీగా పెరుగుతున్న ఫ్లైట్ జర్నీ..

న్యూఢిల్లీ: దేశీయంగా ఏప్రిల్‌లో 1.43 కోట్ల మంది విమాన ప్రయాణాలు చేశారు. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 1.32 కోట్లతో పోలిస్తే ప్రయాణికుల సంఖ్య 8.45 శాతం పెరిగింది.మార్కెట్ వాటాపరంగా చూస్తే 64.1 శాతంతో ఇండిగో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత స్థానాల్లో ఎయిరిండియా గ్రూప్ (27.2 శాతం), ఆకాశ ఎయిర్ (5 శాతం), స్పైస్‌జెట్ (2.6 శాతం) ఉన్నాయి. 2025 జనవరి-ఏప్రిల్ మధ్యకాలం లో దేశీ విమానయాన సంస్థలు 5.75 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్లు డీజీసీఏ నెలవారీ రిపోర్టులో వెల్లడించింది. వార్షికంగా చూస్తే ఈ సంఖ్య 9.87 శాతం, నెలవారీగా చూస్తే 8.45 శాతం పెరిగినట్లు వివరించింది.సమయ పాలనపరంగా (ఓటీపీ) చూస్తే 80.8 శాతంతో ఇండిగో అగ్రస్థానంలో ఉంది. 77.5 శాతం ఓటీపీతో ఆకాశ ఎయిర్, 72.4 శాతంతో ఎయి రిండియా గ్రూప్ .. ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. స్పైస్‌జెట్ సమయ పాలన అత్యంత కనిష్ట స్థాయిలో 60 శాతంగా నమోదైంది.






## పంటి నొప్పితో వెళ్తే.. ప్రాణమే పోయింది

ఓ మహిళ ప్రాణం తీసిన ఆర్ఎంపీ వైద్యుడు

నంద్యాల జిల్లా: పంటి నొప్పితో వెళితే ఓ వైద్యుడు ప్రాణం తీశాడు. సంజామల మండల కేంద్రంలో ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకంతో మహిళ మృతి చెందింది. సంజామల మండలం చిన్న కొత్తపేట గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మి (52) రెండు రోజులుగా పంటి నొప్పి ఉండటంతో ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లింది.ఇంజెక్షన్ నరానికి ఇవ్వగా ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.దీంతో 108 ద్వారా కోవెలకుంట్ల ఆసుపత్రికి ఆర్ఎంపీ వైద్యుడు తరలించగా, అప్పటికే ఆ మహిళ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ వైద్యుడు పరారిలో ఉన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.

## ఈడీ హద్దులు దాటుతోంది

ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతకవలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. దీనిపై తమిళనాడు సర్కారు హైకోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఈడీ సోదాలు జరుపుతోందని, విచారణ పేరిట టాస్మాక్ అధికారులను హింసిస్తోందని ఆరోపించింది. ఈ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేస్తూ.. ఈడీ దర్యాప్తునకు అంగీకరించింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈడీ తీరును తప్పుబట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. ఈ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ దర్యాప్తు సంస్థకు నోటీసులు జారీ చేసింది.సుప్రీం ఉత్తర్వులపై డీఎంకే హర్షం వ్యక్తంచేసింది. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు భాజపా చేస్తున్న కుట్రలకు ఇది చెంపపెట్టు లాంటిదని దుయ్యబట్టింది. ఆ పార్టీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, భాజపాయేతర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఆరోపించారు.

## కొంపముంచిన ట్రాన్స్‌ప్లాంటేషన్

తన బాధ ఇంకొకరికి రావొద్దని వ్యక్తి ఆవేదన



**జనంసాక్షి:** హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో లుక్ మార్చుకోవాలనుకుని ప్రాణాలు పోగొట్టుకున్నారు కొందరు. అనుభవజ్ఞులైన నిపుణుల సమక్షంలో చేయించకోకపోతే జీవితాలే అల్లకల్లోలమవుతాయనే ఉదంతాలు ఎన్నో జరిగాయి.అందులోనూ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్.. ఏదైనా తేడాకొడితే..నేరుగా మన బ్రెయిన్‌పై ఎఫెక్ట్ పడుతుంది. కోలుకుంటామా లేదా అనేది చెప్పడం కూడా కష్టమే. అలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నాడు కేరళలోని ఎర్నాకుళంకి చెందిన సనీల్. అందంగా ఉండాలని చేయించుకున్న హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అతడి జీవితాన్ని ఎంతలా నరకప్రాయంగా చేసిందో వింటే..నోటమాట రాదు. ఇంత పమాదరకరమైనదా.. ?హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనిపిస్తుంది.49 ఏళ్ల సనీల్ తన లుక్ అందంగా మార్చుకోవాలనుకుని కొచ్చిలోని పనంపిల్లి నగర్‌లోని ఇన్‌సైట్ డెర్మా క్లినిక్‌ని సంప్రదించాడు. ఆ ఆస్పత్రి గురించి పూర్తిగా తెలుసుకునే యత్నం చేయకుండానే కేవలం ప్రకటనల ఆధారంగా సంప్రదించాడు. అయితే అక్కడ వైద్యులు అతడిని పరిశీలించి హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ఎప్పుడు చేయాలో నిర్ణయిస్తామని చెప్పారు. అలా అతడికి సదరు ఆస్పత్రి వైద్యులు చేద్దాం అనుకున్నా..నాలుగుసార్లు అనుకోని అవాంతరాలతో వాయిదా పడింది.అప్పుడైనా ఇలా ఎందుకు జరగుతుందని ఆలోచించినా బావుండేదేమో అంటున్నాడు సనీల్ బాధగా. చివరికి ఫిబ్రవరి 2025లో ఒకరోజు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి సమయాత్తమయ్యాడు. రెండు రోజుల అనంతరం డిశ్చార్జ్ అయినా తర్వాత నుంచి ఇన్ఫెక్షన్‌ల బారినపడ్డాడు. మార్చి 1 నాటికి, అతడి పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. తలపై పసుపు రంగుమచ్చలు, ?ఒక విధమైన స్రావాలు కారడం మొదలైంది. అయితే సదరు క్లినిక్ ఇవన్నీ సాధారణ సమస్యలే అని, ఆస్పత్రికి రావాల్సిందిగా తెలిపారు సనీల్‌కి.దీంతో ఆస్పత్రికి వచ్చినా..పరిస్థితి మెరుగుపడలేదు కదా..మరింతగా పరిస్థితి దిగజారిపోయింది. నొప్పి తగ్గించే స్టెరాయిడ్లు, యాంటీబయోటి?క్ మందులు ఇచ్చారు. దాంతో సనీల్ శరీరంలో బీపీ, చక్కెరస్థాయిలు ప్రమాదకర స్థాయిలో అమాంతం పెరిగిపోయాయి. ఇక ఈ నరకయాతన భరించలేక అక్కడే సమీపంలో ఉన్న సనీల్ లౌర్డ్స్ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ నవ్య మేరీ కురియన్ వెంటనే అతన్ని ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ చాకో సిరియాక్ వద్దకు పంపారు.అక్కడ ఆయన సనీల్ పరిస్థితిని చూసి..మాంసం తినే ప్రాణాంతక బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ బారినపడ్డట్లు నిర్ధారించారు. తక్షణమే సనీల్‌ని సర్జరీకి సిద్ధం కావాలని చెప్పారు. అలా సనీల్ ఇప్పటివరకు పదమూడు సర్జరీలకు పైగా చేయించుకున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం ఈ ఇన్ఫెక్షన్‌ని నెక్రోటైజింగ్ ఫాసిటిస్ ఇన్ఫెక్షన్ అని అంటారు. దీనికి శక్తిమంతమైన యాంటీబయాటిక్స్, అత్యవసర శస్త్ర చికిత్స వంటి వాటితో పోరాడటమే ఏకైక మార్గం.ఈ ఇన్ఫెక్షన్ ఎముక కనిపించేంత వరకు కణజాలాన్ని తినేస్తుందట. తన తలలో ఒక రంధ్ర ఏర్పడిందని.. ప్రస్తుతం తనకు ఇంకా చికిత్స కొనసాగుతుందని అన్నారు. అంతేగాదు ఆ ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతమంతా..ఒక విధమైన స్రావాలు కారడంతో వాక్యూమ్-అసిస్టెడ్ ఆ ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతమంతా..ఒక విధమైన స్రావాలు కారడంతో వాక్యూమ్-అసిస్టెడ్ డ్రైనేజ్ పంప్‌ను అమర్చారు. ఆయన ఎక్కడకు వెళ్లినా.. దాన్ని కూడా తీసుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.తాను ఆర్థికంగా, మానసికంగా వేదనకు గురయ్యేలా చేసిన సదరు క్లినిక్‌పై ఫిర్యాదు చేయడమే గాక మూతపడేలా చేశాడు. అలాగే అందుకు బాధ్యులైన సదరు వైద్యులకు శిక్ష పడేదాక వదలనని, తనలా మరెవరూ ఇలాంటి బాధను అనుభవించకూడదని కన్నీటి పర్యంతమయ్యాడు సనీల్. అతడిగాథ వింటే..అందానికి సంబంధించిన శస్త్రచికిత్సల విషయంలో ఎంత జాగురకతతో వ్యవహరించాలో చెప్పడమే గాక మనోగత అందానికే ప్రాధాన్యం ఇవ్వాలనే విషయం చెప్పకనే చెబుతోంది.

## గూగుల్, ఏఐలపై కోర్టు మెట్లెక్కిన తల్లి

• తన కొడుకు చావుకు కారణమని కేసు





టెక్నాలజీ వల్ల లాభాలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. అప్పుడప్పుడు నష్టాలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆల్ఫాబెట్‌కు చెందిన గూగుల్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ అయిన క్యారెక్టర్.ఏఐ తన కొడుకు ఆత్మహత్యకు కారణమైందని ఓ తల్లి కోర్టు మెట్లెక్కింది.అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతానికి చెందిన మెగన్ గార్సియా.. తన 14 ఏళ్ల కొడుకు 'సెవెల్ సెట్జర్' ఫిబ్రవరిలో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఏఐ చాట్‌బాట్‌తో చాటింగ్ చేసినట్లు పేర్కొంది. పిల్లల మానసిక బాధ లేదా ప్రవర్తన నుంచి బయట పడేయడంలో ఏఐ విఫలమైందని ఆ మహిళ ఆరోపించింది.ఏఐ చాట్‌బాట్ పట్ల ఒక యువకుడు ఎంతగానో మక్కువ పెంచుకున్నాడనే దానివల్ల అతను ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే చాట్‌బాట్‌ల అవుట్‌పుట్ రాజ్యాంగబద్ధంగా ఉన్న స్వేచ్ఛా వాక్ స్వాతంత్ర్యాన్ని కలిగి ఉన్నందున కేసును కొట్టివేయాలని గూగుల్, ఏఐ సంస్థ విజ్ఞప్తి చేశాయి. అయితే దీనిపై యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి అన్నే కాన్వే ఏకీభవించలేదు. అంతే కాకుండా కంపెనీ తప్పకుండా జవాబుదారీ తనంతో ఉండాలని పేర్కొన్నారు.ఏఐ చాట్‌బాట్ ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తుంది. అయితే అడిగే ప్రశ్న మంచిదా?, ప్రమాదాన్ని కలిగిస్తుందా? అనే విషయం ఏఐ గుర్తించడం లేదు. ఒక వ్యక్తి ఎలా చనిపోవాలి అని అడిగితే.. దానికి కూడా తనదైన రీతిలో సమాధానం చెబుతుంది. మానసిక బాధతో ఉన్న వ్యక్తులు ఏఐను ఒక ఫ్రెండ్ లేదా అంతకంటే ఎక్కువే అనుకుంటారు. అలాంటి సమయంలో ఏఐ ఇచ్చే సలహాలు ప్రమాదానికి కారణమవుతున్నాయి. కాబట్టి ప్రశ్న ఎలాంటిదో.. ముందు ఏఐ దానిని తప్పకుండా గమనించేలా కంపెనీలు కూడా సవరణలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## అచ్యుతాపురం కేంద్రంగా భారీ సైబర్ డెన్ గుట్టురట్టు

అనకాపల్లి జిల్లా: అచ్యుతాపురం కేంద్రంగా భారీ సైబర్ డెన్ గుట్టురట్టరయ్యింది. అచ్యుతాపురం శివారులో ఫేక్ కాల్ సెంటర్ ముసుగులో ఈ సైబర్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.44 ఫ్లాట్స్ అద్దెకు తీసుకుని.. గత రెండేళ్ల నుండి సైబర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. నెలకి రూ.15 నుంచి 20 కోట్ల టర్నోవర్ జరుగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.అమెరికా పౌరులే లక్ష్యంగా కాల్ సెంటర్ ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 33 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబై, రాజస్థానకు చెందిన ఇద్దరు ప్రధాన మేనేజర్లు నడిపిస్తున్నారు. మేఘాలయ, సిక్కిం, అస్సాం, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు ఇందులో పనిచేస్తున్నారు. అమెరికా పౌరులతో ఎలా మాట్లాడాలో రెండు వారాలు ట్రైనింగ్ ఇస్తున్నారు. అమెజాన్ ఈ మార్కెట్ పేరుతో సైబర్ కాల్స్, వాల్నట్, సూపర్ మార్కెట్ గిఫ్ట్ కూపన్ లా పేరుతో నాలుగు దశల్లో ట్రాప్ చేస్తున్నారు.3 వందల డాలర్ల నుంచి 3,000 డాలర్ల వరకు కూపన్లు ఒక్కొక్కరికి అమ్ముతున్నారు. ఇందులో 200 నుండి 250 మంది కాల్ సెంటర్‌లో పని చేస్తున్నారు. మొదట వీరందరికీ ఉద్యోగాల పేరుతో ఎరవేస్తున్నారు. అపార్ట్‌మెంట్లకు 18 లక్షల రూపాయలు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. పోలీసులు.. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.




## మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా

కన్నడిగుల ఆగ్రహం

నటి తమన్నా భాటియాను ప్రభుత్వ రంగ సంస్థ కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే ఐకానిక్ మైసూర్ శాండల్ సబ్బుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది.అయితే, ఈ ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. కర్ణాటక బ్రాండ్‌గా ఉన్న మైసూర్ శాండల్ సబ్బుకు ప్రాతినిధ్యం వహించడానికి స్థానిక నటుడిని ఎందుకు ఎంపిక చేయలేదని కన్నడిగులు ప్రశ్నించారు.ఈ వ్యతిరేకతను ప్రస్తావిస్తూ.. కర్ణాటక భారీ, మధ్య తరహా పరిశ్రమల మంత్రి ఎం.బి. పాటిల్ రియాక్ట్ అయ్యారు. ప్రస్తుత మార్కెట్‌లో పలు వ్యూహాత్మక కారణాలు ఉన్నాయంటూ.. ఈ నిర్ణయాన్ని సమర్థించారు. కన్నడ చిత్ర పరిశ్రమపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. కానీ, కెఎస్‌డిఎల్ సంస్థ కర్ణాటకను దాటి తన ఉనికిని దేశవ్యాప్తంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందుకే తాము పాన్-ఇండియా సెలబ్రిటీని ప్రచారకర్తగా ఎంపిక చేశామన్నారు. మైసూర్ శాండల్ సబ్బుకు బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నాను ఎంచుకోవడం వెనుక నాలుగు ముఖ్య కారణాలను మంత్రి వివరించారు. పాన్-ఇండియా రేంజ్‌లో గుర్తింపు: తమన్నా ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ చిత్రాలలో నటించారు. జాతీయ స్థాయి మార్కెట్‌లో ఆమెకు గుర్తింపు ఉంది. అలాంటి వ్యక్తి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటే మరింతగా విస్తరించవచ్చు. ప్రొఫెషనల్ బ్రాండింగ్ అనుభవం: తమన్నాకు హై-ప్రొఫైల్ బ్యూటీ, స్కిన్‌కేర్ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. ఆమెకు ఈ విషయంలో అనుభవం ఉంది. ఆమె ద్వారా సులువుగా దక్షిణాది రాష్ట్రాలకు వ్యాప్తి చెందొచ్చు. తమన్నా ఎంపికను మార్కెటింగ్ నిపుణుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ద్వారా మాత్రమే తీసుకున్నారు. అందుకు డైరెక్టర్ల బోర్డు కూడా ఆమోదించింది. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ తయారు చేస్తున్న మైసూరు శాండల్ సబ్బులతో పాటు ఇతర ఉత్పత్తులకు తమ న్నా బ్రాండ్ అంబాసిడర్‌గా అధికారికంగా నియమించబడ్డారు. ఈ ఒప్పందం రెండేళ్ల పాటు ఉంటుంది. ఇందుకోసం ఆమెకు రూ. 6.2 కోట్ల భారీ మొత్తం కర్ణాటక చెల్లించనున్నట్లు సమాచారం.కర్ణాటకకు గుర్తింపుగా ఉన్న మైసూరు శాండల్ సోప్‌కు ఒక కన్నడ స్టార్‌ను ఎంపికి చేసుంటే బాగుండేదని విమర్శలు వస్తున్నాయి.

# పేదల ఆత్మ గౌరవం సొంతింటి కల సాకారం





- నెల లోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి
- ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 22 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో రెండో విడత క్రింద 484 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని నిరు పేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదన్నారు. రాబోయే 4 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనం ప్రాంతంలో వేయి కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. గతంలో పాలకులు వేములవాడ ఆలయానికి రూ 100 కోట్లు విడుదల చేస్తామని మోసం చేశారని, నేడు ప్రజా ప్రభుత్వంలో వేములవాడ ఆలయ అభివృద్ధి చేస్తున్నామన్నారు. వర్షా కాలం ముగిసిన తర్వాత 3 వ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు.
గుడి చెరువులో మురుగు నీరు కల్వకుండా రూ. 9 కోట్ల ఖర్చు చేసి నివారణ చర్యలు చేపట్టామన్నారు.మూల వాగు శుభ్రం చేస్తున్నామన్నారు. వేములవాడ ఆలయ విస్తరణకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని, ఆలయం మూసివేస్తామని అపోహలు సృష్టిస్తున్నారని, భక్తులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి నిత్యం స్వామివారికి నిత్యకృత్యం కైకంకర్యాలు జరుగుతాయన్నారు.గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ 10 లక్షలకు పెంపు,మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ,సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు రూ 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు.400 నుండి 600 చదరపు అడుగుల లోపు ఇంటి ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా రూ 5 లక్షల సహాయం అందుతుందన్నారు. బేస్మెంట్ దశలో రూ 1లక్ష, గోడల దశలో రూ 1లక్ష, స్లాబ్ దశలో రూ 2 లక్షలు ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఇంటి జాగా లేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇండ్లు తప్పకుండా ఇస్తామని,ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయంలో మాత్రమేనని, గత 10 సంవత్సరాల కాలంలో అసైన్మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతి లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామన్నారు.
రాజీవ్ యువ వికాసం క్రింద 4 వేల మంది యువతకు త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు సబ్సిడీ విడుదల చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి స్థాయి సహకారం అందిస్తామని, ప్రభుత్వం తరపున ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు.
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ భూమి లేని నిరు పేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి చేసి అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే తో కలిసి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం రాబోయే రోజుల్లో భూమి లేని నిరు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ చర్యలు తీసుకుంటుందన్నారు.వేములవాడ పట్టణ పరిధిలో పంపిణీ చేసిన 484 ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇంటి నిర్మాణ పనులు 30 రోజుల లోగా ప్రారంభించాలన్నారు.ఇంటి నిర్మాణంలో పేదలకు పూర్తి సహకారం అందిస్తామని, పెట్టుబడి లేని పేదలకు లక్ష రూపాయలు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ రాకేష్, సెస్ డైరెక్టర్ నామాల ఉమా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయాలి



- హుస్నాబాద్ నియోజకవర్గ గౌరవం పెంచుతా
- దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు
- కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, మే 22(జనం సాక్షి)
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని,రాబోయే ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ గ్రామగ్రామాన పునవ్యవస్థీకరిస్తూ మండల సమావేశాలు జరుగుతున్నట్లు చెప్పారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి మరింత కష్టపడాలని, మంత్రిగా తాను తన అసెంబ్లీ ఎన్నికల కన్నా మరింత ఎక్కువ కష్టపడతానని, ఏమైనా గ్రూపు రాజకీయాలు ఉంటే వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా అన్ని స్థానాల్లో గెలిచేలా ముందుకు వెళ్లాలని చెప్పారు. గ్రామస్థాయిలో కార్యకర్తల్లో నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు మూడు సంవత్సరాల పైన పనిచేసిన వారికి ప్రమోషన్ వస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ,జడ్పిటిసి అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, అందుకు పార్టీ కార్యకర్తలు,నాయకులు సైనికుల్లా పని చేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రజాపాలన ప్రభుత్వంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, అధికారంలోకి వచ్చిన 48గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్, 5వందలకే గ్యాస్,2లక్షల రూపాయల రుణమాఫీ, సన్న బియ్యం పంపిణీ,సన్న వడ్లకు 500బోనస్,ఆరోగ్యశ్రీ 10లక్షల వరకు చికిత్స,60వేల ఉద్యోగాలు భర్తీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.ఇందిరమ్మ ఇండ్లను ఎంపికను పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇల్లు రాని వారు అధైర్య పడవద్దని రెండవ విడుతలో అర్హులందరికీ వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యం అమ్ముకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు సన్న బియ్యం అడిగి మరీ తీసుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సమస్య లేకుండా అనుచరులు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అంటే ఎక్కడికి వెళ్లిన మరింత గౌరవం పెరిగేలా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తూ సమర్థవంతంగా పనిచేస్తున్నానని, మరింత బలం చేకూరాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు.గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా గ్రామశాఖ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. మండల,గ్రామ,బ్లాక్ అధ్యక్షులకు దరఖాస్తులను కార్యకర్తలు దగ్గర నుండి పీసీసీ పరిశీలకులు రఘునాథ్ రెడ్డి, నమిలా శ్రీనివాస్‌లు తీసుకున్నారు. ఈనెల 25వరకు కార్యకర్తల నుండి దరఖాస్తులను స్వీకరిస్తామని ఆసక్తి గల కార్యకర్తలు, నాయకులు 25లోపు తమకు అందజేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,జిల్లా నాయకులు చిట్టుమల్ల రవీందర్,ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి,డైరెక్టర్లు ఖుతుబుద్దీన్, కూతురు రవీందర్ రెడ్డి, భారతి దేవి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అందేమేకల పరశురాములు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కాంతాల మహిపాల్ రెడ్డి, మహిళ మండల అధ్యక్షురాలు పోలు స్వప్న,నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్ నేత, వంగర మల్లేశం,కాటం సంపత్ రెడ్డి, మహమ్మద్ బాబు మియా,అందే సురేష్, జిల్లెల రమేష్,బోయిని నరేష్, పలు గ్రామశాఖల అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లేఖలు రాసి దులుపుకోవడం కాదు... బుల్లెట్ దిగిందా? లేదా?





- ఎవరి హయాంలో రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయో చూడండి
- ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్
- ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా కరీంనగర్ సహా 103 రైల్వే స్టేషన్ల ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొన్నం, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి

**కరీంనగర్, మే 22 (జనంసాక్షి):** గతంలో బీఆర్ఎస్‌తో సహా కొంతమంది నాయకులు లేఖలు రాసి చేతులు దులుపుకునేవారని, ఇప్పుడు అభివృద్ధి జరుగుతుంటే తమ వల్లే అని ప్రచారం చేసుకుంటున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. "మాటలు కాదు... బుల్లెట్ దిగిందా? లేదా? చూడండి" అని ఆయన సవాల్ విసిరారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ ఎవరి హయాంలో జరిగిందో స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చి ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు 61 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణాని కి సర్వే పూర్తి చేసి, రూ.1480 కోట్లతో డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేశామని, త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందని సంజయ్ తెలిపారు. కరీంనగర్–తిరుపతి రైలు ప్రతిరోజూ నడిపేందుకు తానూ, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశామని, కానీ రద్దీ, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదని వివరించారు. ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం దేశవ్యాప్తంగా 103 రైల్వే స్టేషన్లను ఆధునీకరణ పనుల అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "అమృత్ భారత్ పథకం కింద రూ.25 వేల కోట్లతో 1350 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. ఇందులో రూ.2 వేల కోట్లతో 103 స్టేషన్లను ప్రారంభించడం ఆనందంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ హయాంలో లేఖలు రాసి సరిపెట్టుకునేవారు, కానీ ఇప్పుడు కరీంనగర్ స్టేషన్‌లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. రైల్వే, రోడ్లు, ఏవియేషన్ రంగాల అభివృద్ధితోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ప్రధాని మోదీ ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గత 11 ఏళ్లలో తెలంగాణలో 20కి పైగా రైల్వే ప్రాజెక్టులకు రూ.42,119 కోట్లు కేటాయిం చాం. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.5,337 కోట్లు రైల్వే ప్రాజెక్టులకు కేటాయించామని" తెలిపారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను రూ.27 కోట్లతో ఆధునీకరించి, ఎయిర్‌పోర్టును తలపించేలా మార్చామని సంజయ్ వివరించా రు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ఏసీ, నాన్–ఏసీ వెయిటింగ్ హాళ్లు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, టాయిలెట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, సోలార్ పవర్ ప్లాంట్, రోడ్ల అభివృద్ధి, ప్లాట్‌ఫారం షెల్టర్లు వంటి సౌకర్యాలతో స్టేషన్ రూపురేఖలు మారాయని, రాత్రిపూట ఇంకా అద్భుతంగా కనిపిస్తోంద ని, ప్రజలు సెల్ఫీలు తీసుకుంటున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల స్వేచ్ఛ హరిస్తే ఊరుకోం!

- బెదిరింపు చర్యలకు దిగితే సహించం
- జర్నలిస్టులకు అండగా టీడబ్ల్యూజేఎఫ్
- ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు,
- ఆర్మీ వీరులకు సంతాపం



**కూసుమంచి (జనంసాక్షి) :** జర్నలిస్టుల స్వేచ్ఛ హరిస్తే ఊరుకోమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్,హెచ్చరించారు.. జర్నలిస్టులపై బెదిరింపు చర్యలకు పాల్పడితే సహించమన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ అండగా ఉంటుందన్నారు. కూసుమంచిలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు సభలో వారు మాట్లాడారు. ఏ జర్నలిస్టు ఏ యూనియన్ లో ఉండాలి అనేది వారి వ్యక్తిగత అంశమని, జర్నలిస్టుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా కొన్ని యూనియన్లు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి యూనియన్లకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదిరిస్తూ.. బెదిరిస్తూ ఎంతో కాలం జర్నలిస్టులను చెప్పుచేతల్లో ఉంచుకోలేమన్నారు. జర్నలిస్ట్ సోదరులు ఫెడరేషన్ లో సభ్యత్వం పొందేందుకు వస్తున్న క్రమంలో ఆయా జర్నలిస్ట్ సంఘాల నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు తమ సంఘం వైపు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో వక్రమార్గంలో నియంత్రించే చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారనే కారణంతో ఏ ఒక్క జర్నలిస్ట్ నైనా విధుల నుంచి తొలగిస్తే... అవసరమైతే యాజమాన్యాలతో మాట్లాడి వారికి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాల్సిన యూనియన్లు ఇలాంటి కుట్రపూరిత వైఖరితో జర్నలిస్టులను నియంత్రించడం ఇకమీదట సాగనీయమని అన్నారు. త్వరలో తన సంఘం జిల్లా మహాసభ అంగరంగ వైభవంగా జరగనుందన్నారు. ఆయా పత్రిక, చానళ్లలలో తమ జిల్లా ప్రతినిధుల ఒత్తిడిలతోనే తమ హక్కులు కాలరాయబడుతున్నాయని వస్తున్న ప్రచార మాధ్యమాల సమాచారాలు తమను విస్మయానికి గురి చేశాయని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు, ఆర్మీ వీరులకు, అమరవీరులకు సమావేశం సంతాపం ప్రకటించింది. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నాయకులు కూరాకుల గోపి, యెగినాటి మాధవరావు, మానుకొండ రవికిరణ్, కొత్త యాకేశ్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ కే జానీపాష, కె. వెంకటేశ్వరరావు,పెంద్ర అంజయ్య, యాస లక్ష్మారెడ్డి, నాగిరెడ్డి, కొల్లి హరీష్, గోవింద రెడ్డి, కర్ణబాబు, వీ6 కర్ణ, తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యాన్ని త్వరగా తూకుం వేసి మిల్లులకు తరలించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22 (జనం సాక్షి):** అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యాన్ని త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామంలో ఐ.కే.పి. ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ఆకాల వర్షాలు కురియడం వలన ధాన్యం తడిసి పోయే పరిస్థితులు ఉన్నాయని, రైతులకు టార్పాలిన్‌లు అందజేయాలని తెలిపారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా లారీల్లో సంబంధిత మిల్లులకు తరలించాలని తెలిపారు. ఈ నెల చివరి నాటికి మొత్తం ధాన్యాన్ని కొను గోలు చేయాలని కేంద్రం ఇంచార్జీ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీ ణాభివృద్ధి అధికారి సురేందర్, తహసీల్దార్ గంగా సాగర్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, మహిళా సంఘం సభ్యురాలు పాల్గొన్నారు.



# పదోన్నతులతో పోలీసులకు మరింత బాధ్యత

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22 (జనం సాక్షి)**
పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయని, నిజాయితీగా ప్రజలకు సేవలు అందించాలి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర. ఏఎస్సై నుండి ఎస్సైలుగా పదోన్నతి పొందిన 11 పోలీసులను అభినందించి పదోన్నతి చిహ్నాన్ని ఎస్పీ అలంకరించారు.పోలీసు వ్యవస్థలో నిరంతరంగా సేవలందించి గురువారం పదోన్నతి పొందుతున్న రామారెడ్డి పోలీస్టేషన్ ఏఎస్సై యన్. లచ్చీరామ్,, ఎల్లారెడ్డి పోలీస్టేషన్ ఏఎస్సై, ఎండి,సిద్దికె, భిక్నూర్ పోలీస్టేషన్ ఏఎస్సై, ఏ. మల్లారెడ్డి, పెద్దకొడపగల్ పోలీస్టేషన్ ఏఎస్సై, రాములు, మాచారెడ్డి పోలీస్టేషన్ ఏఎస్సై, బి. నార్సింలు, గాంధారి పోలీస్టేషన్ ఏఎస్సై, పి. గణేష్, పిట్లం పోలీస్టేషన్ ఏఎస్సై, యల్. లింబాద్రి , నాగిరెడ్డిపేట్ పోలీస్టేషన్ ఏఎస్సై, ఉమేష్, దోమకొండ పోలీస్టేషన్ ఏఎస్సై, సుబ్రమణ్య చారి, తాడ్వాయి పోలీస్టేషన్ ఏఎస్సై, సంజీవ్, హన్మగౌడ్ ఇంటలిజెన్స్ లో ప్రస్తుతం లు ఎస్సైలుగా, పదోన్నతి పొందిన పోలీసులు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. పదోన్నతి పోలీసులకు ఎస్పీ పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ. పోలీసుశాఖలో పదోన్నత్తులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు.పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని ఆయన తెలియజేశారు.ఈ కార్యాక్రమంలో డిఎస్పీలు మదన్ లాల్, యాకుబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్య, రిజర్వు ఇన్స్ పెక్టర్లు సంతోష్ కుమార్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి





- పిఎంజేజేబీవై ద్వారా పేదలకు 2 లక్షల జీవిత బీమా
- మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి
- హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు
- బ్యాంకర్లతో డీసీసీ డీ.ఎల్.ఆర్.సి సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, మే 22 (జనంసాక్షి):**
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి కల్పన మరియు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పి.ఎం.ఈ.జి.పి), పేదలకు జీవిత బీమా కల్పించేందుకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన (పి.ఎం.జే.జే.బీ.వై), మరియు ప్రమాద బీమా కోసం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పి.ఎం.ఎస్.బీ.వై) పథకాలను కేంద్రం అమలు చేస్తోందని ఆయన తెలిపారు.
పి.ఎం.ఈ.జి.పి పథకం కింద దరఖాస్తు చేసుకోవాలంటే 18 సంవత్సరాల వయస్సు, 8వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ పథకం ద్వారా తయారీ రంగంలో యూనిట్ స్థాపనకు గరిష్టంగా 50 లక్షలు, సేవా రంగంలో యూనిట్ స్థాపనకు 20 లక్షల రూపాయల వరకు సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తారు. చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చని, ఆన్‌లైన్‌లో kvic online.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. పి.ఎం.జే.జే.బీ.వై జీవిత బీమా పథకం కోసం 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గలవారు బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీస్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈ పథకం కింద ఏటా 436 రూపాయల ప్రీమియం చెల్లిస్తే, ఏ కారణంతో మరణించినా 2 లక్షల రూపాయల బీమా అందుతుంది. ఈ పాలసీని 55 సంవత్సరాల వరకు పునరుద్ధరించ వచ్చు. అలాగే, పి.ఎం.ఎస్.బీ.వై ప్రమాద బీమా పథకం కోసం 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గలవారు నమోదు చేసుకోవచ్చు. ఏటా 20 రూపాయల ప్రీమియం చెల్లిస్తే, ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం జరిగితే 2 లక్షలు, పాక్షిక వైకల్యానికి 1 లక్ష రూపాయల బీమా అందుతుందని కలెక్టర్ వివరించారు. ఈ పథకాలను ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.
**బ్యాంకర్ల సమావేశం:** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీతో కలిసి బ్యాంకర్లతో డీసీసీ మరియు డీ.ఎల్.ఆర్.సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గత సంవత్సరంతో పోలిస్తే ఇంటి రుణాలు, విద్యా రుణాలు, పునరుత్పాదక విద్యుత్ రుణాల పంపిణీ తగ్గిన కారణాలను సమీక్షించి, ప్రాధాన్యత రంగాలలో బ్యాంకింగ్ సేవలు తగ్గకుండా చూడాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అక్కడ ప్రజలు డిజిటల్ లావాదేవీలను పూర్తిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలు ఆన్‌లైన్‌లో లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. డిజిటల్ గ్రామాల తయారీకి 15 రోజుల్లో సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. 2024-25లో రైతులకు పంట రుణాల కింద 1864 కోట్ల లక్ష్యంలో 1358 కోట్లు పంపిణీ చేసినట్లు, వ్యవసాయ టర్మ్ రుణాల లక్ష్యాన్ని చేరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం లో కూడా ఈ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, స్కేల్ ఆఫ్ లోన్ డిస్ట్రిబ్యూష న్‌ను పెంచాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీలో వెనుకబడిన ట్లు గుర్తించి, ఈ ఏడాది మెరుగైన పనితీరు కనబర్చాలని ఆదేశించా రు. ఎం.ఎస్.ఎం.ఈ రంగంలో 2024-25లో 1364 కోట్ల రుణాల లక్ష్యంలో 951 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 5844 స్వశక్తి సంఘాలకు 469.37 కోట్ల రుణాలు అందించినట్లు అధికారులు వెల్లడించారు.
**సఖీ సెంటర్ సందర్శన:** జిల్లా కలెక్టర్ రంగంపల్లిలోని సఖీ సెంటర్ను సందర్శించి, హింసకు గురవుతున్న మహిళలకు సేవలు అందించాలని సూచించారు. బాధిత మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, వారిని రెగ్యులర్‌గా ఫాలో అప్ చేయాలని, అవసరమైన కౌన్సెలింగ్ మరియు న్యాయ సలహాలు అందించాలని ఆదేశించారు. గోదావరిఖనిలో ఒక మహిళ మరియు ఆమె పిల్లలను మూడేళ్లపాటు అక్రమంగా నిర్బంధించిన మెస్త్రీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీకి ఆదేశించారు. ప్రస్తుతం నెలకు సుమారు 20 మంది మహిళలు సఖీ సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారని, గ్రామాల్లో సెంటర్ సేవల గురించి విస్తృతంగా ప్రచారం చేసి బాధితుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ సూచించారు.
**మహిళా సంఘాల సమావేశం:** సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వశక్తి మహిళా సంఘాల సమీక్ష సమావేశంలో కలెక్ట ర్ మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇందిరా మహి ళా శక్తి కార్యక్రమం కింద ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళలు రాణించాలని సూచించారు. ప్రభుత్వ పథకా లపై అవగాహన కల్పించేందుకు మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు, పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్ అందించినట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం, ఎస్సీ సబ్ ప్లాన్, పి.ఎం.ఈ.జి.పి, పి.ఎం.ఎఫ్.ఎం. ఈ వంటి పథకాలను సమన్వయం చేసుకొని ప్రత్యేక యూనిట్ స్థాపనకు ముందుకు రావాలని, హార్టికల్చర్, వ్యవసాయం లేదా ఇతర వాణిజ్య కార్యకలాపాలపై సందేహాలు ఉంటే అధికారులు పూర్తి సహకారం అందిస్తారని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో కూడా త్వరలో పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళింది, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, డీఎం అండ్ హెచ్ఓ డా. అన్న ప్రసన్న కుమారి, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్లే-ఆఫ్స్‌లో.. ముంబయి ఇండియన్స్

## నీతా అంబానీ ఆరో టైటిల్ సంకేతం

ముంబయి: ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభంలో నీరసంగా కనిపించిన ముంబయి ఇండియన్స్ అద్భుతంగా కోలుకుని ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధించింది. వరుసగా ఆరు విజయాలతో ప్లే-ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన ఈ జట్టు, తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం 16 పాయింట్లతో నిలిచిన ముంబయి, మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలిచి, ఇతర ఫలితాలు అనుకూలిస్తే టాప్-2లో చోటు దక్కించుకునే అవకాశం ఉంది.

ఈ కీలక మ్యాచ్‌ను ముంబయి ఇండియన్స్ యజమాని నీతా అంబానీ వాంఖడే స్టేడియంలో వీక్షించారు. ఢిల్లీపై విజయంతో ప్లే-ఆఫ్స్ స్థానం ఖరారైన నేపథ్యంలో నీతా అంబానీ ఆనందోత్సాహాల్లో మునిగారు. ఈ సందర్భంగా ఆమె ఆరు చేతి వేళ్లను చూపిస్తూ, ముంబయి ఇండియన్స్ ఆరో ఐపీఎల్ టైటిల్ సాధించబోతోందని సంకేతం ఇచ్చారు. ఈ సందర్భానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# పాల్ స్టిర్లింగ్ 10000 పరుగుల మైలురాయి



## చరిత్ర తిరగ రాసిన ఐర్లాండ్ ఓపెనర్

ప్రస్తుతం వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఐర్లాండ్‌కు నాయకత్వం వహిస్తున్న పాల్ స్టిర్లింగ్, క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిని అధిగమించాడు. అతను అంతర్జాతీయ క్రికెట్‌లో 10000 పరుగులు పూర్తి చేసిన తొలి ఐర్లాండ్ క్రికెటర్‌గా నిలిచాడు. ఈ అరుదైన ఘనతను అతను వెస్టిండీస్‌పై జరిగిన తొలి వన్డేలో తన 37వ పరుగుతో సాధించాడు. కుడిచేతి ఓపెనర్ అయిన స్టిర్లింగ్ ఆ మ్యాచ్‌లో 54 పరుగులు చేసి నిష్క్రమించాడు, ఇది అతని 57వ అంతర్జాతీయ అర్ధ సెంచరీ కావడం విశేషం. 2008లో న్యూజిలాండ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసిన స్టిర్లింగ్, 2009లో 20ల్లో, 2018లో టెస్టుల్లో ఐర్లాండ్ తరపున అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు మూడు ఫార్మాట్లలోనూ అద్భుతమైన ఆటతీరు కనబరిచాడు.పాల్ స్టిర్లింగ్ 10000 అంతర్జాతీయ పరుగులు చేసిన 97వ ఆటగాడిగా కూడా నిలిచాడు. అతని తరువాత ఐర్లాండ్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు ఆండ్రూ బాల్బిర్నీ, ఇతను 6055 పరుగులతో రెండవ స్థానంలో ఉన్నాడు. బాల్బిర్నీ కూడా వెస్టిండీస్‌పై మొదటి వన్డేలో స్టిర్లింగ్‌కు జతగా ఓపెనింగ్ చేశారు. ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో మరిన్ని గొప్ప ఆటగాళ్లు ఉన్నా, కెవిన్ ఓ'బ్రెయిన్ 2011 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై చేసిన అసాధారణ శతకంతో చిరస్మరణీయుడిగా నిలిచాడు. అతను 5850 పరుగులతో మూడవ స్థానంలో ఉన్నాడు.

# ఢిల్లీకి డబుల్ షాక్

- ఓటమి బాధ మధ్య ముకేశ్ కుమార్‌కు జరిమానా
- మేం బాగానే ఆడాం.. కానీ!: ఫాఫ్ డుప్లెసిస్
- సరైన ఓపెనింగ్ జోడీ లేకపోవడం వల్లే ప్లే-ఆఫ్స్‌కు చేరలేకపోయింది: హేమంగ్ బదానీ



ఐపీఎల్ 2025 సీజన్‌లో ప్లే-ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు డబుల్ ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 59 పరుగుల తేడాతో ఓడిన ఢిల్లీ, అసలే ఓటమి బాధలో ఉండగా, జట్టు ప్రధాన పేసర్ ముకేశ్ కుమార్‌కు ఐపీఎల్ కోడ్ ఉల్లంఘన కారణంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. ముకేశ్ ఈ మ్యాచ్‌లో లెవల్ 1 నియమ ఉల్లంఘనకు పాల్పడ్డాడని మ్యాచ్ రిఫరీ గుర్తించి, ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. విచారణలో ముకేశ్ తన తప్పును అంగీకరించడంతో, అతడికి జరిమానా విధించారు. "ముకేశ్ కుమార్ ఆర్టికల్ 2.2 ప్రకారం లెవల్ 1 తప్పిదం చేశాడు. రిఫరీ నిర్ణయాన్ని అతడు అంగీకరించాడు. లెవల్ 1 తప్పిదాల విషయంలో రిఫరీ నిర్ణయమే తుది," అని ఐపీఎల్ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

అక్షర్ పటేల్ గైర్హాజరీలో కెప్టెన్‌గా వ్యవహరించిన ఫాఫ్ డుప్లెసిస్ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ, "మేం చక్కగా ఫీల్డింగ్ చేశాం, బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. పిచ్ బౌలర్లకు అనుకూలంగా ఉంది, కానీ ముంబై బలమైన బ్యాటింగ్ లైనప్‌తో చివరి రెండు ఓవర్లలో 50 పరుగులు సాధించింది. 17, 18 ఓవర్ల వరకు మేం చేసిన కష్టం వృథా అయింది," అని అన్నారు. సమీర్ రిజ్వీ (4 ఫోర్లు, 1 సిక్స్‌తో 39)ని ప్రశంసిస్తూ, "అతడిలో గొప్ప ప్రతిభ ఉంది. కానీ ఇలాంటి పిచ్‌లపై మంచి ఆరంభం అవసరం, అది మాకు దక్కలేదు. గత 6-7 మ్యాచ్‌లలో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించలేకపోయాం," అని విశ్లేషించారు.

ఢిల్లీ కోచ్ హేమంగ్ బదానీ ప్లే-ఆఫ్స్‌కు చేరకపోవడానికి కారణాలను వివరిస్తూ, "సరైన ఓపెనింగ్ జోడీ దొరకలేదు. జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, అభిషేక్ పోరెల్, ఫాఫ్ డుప్లెసిస్, కరుణ్ నాయర్ నిలకడగా రాణించలేకపోయారు. ఇతర జట్లకు లభించిన బలమైన ఆరంభాలు, పవర్‌ప్లే మాకు దక్కలేదు. కేఎల్ రాహుల్ (13 మ్యాచ్‌లలో 504 పరుగులు) మాత్రమే అద్భుతంగా ఆడాడు," అని తెలిపారు. సీజన్ ఆరంభంలో ఐదు మ్యాచ్‌లు గెలిచినప్పటికీ, "తర్వాత పరిస్థితులు వ్యతిరేకంగా మారాయి. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌లో ఆరు ఓవర్లలో 60 పరుగులు చేయాల్సి ఉండగా, ఏడు వికెట్లతో ఓడిపోయాం. ఇలాంటి ఓటములు ప్లే-ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీశాయి," అని బదానీ విశ్లేషించారు.

ఢిల్లీ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మే 24న పంజాబ్ కింగ్స్‌తో ఆడనుంది. ముంబైపై విజయం సాధించి ఉంటే, ఈ మ్యాచ్ ఫలితం రెండు జట్ల ప్లే-ఆఫ్స్ అవకాశాలను నిర్ణయించేది. అయితే, ఈ ఓటమితో ఢిల్లీ ప్లే-ఆఫ్స్ ఆశలను కోల్పోయింది.



# పోరాడి ఓడిన ప్రణయ్

## క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీకాంత్

మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గురువారం భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆట గాడు కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మాజీ వరల్డ్ నంబర్ 1 అయిన శ్రీకాంత్, ఐర్లాండ్ ఆటగాడు నాట్ గుయెన్‌ను రెండో రౌండ్‌లో చిత్తు చేశాడు. తొలి రౌండ్‌లో చైనా ఆటగాడు లూ గాంజ్ జూపై విజయం సాధించిన శ్రీకాంత్, గుయెన్‌పై కూడా అదే జోరును కొనసాగించాడు. హోరాహోరీగా సాగిన మొదటి సెట్‌ను 23-21తో గెలిచిన అతడు, రెండో సెట్‌లో 21-17తో ప్రత్యర్థిని చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. మిక్స్ డబుల్స్ ప్రీ-క్వార్టర్ ఫైనల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఫ్రాన్స్ జోడీ జులియన్ మయివో, లీ పలెమోలపై మూడు సెట్ల పోరులో 21-17, 18-21, 21-15 స్కోరుతో విజయం సాధించింది.

**యువ ఆటగాళ్లకు నిరాశ**

అయితే, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హెచ్ఎస్ ప్రణయ్‌కు నిరాశ తప్పలేదు. జపాన్ యువ ఆటగాడు యుషి తనక ధాటికి ప్రణయ్ 9-21, 18-21 స్కోరుతో ఓటమి చవిచూశాడు. అలాగే, ఫ్రాన్స్ షట్లర్ తోమా పొపోవ్ జోరుకు ఆయుశ్ శెట్టి, క్రిస్టో పొపోవ్ చేతిలో కరుణాకరన్ ఓడిపోయారు. మహిళల డబుల్స్ రౌండ్-16లో ప్రేరణ అల్వేకర్, మృణ్మయి దేశ్‌పాండే జోడీ కూడా విఫలమైంది. ఒలింపిక్ విజేత పీవీ సింధు తొలి రౌండ్‌లోనే ఓటమితో ఇంటిదారి పట్టిన సంగతి తెలిసిందే.



# వైభవ్‌కి 500 ఫోన్ కాల్స్!

ఐపీఎల్ 2025 సీజన్‌లో అరంగేట్రం చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన మూడో మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శనతో సంచలనం సృష్టించాడు. ఏప్రిల్ 28న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గుజరాత్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఇది ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకంగా నిలిచింది. అంతేకాదు, ఐపీఎల్ చరిత్రలో అతి పిన్న వయసులో సెంచరీ కొట్టిన క్రికెటర్‌గా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన వైభవ్, ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీతో సహా 252 పరుగులు సాధించాడు.

రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో మాట్లాడుతూ వైభవ్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. తన సెంచరీ తర్వాత 500 ఫోన్ కాల్స్ వచ్చాయని, రాబోయే మ్యాచ్‌లపై దృష్టి పెట్టడానికి నాలుగు రోజుల పాటు ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయాల్సి వచ్చిందని తెలిపాడు. "గత మూడు-నాలుగు సంవత్సరాలుగా నేను సన్నద్ధమవుతున్నాను. దాని ఫలితాలను ఇప్పుడు చూస్తున్నాను. ఒకప్పుడు కష్టంగా అనిపించినవి ఇప్పుడు సులభంగా మారాయి. దృష్టి కేంద్రీకరించడం చాలా ముఖ్యం. జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడాలి. అనవసరమైన ప్రయత్నాలు చేయకూడదు," అని వైభవ్ అన్నాడు. సెంచరీ తర్వాత వచ్చిన ఫోన్ కాల్స్ గురించి మాట్లాడుతూ, "సెంచరీ సాధించిన తర్వాత నా ఫోన్‌కు 500 మిస్డ్ కాల్స్ వచ్చాయి. తదుపరి మ్యాచ్‌ల కోసం సన్నద్ధమవడానికి నాలుగు రోజులు ఫోన్ ఆఫ్ చేశాను. నేను కుటుంబం, కొంతమంది సన్నిహితులతో మాత్రమే ఉండటానికి ఇష్టపడతాను," అని ద్రవిడ్‌తో చెప్పాడు. ద్రవిడ్ సలహా ఇస్తూ, "ఈ సీజన్ నీకు అద్భుతంగా సాగింది. ఇలాగే కొనసాగు, మరింత శిక్షణ పొందు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవచ్చే సీజన్‌లో బౌలర్లు నీ కోసం ప్రత్యేక ప్రణాళికలతో వస్తారు. దానికి సిద్ధంగా ఉండి, కొత్త నైపుణ్యాలను పెంపొందించుకో," అని వైభవ్‌కు సూచించాడు.

# ఇంగ్లాండ్ టూర్‌కు భారత్ అండర్ 19 జట్టు ఎంపిక

## టూర్‌కు వైభవ్ సూర్యవంశీ సెలెక్ట్

భారత అండర్- 19 పురుషుల క్రికెట్ జట్టు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 24న ప్రారంభం కానున్న ఈ పర్యటనలో ఆతిథ్య ఇంగ్లాండ్‌తో మన కుర్రాళ్ల జట్టు ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు బీసీసీఐ గురువారం జట్టును ప్రకటించింది. ఈ జట్టులో ఐపీఎల్ యువ సంచలనం ఆయూశ్ మాత్రే సారథ్యం వహించనున్నాడు. అలాగే రాజస్థాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ కూడా ఈ టూర్‌కు సెలెక్ట్ అయ్యాడు. 16మందితో కూడిన జట్టును బీసీసీఐ ప్రకటించింది.

**భారత 19 జట్టు:** ఆయుశ్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్‌సిన్హ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు (వైస్- కెప్టెన్, వికెట్ కీపర్), హర్వాన్ష్ సింగ్ (వికెట్ కీపర్), అంబరీశ్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ రావ్ పటేల్, ఖిలాన్ రావ్ పటేల్, హెన్ల్ మహమ్మద్ ఈనాన్, ఆదిత్య రానా, అన్‌మోల్‌జీత్ సింగ్

**స్టాండ్ బై :** నమన్ పుష్పక్, డి దీపేశ్, వేదాంత్ త్రివేది, వికల్ప్ తివారీ, అలంకృత్ రాపోల్

# ప్లే-ఆఫ్స్ ముందు ఆర్సీబీకి శుభవార్త!



**బెంగళూరు:** ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ప్లే-ఆఫ్స్ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 12 మ్యాచ్‌లలో 8 విజయాలతో 17 పాయింట్లు సాధించి, పాయింట్ల పట్టిక లో రెండో స్థానంలో నిలిచింది. ఈ కీలక సమయంలో ఆర్సీబీ జట్టులో మార్పు జరగనుంది. భారత్-పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ ఒక వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. షెడ్యూల్ మార్పుల కారణంగా ఇంగ్లండ్ ఆటగాడు జాకబ్ బెతెల్ ప్లే-ఆఫ్స్‌లో ఆడటం లేదు, ఎందుకంటే మే 29 నుంచి ఇంగ్లండ్-వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.

జాకబ్ బెతెల్ స్థానంలో న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సీఫెర్ట్ ఆర్సీబీ జట్టులో చేరనున్నాడు. ఈ మేరకు ఆర్సీబీ యాజమాన్యం సీఫెర్ట్‌తో రూ. 2 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది, ఇది మే 24 నుంచి అమలులోకి వస్తుంది. ఈ వార్తతో ఆర్సీబీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్సీబీ మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లీగ్ మ్యాచ్ ఆడనుంది, ఇది జాకబ్ బెతెల్‌కు ఈ సీజన్‌లో చివరి ఐపీఎల్ మ్యాచ్ కానుంది. అనంతరం అతడు మే 24న ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్లి జాతీయ జట్టుతో కలవనున్నాడు. ఆర్సీబీ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మే 27న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది, ఇందులో సీఫెర్ట్ పాల్గొనే అవకాశం ఉంది. 66 టీ20 మ్యాచ్‌లలో 1,540 పరుగులు సాధించిన సీఫెర్ట్, 2022 సీజన్‌లో ఆర్సీబీ తరపున మూడు ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. మరోవైపు, గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ కూడా ఇంగ్లండ్-వెస్టిండీస్ మధ్య జరిగే మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల కారణంగా ప్లే-ఆఫ్స్‌కు అందుబాటులో ఉండటం లేదు.

# ఆర్‌సీబీకి వ్యతిరేకంగా ఆడాలని మెసేజ్‌లు వస్తున్నాయి

## ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బెన్ కట్టింగ్



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బెన్ కట్టింగ్ పేరును రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అభిమానులు అస్సలు మరిచిపోరు. ఐపీఎల్ 2016 ఫైనల్‌ను ఆర్‌సీబీ అభిమానులకు ఈ ఆసీస్ ఆటగాడు పీడకలగా మిగిల్చాడు. ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన బెన్ కట్టింగ్.. బెంగళూరు వేదికగా ఆర్‌సీబీ జరిగిన ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆరెంజ్ ఆర్మీకి టైటిల్ అందించాడు.చివర్లో బ్యాటింగ్ వచ్చి కేవలం 15 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసిన బెన్ కట్టింగ్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 208 పరుగుల భారీ లక్ష్యాన్ని అందించాడు. ఆ తర్వాత డేంజరస్ క్రిస్ గేల్‌తో పాటు కేఎల్ రాహుల్‌లను ఔట్ చేసి ఆర్‌సీబీ పతనాన్ని శాసించాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.తాజాగా ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మ్యాచ్ గురించి మాట్లాడిన బెన్ కట్టింగ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. బెంగళూరులోని ఆ రాత్రిని అస్సలు మరిచిపోలేనని తెలిపాడు. తాను మర్చిపోదామనుకున్న అభిమానులు రోజు వందల మెసేజ్‌లతో గుర్తు చేస్తారని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ఆర్‌సీబీకి వ్యతిరేకంగా ఇతర జట్లలోకి రిప్లేస్‌మెంట్‌గా రావాలని రోజుకు 150 మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పాడు.'నేను నా ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌లను చూస్తే, ప్రతిరోజూ 150 మెసేజ్‌లు ఉంటాయి, అందులో '%=జది%కి వ్యతిరేకంగా వచ్చే ఏ జట్టుకైనా ఐపీఎల్‌లో రీప్లేస్‌మెంట్‌గా అందుబాటులో ఉండగలవా?' అని అభిమానులు ప్రశ్నిస్తుంటారు'అని బెన్ కట్టింగ్ చెప్పుకొచ్చాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో తన ప్రయాణాన్ని ఎప్పుడూ మరిచిపోలేనని చెప్పాడు.

# రోహిత్ ప్రపోజల్‌కు బీసీసీఐ నో!



టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు అకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం వెనుక సంచలన కారణాలున్నాయని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఎంఎస్ ధోనీ తరహాలో తన వీడ్కోలును ప్లాన్ చేసుకునేందుకు రోహిత్ చేసిన ప్రతిపాదనను బీసీసీఐ తిరస్కరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిత్ టెస్ట్ క్రికెట్‌కు గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది. 2014లో ఆసీస్ పర్యటనలో ఉన్నప్పుడు ఎంఎస్ ధోనీ సిరీస్ మధ్యలోనే టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అదే తరహాలో, త్వరలో ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ పర్యటనలో కొన్ని టెస్టు మ్యాచ్‌లకు నాయకత్వం వహించి, ఆ తర్వాత సిరీస్ మధ్యలో టెస్టుల నుంచి వైదొలగాలని రోహిత్ భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రోహిత్ బీసీసీఐ సెలక్టర్ల ముందు ఒక ప్రతిపాదన ఉంచినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే, హిట్‌మ్యాన్ చేసిన ఈ ప్రతిపాదనకు బీసీసీఐ సుముఖత వ్యక్తం చేయలేదని తెలిపాయి. కీలకమైన ఇంగ్లాండ్ సిరీస్‌లో జట్టు నాయకత్వంలో స్థిరత్వం ఉండాలని, సిరీస్ మధ్యలో కెప్టెన్ మారడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపుతుందని సెలక్టర్లు భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రోహిత్ ప్రపోజల్‌ను సున్నితంగా తిరస్కరించారని, ఒకవేళ సిరీస్‌కు అందుబాటులో ఉండాలనుకుంటే ఆటగాడిగా కొనసాగవచ్చునని చెప్పారట. అలాగే కెప్టెన్‌గా మాత్రం పూర్తి సిరీస్‌కు ఒక్కరే ఉండాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు సమాచారం. దీంతో ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు ముందే రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించినట్లు కథనాలు వెలువడుతున్నాయి.మరోవైపు, రోహిత్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది రోజులకే విరాట్ కోహ్లీ కూడా ఆ ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పాడు. దీంతో భారత జట్టులో తీవ్ర నాయకత్వ లేమి ఏర్పడింది. ఈ క్రమంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తదుపరి టెస్టు కెప్టెన్ ఎంపిక కోసం కసరత్తు చేస్తోంది. హిట్ మ్యాన్ స్థానంలో తదుపరి టెస్ట్ కెప్టెన్‌ను ఎంపిక చేసే క్రమంలో ఇప్పటికే గిల్, రిషబ్ పంత్ ఇద్దరితోనూ బీసీసీఐ సెలక్షన్ కమిటీ అనధికారిక చర్చలు నిర్వహించినట్లు సమాచారం. బుమ్రా, గిల్ కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నారని కథనాలు వస్తున్నాయి. గిల్‌కు కెప్టెన్సీ ఇవ్వడం గురించి బీసీసీఐలోని ఒక సెలక్టర్ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వైస్ కెప్టెన్?గా అయితే బాగా సరిపోతాడని ఆ సెలెక్టర్ అన్నట్లు టాక్.అయితే భారత్ తదుపరి టెస్టు కెప్టెన్ ఎవరనేదానిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లాండ్‌తో జరిగే టెస్ట్ పర్యటనలో భారత జట్టుకు గిల్ నాయకత్వం వహించగలడని అభిప్రాయపడ్డాడు.వారందరూ కెప్టెన్సీకి భిన్నమైన విధానాన్ని తీసుకున్నారు"భారత కెప్టెన్సీకి ప్రధాన పోటీదారులుగా గిల్, పంత్, శ్రేయస్ అయ్యర్‌ను చూసినప్పుడు ధోనీ, రోహిత్, విరాట్ వంటి ఆటగాళ్లను కలిసి చూసినట్లు అనిపిస్తుంది. గిల్ బహుశా ఎక్కువ పోటీతత్వం ఎదుర్కొంటాడు. ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు వెంటనే అంపైర్‌ను అడుగుతాడు. రిషబ్ పంత్ స్టంప్స్ వెనుక నుంచి మ్యాచ్?లో చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు. శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుతంగా రాణిస్తున్నాడు' అని సన్నీ వ్యాఖ్యానించాడు.

# ఆ 25 మంది అథ్లెట్లకు వీసా

ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధమవుతున్న భారత అథ్లెట్లకు గుడ్ న్యూస్. మరో ఐదు రోజుల్లో టోర్నీ ఆరంభం కానుందనగా భారత బృందంలోని 25 మందికి ఎట్టకేలకు దక్షిణ కొరియా ప్రభుత్వం వీసా మంజూరు చేసింది. దాంతో, వాళ్లు కూడా స్క్వాడ్‌తో కలిసి పతకాల వేటలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.'భారత క్రీడల మంత్రిత్వ శాఖ, కొరియాలోని భారత దౌత్యవేత్తల ప్రయత్నం ఫలించింది. స్క్వాడ్‌లో మిగిలిన 25 మందికి గురువారం సాయంత్రం వీసాలు మంజూరు అయ్యాయి' అని ఏఎఫ్ఐ సెక్రటరీ జనరల్ సందీప్ మెహతా మీడియాకు వెల్లడించాడు. 'వీసా కష్టాలు తొలగడంతో బ్యాచ్‌ల వారీగా అథ్లెట్లు కొరియాలోని గుమి చేరుకుంటారు. ప్రస్తుతం తిరువనంతపురంలోని శిక్షణ కేంద్రంలో ఉన్న భారత అథ్లెట్లు కొరియాకు బయల్దేరనున్నారు.

# వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ప్రారంభించిన ఎస్‌బిఐ

- తెలంగాణ 45వ త్రైమాసిక సమీక్షా సమావేశం
- బ్యాంకుల కృషిని ప్రశంసించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




హైదరాబాద్, మే 22 (జనంసాక్షి) : రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్ బిసి), తెలంగాణ తన 45వ త్రైమాసిక సమీక్షా సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. మార్చి 2025తో ముగిసిన త్రైమాసికంలో తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంకుల పనితీరును సమీక్షించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకుల వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఉప ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆర్థిక) సందీప్ కుమార్ సుల్తానియా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ఎ శరత్, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ శ్రీధర్, ఆర్బీఐ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, నాబార్డ్ హైదరాబాద్ సీజీఎం ఉదయ్ భాస్కర్, ఎస్ బిఐ హైదరాబాద్ సర్కిల్ డిఎండి రాజేష్ కుమార్, ఎస్ బిఐ జిఎం, కన్వీనర్, ఎస్ఎల్ బిసి ప్రకాష్ చంద్ర బారోర్, సీనియర్ అధికారులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఆర్ఆర్ బిలు, ఎస్ఎఫ్ బిలు, చెల్లింపుల బ్యాంకుల నుండి అధికారులు, వివిధ వ్యవసాయ, ఎంఎస్ఎంఈ సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ బిఐ డిఎండి రాజేష్ కుమార్ హైదరాబాద్ సర్కిల్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలోని బ్యాంకుల పనితీరును అందించారు. బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 60,477 కోట్లు మొత్తం డిపాజిట్లు రూ.8,40,430 కోట్లుగా ఉన్నాయి. సిడి నిష్పత్తి 100 శాతం పైన కొనసాగుతోంది మరియు ఎఫ్ వై 2024-25లో ఇది 125.53% నుండి 128.67%కి పెరిగింది. ఈ సంవత్సరంలో, బ్యాంకులు రూ.73,105 కోట్ల స్వల్పకాలిక ఉత్పత్తి రుణాలను పంపిణీ చేసి, వార్షిక లక్ష్యాలలో 80.52% సాధించాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగానికి, బ్యాంకులు రూ.1,21,343 కోట్లు పంపిణీ చేశాయి, లక్ష్యాలలో 93.60% సాధించాయి. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం కింద, బ్యాంకులు వార్షిక లక్ష్యాలలో 97.37% సాధించడానికి రూ.13,472 కోట్లు మంజూరు చేశాయి.

ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంకుల వార్షిక క్రెడిట్ ప్లాన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. వార్షిక క్రెడిట్ ప్లాన్ ముఖ్యాంశా లను ప్రకాష్ చంద్ర బరోర్ జిఎం ఎస్ బిఐ, కన్వీనర్ ఎస్ఎల్ బిసి ప్రతిపాదించారు. వివిధ లక్ష్యాలను సాధించడంలో బ్యాంకుల కృషిని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు. మరిన్ని సూక్ష్మ సంస్థలు క్రెడిట్ లింక్ చేయబడతాయని, ఇది పెద్దఎత్తున వ్యవస్థాపకత, ఉపాధి కల్పనను సృష్టిస్తుందని ఆయన తెలియజేశారు.

సందీప్ కుమార్ సుల్తానియా ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రాధాన్యతా రంగ రుణాలు, విద్యా రుణాలపై ఎక్కువ దృష్టి పెట్టవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ రాజీవ్ యువ వికాసం పథకానికి అవసరమైన అన్ని మద్దతులను అందించాలని బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ఎన్ శ్రీధర్, హైదరాబాద్ నాబార్డ్ సిజిఎం శ్రీ ఉదయ్ భాస్కర్, హైదరాబాద్ ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ శ్రీ చిన్మోయ్ కుమార్ కూడా మాట్లాడారు. ఎస్ బిఐ డిజిఎం (ఎఫ్ఐ, ఎస్ఎల్ బిసి) ప్రశాంత్ కుమార్ బరియార్ ధన్యవాదాలతో సమావేశం ముగిసినట్లు ఎం, సి అండ్ సీఎస్ఆర్ ఏజీఎం జి రామకృష్ణ తెలిపారు.

# అల్వాల్ లో డ్రైనేజీ సమస్యలపై మాన్హోల్ తవ్వకాలు

అల్వాల్, మే 22(జనంసాక్షి): ఆనందరావు నగర్ కాలనీ రోడ్ నెంబర్ 1లో మునిసిపల్ అధికారులు మ్యాన్హోల్ తవ్వకాలు గురువారం రాత్రి చేపట్టిన నేపథ్యంలో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాల కారణంగా కాలనీ లోని ఓ రెసిడెన్సీ సెల్లార్‌లోకి మురుగు నీరు చేరిందని ఫిర్యాదు చేయగా, అధికారులు స్పందించి డ్రైనేజీ పై వేసిన సిమెంట్‌ను తొలగించి మాన్హోల్ తవ్వకాలు ప్రారంభించారు. దోమల ఉధృతి తగ్గించేందుకు, మురుగు వాసన రాకుండా ఉండేందుకు కొంతమంది కాలనీ వాసులు తమ ఇళ్ల ముందు స్వయంగా సిమెంట్ వేశారు. ఈ ర్యాంపుల కారణంగా డ్రైనేజీకి అంతరాయం ఏర్పడిందని అధికారులు గుర్తించారు. ఇలాంటి పనులు చేసేముందు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌తో చర్చ జరగాల్సింది అని అభిప్రాయపడుతున్నారు.ఈ ఘటనపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిలవకుండా ర్యాంపులు వేశారని గుర్తించాం. అవి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు ఆటంకంగా మారుతున్నాయి. శుభ్రత కోసం తాత్కాలికంగా వాటిని తొలగించామని . త్వరలోనే కొత్త మాన్హోల్స్ ఏర్పాటు చేస్తాం అని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 మే 2025

# భారతీయ రైల్వేలో సరికొత్త అధ్యాయానికి నాంది

- కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ
- ఆధునికరించిన వరంగల్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం
- ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా వరంగల్ సహా 103 రైల్వేస్టేషన్లో ప్రారంభం
- పాల్గొన్న రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**వరంగల్ ప్రతినిధి, మే 22 (జనం సాక్షి) :** భారతీయ రైల్వే ప్రయాణ ప్రమాణాలలో సరికొత్త అధ్యాయానికి నాంది అని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. దేశవ్యాప్తంగా ఆధునికరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం రాజస్థాన్ లోని బికినీర్ నుండి వర్చువల్ గా ప్రారంభించారు. అందులో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ,రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ,ఎంపీ లు డీకే అరుణ,ఈటల రాజేందర్, కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య,ఎమ్మెల్యే లు కే ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్విని రెడ్డి, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే రైల్వే అధికారులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంత్రుల చేతుల మీదుగా జ్ఞాపికలు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి వర్మ శ్రీనివాస్ రాజులి మాట్లాతూ పార్టీలకతీతంగా అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన తో అమృత్ భారత్ పథకంలో వరంగల్ స్టేషన్ అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు.భారత ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యత స్వీకరించినప్పటి నుంచి ఇతర దేశాలతో పోటీపడే విధంగా పెద్ద ఎత్తున అమృత్ భారత్ స్కీం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు ఏర్పాటు చేయుటకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో బుల్లెట్ రైలు కూడా తీసుకురావడానికి భారత్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2014 కంటే ముందు రైల్వేల నిర్మాణం చూసినట్లయితే ప్రస్తుతం 5300 కోట్లు కేటాయించి రైల్వేలను ఆధునీకరించామని అందుకు ప్రతి ఒక్కరూ అభినందించదగిన విషయమని అన్నారు. భారతదేశంలోని 1300 రైల్వే స్టేషన్ లను లక్ష కోట్లతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లు ఉన్నాయని ప్రస్తుతం మూడు రైల్వేస్టేషన్లో ప్రారంభించుటకు శ్రీకారం చుట్టిందని మిగతా రైల్వే స్టేషన్లను త్వరలో ప్రారంభించుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ ను ఆధునీకరణ లో భాగంగా పాతిక కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని మూడు రైల్వే స్టేషన్లను ఆధునికీకరించడం జరిగిందన్నారు. అందులో వరంగల్ రైల్వే స్టేషన్ ఉందన్నారు. రాష్ట్రం లోని మూడు రైల్వే స్టేషన్ లను ప్రారంభిస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలోనే హైదరాబాద్ ఎలా అయితే అభివృద్ధి చెందిందో ఆ విధంగానే వరంగల్ నగరం కూడా అభివృద్ధి సాధించాలని అన్నారు. వరంగల్ చాలా ముఖ్యమైన నగరమని అన్నారు. ప్రధానంగా ఉత్తర భారత దేశానికి, ఉత్తర దక్షిణ ప్రాంతాలకు కాజీపేట రైల్వే స్టేషన్ జంక్షన్ పాయింట్ అని, డివిజన్‌గా ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు.హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశలో కొంత భాగాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, రెండవ దశలో 76 కిలోమీటర్ల విస్తరణను 24500 కోట్లతో ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలు త్వరగా ఆమోదించాలని చేయాలని కోరారు. శాసనమండలి ఉపాసభాపతి బండ ప్రకాష్ మాట్లాడుతూ భారత్ స్టేషన్ పథకం కింద 25.41 కోట్ల రూపాయల వ్యయంతో తక్కువ కాలంలో కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన వరంగల్ రైల్వే స్టేషన్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా పర్చువల్ విధానంలో ప్రారంభించుకోవడం సంతోష దాయకమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లకు మాత్రమే పునరుద్ధరణ చేయడం జరిగిందని, మిగిలినవన్నీ స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని కోరారు. వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గుడ్ షెడ్డు విస్తరించాలని దీనితో పాటుగా కాజీపేట్ రైల్వే స్టేషన్ లో కూడా వుడ్ షీట్ ఏర్పాటు చేయాలని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని కోరారు. పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో సమపాళ్లలో అభివృద్ధి జరుగుతుందన్నారు 425 కోట్ల రూపాయల వ్యయంతో చర్లపల్లి తర్మినల్లు అత్యాధునికంగా నిర్మించడం జరిగిందన్నారు. పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాకతీయుల కళలు ప్రతిబింబించేలా వరంగల్ రైల్వే స్టేషన్ నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు . అమృత్ భారత్ పథకం కింద ఖాజీపేట రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో ప్రారంభించు కుంటామన్నారు. కాజీపేట్ రైల్వే డివిజన్, ఆర్ ఓ బి ఏర్పాటు చేయాలని, రైల్వే శాఖ ద్వారా కాజీపేట బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ మాట్లాడుతూ అమృత్ భారత్ స్కీమ్ కింద దేశవ్యాప్తంగా పునరుద్ధరణ చేసిన 103 రైల్వే స్టేషన్లలోమౌలిక సదుపాయాలు ప్రణాళికవు సకల సౌకర్యాలు కల్పించి ప్రధానమంత్రి చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించుకొని దేశానికి అంకితం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద 40 రైల్వేస్టేషన్లో పునరుద్ధరణ చేసి అందులో పూర్తయిన మూడు స్టేషన్లు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు.శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్యలి మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో విమానాశ్రయం తరహాలో ప్రయాణికులకు అత్యాధునిక వసతులు కల్పించారని, కాకతీయ కళలు, గ్రామీణ ప్రాంతాలకు అద్దం పట్టేలా నిర్మించారన్నారు.



# పుష్కరాల నిర్వహణ మరో నాలుగు రోజులే..

- విజయవంతానికి యంత్రాంగం కృషి చేయాలి..
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్..
- కాళేశ్వరంలో అధికారులతో సమీక్ష..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, (జనంసాక్షి):** పుష్కరాల నిర్వహణ మరో నాలుగు రోజులే మిగిలి ఉందని, ఈ నాలుగు రోజులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కార్యక్రమాల విజయవంతానికి అధికార యంత్రాంగం కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కోరారు. సరస్వతి పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం ఆమె కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ఎనిమిది రోజుల పాటు వైభవంగా కొనసాగిన సరస్వతి పుష్కరాలు రానున్న నాలుగు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన పుష్కరాల నిర్వహణ పట్ల అభినందించారు. వచ్చే నాలుగు రోజులు భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశముండటంతో ముందస్తుగా అన్ని విభాగాలతో సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రత, వైద్యం, రవాణా, తాగునీటి, పారిశుద్యం, వర్షాలు వల్ల విద్యుత్ సమస్యలు, జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పుష్కరాల్లో పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని విభాగాలు సమర్ధవంతంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా వివరించారు. అవసరమైన చోట అదనపు అధికారులు, సిబ్బంది, మెడికల్ టీమ్స్ మోహరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవస్థానం ఈఓ మహేష్, అధికారులు పాల్గొన్నారు.



# సీతక్కకు దివ్యాంగ సంఘాల ప్రతినిధుల సన్మానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను పలు దివ్యాంగ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. దివ్యాంగుల వివాహాలకు లక్ష రూపాయల వివాహ కానుకను అమలు చేసినందుకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో పలు దివ్యాంగ సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు. 10 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యను పరిష్కరించిన సీతక్కకు దివ్యాంగ సంఘాలు సన్మానం చేశాయి. దివ్యాంగుల సంక్షేమం, ఉన్నతి కోసం మరిన్ని పథకాలు అమలు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఆర్టీసీ బస్సులు దివ్యాంగులకు ఉచిత రవాణా అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి సీతక్క అన్నారు. అర్హుల జాబితాలో దివ్యాంగులుంటే, వారి పేరు మీద ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేలా నిబంధనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ కు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగుల పేరు పైన ఇద్దరమ్మ ఇండ్ల మంజూరు, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశాలను సంబంధిత శాఖ మంత్రులతో, ప్రభుత్వంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. దివ్యాంగ సమస్యలను పరిష్కరిస్తున్న మంత్రి సీతక్కకు దివ్యాంగ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ధైనంపల్లి మల్లికార్జున్, వికలాంగుల హక్కుల కార్యకర్త రాజేందర్ తో పాటు వ్యంగ సంఘాల ప్రతినిధులు మంత్రిని కలిశారు.

# వరల్డ్ క్లాస్ విధానాలతో తెలంగాణ జూ పార్కులు నడపాలి

- రాష్ట్రంలోని జూపార్కుల్లో జంతువుల పరిరక్షణకి ప్రత్యేక చర్యలు అవసరం
- జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(జపాట్) 14వ గవర్నింగ్ బాడీ సమావేశంలో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ స్థాయి విధానాలను అవలంభించి రాష్ట్రంలోని జూ పార్కులను నడపాలని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్రంలోని జూ పార్కుల్లో జంతువుల పరిరక్షణకి ప్రత్యేక చర్యలు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైర సౌకర్యాలతో తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ చెప్పారు. జూలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే... సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) 14వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ (హెచ్‌ఓఎఫ్ఎఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు, సిసిఎఫ్ లు ప్రియాంక వర్గీస్, రామలింగం, డైరక్టర్ జూ పార్క్స్ సునీల్ ఎస్. హేరామత్, పలువురు డిఎఫ్ఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేయాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లలమర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగినట్టు అధికారులు మంత్రికి వివరించారు. అయితే, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. అదనపు సౌకర్యాలపై దృష్టి సారించాలని, అందుకు సంబంధించిన అంశాలపై మంత్రి, శాఖ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, గత ఏడాది జూ పార్కుల తాలుకూ నిర్వహణ బడ్జెట్ అనుమతులను మంత్రి నుంచి అధికారులు తీసుకున్నారు.

# వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై కేసు

- టిడిపి నేత ఫిర్యాదుతో పోలీసులు చర్యలు

**నంద్యాల, మే22 (జనంసాక్షి) :** వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డలో కేసు నమోదు అయింది. ఎర్రగుంట్లకు చెందిన నాగ ప్రసాద్ ఫిర్యాదు నేపథ్యంలో భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాంసం దుకాణాల నుంచి కేజీ చికెన్‌పై రూ.25 అదనంగా వసూలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఖండించారు. అంతేకాదు మీడియా ముందుకు వచ్చి ఆమె వివరణ సైతం ఇచ్చారు. కానీ వైసీపీ మాత్రం ఈ ఆరోపణలను కొనసాగిస్తుంది. దీంతో టీడీపీ, వైసీపీ గ్రూప్‌ల మధ్య స్థానికంగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకుంటుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రజలను తప్పుదోవ పట్టించడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులకు వైసీపీ వర్గీయులు కారణమవుతున్నారంటూ నాగ ప్రసాద్.. పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అతడి అనుచరులు అంబటి మహేశ్వర్ రెడ్డి ,శివ శంకర్ రెడ్డి, మల్లికార్జున్, రుద్ర శివ నాగిరెడ్డి, ప్రతాపరెడ్డి ,అంబటి చంద్రశేఖర్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఫెమా నిబంధనలకు విరుద్ధంగా భూమి కొనుగోలు

- ఎమ్మెల్యే యశస్విని అత్త ఝాన్సీరెడ్డికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, మే22 (జనంసాక్షి) :** పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఝాన్సీరెడ్డితో పాటు ఆమె భర్త రాజేందర్ రెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. ఝాన్సీ రెడ్డి 2017లో తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో 75 ఎకరాల భూమిని కొన్నారు. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి భూమి కొనుగోలు చేసిందని దామోదర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. నిబంధనలకు విరుద్ధంగా ఝాన్సీ రెడ్డికి పాస్ బుక్ మంజూరు చేశారని రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్లకు సైతం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భూమి విషయంలో విచారణ పూర్తి చేసి నివేదికను అందించాలని ఈడీ జాయింట్ డైరెక్టర్ కు నోటీసులు జారీ చేసింది హైకోర్టు. ప్రస్తుతం ఆమె పాలకుర్తి కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేయాలని ఝాన్సీ రెడ్డి భావించారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించేందుకు కాంగ్రెస్ ఝాన్సీ రెడ్డిని రంగంలోకి దించేందుకు ప్లాన్ చేసింది. అయితే చివరి నిమిషంలో ఝాన్సీ భారత పౌరసత్వంపై వివాదం చెలరేగింది. ఆమె ఎన్ఆర్ఐ పౌరసత్వం కారణంగా సమస్యలు వస్తాయని భావించి కోడలు యశస్వినీ రెడ్డిని బరిలోకి దింపారు. ఎర్రబెల్లిపై ఆమె విజయం సాధించారు. ఇక చాలా ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లిన ఝాన్సీ రెడ్డి అక్కడ ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) ఫౌండర్, ఫౌండర్ ప్రెసిడెంట్, అడ్వయిజరీ చైర్‌గా వ్యవహరించారు. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో పాటు పలు బిజినెస్‌లు చేశారు. అనంతరం తెలంగాణ పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నికలకు చాలా కాలం క్రితమే స్వస్థలం పాలకుర్తికి వచ్చిన ఆమె.. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

# భూ భారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు పరిష్కారం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం (జనంసాక్షి) :** ప్రభుత్వం భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ధరణి చట్టాన్ని ప్రక్షాళన చేసి, ప్రజలు మెచ్చే విధంగా భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. చట్టం విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు చేపట్టినట్లు, రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 29 జిల్లాల్లో ప్రత్యక్షంగా తాను పర్యటించినట్లు తెలిపారు. ఏ గ్రామం, ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ధరనితో ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశానని అన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు, ఆసాములు భూ భారతి చట్టంపై సంతోషం వెలిబుచ్చారన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్ల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు. జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసి, అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దాదాపు 3200 దరఖాస్తులు స్వీకరించామన్నారు. దరఖాస్తుల్లో 50 శాతానికి పైగా సాదా బైనామ కి సంబంధించి ఉన్నాయని, కోర్ట్ లో సాదా బైనామకి సంబంధించి కేస్ వెకేట్ కాగానే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. జూన్ 2 నాటికి మొదటి విడత పైలట్ మండలాల అన్ని సమస్యలు, రెండో విడత 28 మండలాల్లో సత్వర పరిష్కార సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సాగుయోగ్యమైన అసైన్డ్ భూముల్లో ఉన్న కడు పేదవారికి పట్టాలు ఇస్తామన్నారు. జూన్ 3 నుండి 20 వరకు భూ భారతిచట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారించేందుకు అధికార యంత్రాంగం గ్రామాలకు వస్తుందన్నారు. ప్రతి భూ సమస్య పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధి తో పనిచేస్తారన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారైని నియమిస్తామని మంత్రి తెలిపారు. గతంలో విఆర్వో, విఆర్ఏ లుగా పనిచేసిన వారి నుండి అప్షన్లు తీసికొని, వారికి ఈ నెల 27న పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన వారిని గ్రామ రెవెన్యూ అధికారిగా నియమిస్తామన్నారు.

# ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా

- 150మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అనకాపల్లి, మే22 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనకాపల్లి పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి 150 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. 30 మందిపై కేసులు నమోదు చేశారు. సైబర్, ఆన్ లైన్ మోసాలపై మంగళవారం రాత్రి జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై జిల్లా పోలీసులు గత రెండు రోజులుగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో అచ్యుతాపురం శివారులోని పలు అపార్ట్‌మెంట్లపై దాడి చేసి.. ఈ మోసాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అపార్ట్‌మెంట్లను ఈ ముఠా అద్దెకు తీసుకుని ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన కీలక డేటాను పోలీసులు సేకరించారు. విదేశీయుల ఖాతాలను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్ మోసాలకు ఈ ముఠా పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అపార్ట్‌మెంట్లకు నెలకు రూ. 18 లక్షలు అద్దెగా చెల్లిస్తున్నట్లు పోలీసులు విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ అరెస్టయిన వారంతా యువతి యువకులే కావడం గమనార్హం. స్థానిక పోలీసులతోపాటు సైబర్ పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు.

# చంద్రబాబు ప్రలోభాలకు లొంగిన విజయసాయి

- ఆయన ఇచ్చే ప్రకటనలకు విలువ ఉంటుందా
- లిక్కర్ వ్యవహారంలో చంద్రబాబు నిలువుదోపిడీ
- ఘాటు విమర్శలు చేసిన వైఎస్ జగన్

**అమరావతి, మే22 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాజాగా విజయసాయిరెడ్డిపై, అలాగే రాష్ట్రంలోని లిక్కర్ స్కాంలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతోపాటు నిన్నమొన్నటి వరకు ఉన్న విజయసాయిరెడ్డిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబు ప్రలోభాలకు విజయసాయిరెడ్డి లొంగిపోయారని అయన అన్నారు. ఇంకా మూడేళ్లకు పైగా రాజ్యసభ పదవీ కాలం ఉన్నా.. విజయసాయిరెడ్డి కేవలం కూటమికి ప్రయోజనం కలిగించేందుకే రాజీనామా చేశారని జగన్ ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇచ్చే ప్రకటనలకు ఏమి విలువ ఉంటుంది? అంటూ జగన్ విమర్శించారు. ప్రైవేట్ మాఫియా, డిస్టిలరీ ఆర్డర్లు, లిక్కర్ అమ్మకాలపై చంద్రబాబు హయాంలో జరిగిన అక్రమాలను తెలిపారు. జగన్ మాట్లాడుతూ.. ఏ లిక్కర్ కంపెనీ డిస్టలరీ మేలు చేయాలో ప్రైవేట్ షాపుల పేరుతో వీళ్ళ ప్రైవేట్ సైన్యం ఇండెంట్ ప్లేస్ చేస్తారన్నారు. మా హయాంలో ఎప్పుడైనా ఇలా చూసారా? గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేశామా? అని ప్రశ్నించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370